

# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 18, సంచిక: 7, జులై 2025

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 18 సంచిక: 7

సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు

ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: **పత్తి సుబ్రమణ్యం,**
శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.srivenkatesham.org
Phone: **040–27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| నారాయణ మంత్ర మహిమ | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 9 |
| తిరుప్పావై | 21 |
| భక్తి ముక్తి ప్రదాయకం – శయనైకాదశీ వ్రతం | 27 |
| రామాయణ రత్నాకరం | 30 |
| గురుస్సాక్షాత్ పరబ్రహ్మ | 36 |
| మంగళగౌరీ వ్రతం | 38 |
| ముకుందమాల | 40 |
| మీ ప్రశ్న మా సమాధానం | 43 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 44 |
| శ్రీకృష్ణ తత్త్వం | 50 |
| శ్రీకూర్మావతారం | 52 |
| నాగపంచమీ వ్రతం | 54 |
| తిరుమల సర్వస్వం | 57 |
| కర్మఫలం | 62 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


# చదువు కంటే ఆచరణే ముఖ్యం

భక్తుల ఉద్ధరణకు భగవంతుడు తన వేలాది నామాలను అనుగ్రహించాడు. అందులో ఏ ఒక్క నామాన్నైనా చిత్తశుద్ధిగా స్మరిస్తే భగవంతుని కృప తప్పక లభిస్తుంది. గతంలో అన్నమాచార్యులు కూడా "మమ్ములను ఉద్ధరించుటకు ఒక్క నామమే చాలు, మిగిలినవి మీ భాండాగారమున దాచుకొమ్మని" పాటల రూపంలో తెలిపారు. కాబట్టి భక్తుడు ఆ నామము, ఈ నామము, ఆ రూపము, ఈ రూపము అని పరుగిడక, మనకు నచ్చిన ఒక్క నామమును, ఒక్క రూపమును పట్టుకొని సాధన చేయుట ఉత్తమము. ముఖ్యంగా సాధన ఫలించాలంటే ఏకరూప ధ్యానమే చేయాలి. భగవంతుడు సర్వాతర్యామి, అన్ని రూపాలు, అన్ని నామాలు ఆయనవే కాబట్టి, దేవుడు అని భావించే సకల రూపములలో మనము నమ్మిన ఆ భగవంతుణ్ణి చూచుకోవాలి. ఆయనే ఈ రూపముగా, ఈ పేరుతో ఉన్నాడని విశ్వసించాలి. ఇదే సరైన పద్ధతి. మనకు ఎన్నో పురాణాలు, ఎందరో దేవుళ్ళు ఉన్నారు. అందరి ఆత్మ మనము విశ్వసించే ఆ భగవంతునిదే! అన్ని పురాణాలు చెప్పే విషయం ఒక్కటే! అదే... భగవంతుణ్ణి సంపూర్ణంగా విశ్వసించడం. ఆయనకు శరణాగతులం కావడం, ఈ జన్మ, మనము అనుకున్న మనవారు, ఆస్తులు, అంతస్తులు అన్నీ నశిస్తాయి. కాబట్టి ఓ మానవుడా! 'నా' అన్నది నశింపచేసుకుని జీవించు. నీకు ఆప్తుడు, నా అన్నవాడు కేవలం భగవంతుడే సుమా! అంటూ చెప్తున్నాయి. దీనినే రకరకాల సందర్భాలలో, రకరకాల మాటల ద్వారా మనకు బోధించాయి. ఈ సృష్టిలోని ప్రతీదీ భగవంతునిదే, మనది అనేది ఏదీ లేదు కాబట్టి మోహమాయ నుండి బయటకు రమ్మని పిలుపునిచ్చాయి. శ్రీ ఆది శంకరాచార్యుల వారు మరొక్క అడుగు ముందుకు వేసి, ఓ మానవుడా! చదివింది చాలు, గోవిందుణ్ణి స్మరిస్తూ జీవించమంటూ చెప్పారు. చదువుట కంటే ఆచరించుట గొప్ప విషయం. ఆచరణ ద్వారానే భగవంతుడు మనకు దగ్గరవుతాడు. డిగ్రీలు చదివిన వాని కంటే కూడా ఒంటికి పట్టించుకుని ఆచరించువాడు ఉత్తముడు. కాబట్టి, భక్తుడు, తాను ఆధ్యాత్మిక పుస్తకాలు చదవలేదని, లేదా చదివే స్తోమత తనకు లేదని, బాధపడవలసిన అవసరం లేదు. తనకు తోచిన, నచ్చిన భగవంతుని నామాన్ని పట్టుకుని సాధన చేస్తే సరిపోతుంది. ఇదే విషయాన్ని 'భజగోవిందం'లో శంకరాచార్యులవారు చెప్పారు.

ఈ సృష్టికి మూలము, ఆది, అంతము శ్రీమన్నారాయణుడే! ఆయన వివిధ అంగములు వివిధ దేవతలని భగవద్గీతలో ఆయన స్పష్టంగా చెప్పారు. ఆయన ఒక్కొక్క యుగములో ఒక్కొక్క అవతారమును ధరించి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసి భక్తులను ఉద్ధరించారు. ప్రస్తుతం ఈ కలియుగంలో శ్రీవేంకటేశ్వరుని రూపమును ధరించి తిరుమల కొండపై మన ఉద్ధరణకై వెలసి ఉన్నారు. అన్ని రూపములు, అన్ని నామములు ఆయనవే కాబట్టి శ్రీవేంకటేశ్వరుని అష్టాక్షరీ మంత్రమును సదా స్మరిస్తూ, ఆయన రూపమును దర్శిస్తూ, జీవించు మానవుడు ధన్యుడు. ఈ పద్ధతిని అనుసరించువారు వేలాది ఆధ్యాత్మిక పుస్తకాలను, వేలాది దేవతలను స్మరించిన పుణ్యమును మూట కట్టుకోగలరనుటలో సందేహము లేదు. మా నుండి ఉచిత స్వామివారి జప పుస్తకములను పొంది, లేదా మీ వద్ద ఉన్న ఒక పేపరు పైన సదా ఆయన నామాన్ని వ్రాయుచూ స్మరిస్తూ కాలం గడుపుదాం. లోకంలోని అన్ని వ్యామోహాలను త్యజించి శ్రీవేంకటేశ్వరుని ఆశ్రయించి తరిద్దాం! నమో వేంకటేశాయ! గోవిందా! గోవిందా!

నమో వేంకటేశాయ

వినా వేంకటేశం న నాథో న నాథః ।
సదా వేంకటేశం స్మరామి స్మరామి ॥

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)


- 2 సం॥ 500-00
- 4 సం॥ 1,000-00
- జీవిత చందా 5,000-00
- పోషకులు 10,000-00
- రాజపోషకులు 50,000-00

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank, Habsiguda, Hyderabadలో చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు: ______________________
______________________
చిరునామా: ______________________
______________________
______________________
______________________
______________________
పిన్‌కోడ్: ______________________
చందా వివరాలు: ______________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

శ్లో ॥ "సద్యోవికాసి సముదిత్వర సాంద్రరాగ
సౌరభ్య నిర్భర సరోరుహ సామ్య వార్తామ్
సమ్యక్షు సాహసపదేషు విలేఖయంతౌ
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే"

తాత్పర్యం – శ్రీవేంకటేశ్వరా! మిక్కిలి ఎర్రనివై వికసించుచుండు నంతలోనే సువాసన నిండుగ కల్గియున్న పద్మములతో నీ శ్రీపాదములు పోలినవిగా ఉన్నవా? అని సందేహముతో పల్కినను, ఆ మాట కూడా మొరటుగా చేసిన ఒక కార్యముగా చెప్పదగినట్లున్న, మిక్కిలి ఎర్రగా ఉండి, సువాసనలను వెదజల్లుచు, వికసించిన నీ పాదములను శరణు పొందుచున్నాను (వేడుచున్నాను).

శ్లో ॥ "రేఖామయధ్వజ సుధాకలశాతపత్ర
వజ్రాంకుశాంబురుహ కల్పక శంఖ చక్రైః
భవ్యై రలంకృత తలౌ పరతత్త్వ చిహ్నైః
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే"

తాత్పర్యం – శ్రీవేంకటేశ్వరా! నీ అరికాళ్ళలో(పాదతలములలో) జెండా, అమృత కలశము, గొడుగు, వజ్రాయుధము, అంకుశము, పద్మము, కల్పవృక్షము, శంఖము, చక్రము అనెడి పరతత్త్వమునకు (శ్రీమన్నారాయణునికి) ఉండదగిన శుభ లక్షణములు గలవు. అట్టి నీ శ్రీ పాదములను శరణు వేడుచున్నాను.



# ముక్తిమార్గము

భావానువాదం:

శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య

అది నా యపరాధ – మిది నా యపరాధ
మదియు నిదియు నా – యపరాధము ||పల్లవి||

1. నెరయ రూపములెల్ల – నీ రూపమే కా
నరయని యది నా – యపరాధము,
పరిపూర్ణుఁడగు నిన్నుఁ – బరిచ్ఛిన్నునిఁగా
నరయుట నది నా – యపరాధము ||అది||

2. జీవాత్మునిఁగాఁ – జింతింపఁ దలచుట
యా వంక నది నా – యపరాధము,
సేవించి నిను నాత్మఁ – జింతింపకుండుట
ఆవల నిది నా – యపరాధము ||అది||

3. ఈడెఱుఁగక వెంక –టేశుఁడ నినుఁగొని
యాడుట యది నా – యపరాధము,
ఏడఁజూచిన నా – యెదుర నుండఁగ నిన్ను
నాడ నీడ వెదకు – టపరాధము ||అది||






భావము – దేవా! అది నా తప్పు. ఇది నా తప్పు. అది, ఇది రెండును నా తప్పులే. విశ్వమున దోచు సమస్త రూపములు నీ రూపమే అని గుర్తింపకపోవుట నేను చేసిన తప్పు. ఎల్లయెడల నిండి పరిపూర్ణ స్వరూపుడవై కొలదిమీరి (అపరిచ్ఛిన్నుడవై) యున్న నిన్ను నీ దేశకాల నామ రూపాదులకు లోబడిన వానినిగా (పరిచ్ఛిన్నునిగా) భావించుటయు నా తప్పిదమే. పరమాత్ముడై యున్న నిన్నొక జీవాత్మునిగా చింతించుట నా తప్పు. దివ్య మంగళమూర్తివైన నిన్ను సేవించి చిత్తములో సదా భావింపకుండుటయు నేనొనర్చిన తప్పిదమే. నా శక్తియుక్తులను లెక్కగొనక వాక్కుల కందని మహిమాతిశయము గల నిన్ను నేను స్తుతింపబూనుట నా అపరాధము, సర్వత్రా వ్యాప్తుడవై ఎక్కడ చూచినను ఎదుటనే ఉన్న నేను ఎందో ఉన్నావని అక్కడ, ఇక్కడ అన్వేషింపబూనుటయు నేను చేసిన యపరాధమే.

# నారాయణ మంత్ర మహిమ

– చిల్లర సీతారామారావు



**"నారాజలమితి ప్రోక్తా అయనం తస్యవాయతః**
**అతో నారాయణో నామగేయతే పురుషోత్తమః"**

జలములకు నారములు అని పేరు. పరమాత్మ అనంత జలరాశిలో శయనిస్తాడు. కనుక ఆయనకు నారాయణ అను పేరు వచ్చింది. నారాయణ శబ్దము మహిమాన్వితము.

**"నకార పదోచ్చారణ మాత్రే నైవ నాకాధిప భోగం లభతే**
**రకార పదోచ్చారణేన రామరాజ్య భోగ లభతే**
**యకార పదోచ్చారణేన కుబేరవత్ ప్రకాశతే**
**ణకార పదోచ్చారణేన వైరాగ్యం లభతే"**

న అను అక్షరమును ఉచ్చరించుట చేత ఇంద్ర భోగములు లభిస్తాయి. ర అను అక్షరమును ఉచ్చరించుట చేత రామరాజ్యము నందుండిన భోగములు లభిస్తాయి. య అను అక్షరమును ఉచ్చరించుట చేత కుబేరునివలె సర్వసంపదలతో ప్రకాశిస్తాడు. ణ అను అక్షరమును ఉచ్చరించుట చేత ఐహిక సుఖముల పట్ల విముఖత కలిగి, దైవచింతన పట్ల ఆసక్తి కలిగి మోక్షమును పొందుటకు మార్గము లభిస్తుంది. ఇంతటి శక్తివంతమైన నారాయణ అను శబ్దమునకు ఓంకారము, నమః అను పదములను చేర్చినచో ఓం నమో నారాయణాయ అను అష్టాక్షరీ మంత్రము ఏర్పడును. ఆ మంత్రము మహోన్నతమైన శక్తిగల మంత్రరాజము.

**శ్లో ॥ "నారాయణ మితి వ్యాజా దుచ్చార్య కలుషాశ్రయః**
**అజామిలోఽ ప్యాగాద్ ధామకిముత శ్రద్ధయాగుణాన్"**

పుత్రుడిని పిలుచు నెపముతో నారాయణ అను శబ్దోచ్చారణ మాత్రము చేతనే మహాపాపాత్ముడగు అజామిళుడు అవసాన కాలమున వైకుంఠమునకు వెళ్ళిపోయాడు. భక్తి ప్రపత్తులతో నారాయణుని నామస్మరణము గావించువారికి ముక్తి లభించును అనుటలో ఆశ్చర్యమేమున్నది? ఓం నమో నారాయణాయ అను అష్టాక్షరీ మంత్రమును జపించితే, జనన మరణ సంయుక్తమైన సంసార రూప బంధనముల నుండి విముక్తులవుట తథ్యము. అష్టాక్షరీ మంత్రమునకు సాక్షాత్తు నారాయణుడే ఋషి. దేవి గాయత్రి ఛందము. పరమాత్మ దేవత.

**శ్లో ॥ "శుక్లవర్ణంచ ఓంకారం నకారం రక్తముచ్యతే**
**మోకారం వర్ణతః కృష్ణం నాకారం రక్తముచ్యతే**
**రాకారం కుంకుమాభాంతు యకారం పీతముచ్యతే**

ణాకారం మంజనాభంతు యకారం బహువర్ణకమ్"

ఓం నారాయణాయ మంత్రములోని ఓం కారము శుక్లవర్ణము. న కారము రక్తవర్ణము. మో కారము కృష్ణవర్ణము. నా కారము రక్త వర్ణము. రా కారము కుంకుమరంగు వర్ణము. య కారము పీత వర్ణము. ణా కారము అంజనము వలె కృష్ణవర్ణము. య కారము వివిధ వర్ణాల సముదాయము. ఈ మంత్రమును భక్తితో జపించితే స్వర్గము, మోక్షము ప్రాప్తిస్తాయి.

శ్లో ॥ "శ్రీమన్నామ ప్రోచ్య నారాయణాఖ్యం
కేన ప్రాపుర్వాంఛితం పాపినోఽపి
హానః పూర్వం వాక్ప్రవృత్తాన తస్మిన్
తేన ప్రాప్తం గర్భవాసాది దుఃఖమ్"

శ్రీమన్నారాయణుడి నామమును స్మరించిన పాపాత్ములు కూడా వారి యొక్క సర్వభీష్టములు పొందారు. పూర్వజన్మమందు శ్రీమన్నారాయణ నామ స్మరణము చేయకపోవడం చేతనే ఇప్పుడు దుఃఖ భాజకమైన జన్మ ప్రాప్తించింది. గత జన్మలో శ్రీమన్నారాయణుడి నామస్మరణము గావించినచో మోక్షము తప్పక ప్రాప్తించి యుండేది.

పూర్వము ఆరుణి అను ఒక మహర్షి దేవికా నదీ తీరమున ఒక ఆశ్రమమును నిర్మించుకొని నివసించసాగాడు. ప్రాతః కాలముననే లేచి దేవికానదిలో స్నానము చేసి నారాయణ మూర్తికి అర్ఘ్యప్రదానము గావించడం ఆయన నిత్యవృత్తి. రోజుమాదిరిగానే స్నానాదులు ముగించుకొని జపము చేసుకొనుచుండగా ఒక బోయవాడు అక్కడికి వచ్చాడు. ఆరుణి మహర్షి ఆ బోయవాడిని చూశాడు. అతడి చేతిలో ఒక పెద్ద ధనుస్సు ఉంది. అతడి కళ్ళు ఎఱ్ఱగా, భయంకరంగా ఉన్నాయి. ఆ బోయవాడు ఆరుణిని హింసించి గాని, వధించి గాని, ఆయన వల్కలములను స్వాధీనము చేసుకుందామని ముందుకు వచ్చాడు. బోయవానిని చూచి ఆరుణి మహర్షి భయముతో వణికిపోయాడు. కాళ్ళు చేతులు గజగజ వణకసాగాయి. ముందుకు వచ్చిన బోయవాడు ఆరుణి ముఖమునందు ప్రకాశిస్తున్న తేజస్సును చూచి, తన చేతిలోని ధనుస్సును, బాణములను క్రింద పడవేశాడు. తటాలున ఆరుణి మహర్షి పాదముల మీద పడిపోయాడు. రోదిస్తూ ప్రార్థించసాగాడు. స్వామీ! నన్ను మన్నించండి. మీ వల్కలములను తీసుకుందామని, దానికోసం మిమ్మలను వధించాలని అనుకొని ఇక్కడికి వచ్చాను. కాని మీ ముఖములోని తేజస్సును చూడగానే నాలో తెలియకుండానే మార్పు వచ్చింది. నేను పాపాత్ముడను. చాలామందిని చంపాను. చాలా పాపములను మూటగట్టుకున్నాను. నన్ను కరుణించి నాకు ఉపదేశమునివ్వండి. పాపముల నుండి నన్ను కాపాడండి. బోయవాడు ఎంత విలపిస్తున్నప్పటికీ, ఎంత ప్రార్థిస్తున్నప్పటికీ, అతడు మహాపాపి యని భావించి ఏమీ మాటలాడకుండా తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు. బోయవాడి హృదయంలో కాఠిన్యం పోయి ధర్మం వైపు మరలడంతో, ఆరుణి ఏమీ మాట్లాడకపోయినప్పటికీ ఆయనను అనుసరించి ఆశ్రమమునకు చేరుకుని అక్కడనే ఉండసాగాడు. ఆరుణి నిత్యం దేవికా నదిలో స్నానం చేసి వృక్షము కింద కూర్చుని తపము చేసుకుంటున్నాడు. బోయవాడు కూడా దేవికా నదిలో స్నానము చేసి ఒక వృక్షము క్రింద కూర్చుని తపము చేయసాగాడు. ఈవిధముగా వారిరువురూ వారి వారి తపములను చేసుకొనసాగారు. ఇలా కొంతకాలము గడిచిపోయింది. ఒకరోజు ఆరుణి మహర్షి నదిలో స్నానము చేద్దామని నదిలోనికి వెళ్ళాడు. అదే సమయానికి ఒక వ్యాఘ్రము ఆరుణిని చూచి ఆయన మీదికి దుమకడానికి రాసాగింది. అది గమనించిన ఆరుణి భయముతో వణకసాగాడు. భగవంతుడే దిక్కు అని 'ఓం నమో నారాయణాయ' అను మంత్రమును ఉచ్చరించాడు. స్నానార్థము వస్తున్న బోయవాడు వ్యాఘ్రమును చూచి ఒక బాణమును వేశాడు. ఆ బాణముతో అది నేలకూలుతూ ఆరుణి మహర్షి ఉచ్చరించిన 'ఓం నమో నారాయణాయ' మంత్రమును విన్నది. వినిన వెంటనే ఆ వ్యాఘ్రము ఒక గంధర్వుడిగా మారిపోయింది. ఆ గంధర్వుడు ఆరుణి మహర్షితో – ద్విజోత్తమా! మీ అనుగ్రహం వల్ల నా శాపము తొలగిపోయింది. నేను నా లోకమునకు పోతున్నాను అని పలికాడు. గంధర్వుడితో ఆరుణి మహర్షి – ఎవరు నీవు? అని ప్రశ్నించాడు. గంధర్వుడు తన గాథను వినిపించసాగాడు.

మునీశ్వరా! పూర్వజన్మలో నేను ఖ్యాతి గడించిన మహారాజును. నా పేరు దీర్ఘబాహువు. వేదములను, శాస్త్రములను అధ్యయనం గావించాను. ఆ అధ్యయనం వల్ల నాలో అహంకారం అధికమయింది. కన్ను మిన్ను గానక అహంకార మదముతో అందరినీ అవమానించడం మొదలుపెట్టాను. బ్రాహ్మణులను సైతం విడిచిపెట్టలేదు. సహనం నశించిన బ్రాహ్మణులు నన్ను వ్యాఘ్రము కమ్మని శపించారు. జరిగిన అపరాధమును గ్రహించిన నేను శాప విమోచనమును ప్రసాదించమని ప్రాధేయపడ్డాను. శాంతస్వభావులు, దయామూర్తులు, క్షమావంతులు అయిన ఆ బ్రాహ్మణులు నన్ను కరుణించి శాపవిమోచనమును తెలియచేశారు. వ్యాఘ్ర రూపములో నున్నప్పుడు ఒక సద్బ్రాహ్మణుని వధించడానికి, ఆయన మీదకు దుమికే సమయంలో ఒక బాణము తగిలి, నేను క్రింద పడిపోయే సమయంలో ఆ బ్రాహ్మణుడి నోటివెంట వెలువడే నమో నారాయణాయ అను నారాయణ మంత్రము వినగానే నాకు శాపము నుండి విముక్తి కలుగగలదని వారు నాకు శాప విమోచనమును తెలియచేశారు. మీ నోటినుండి వెలువడిన నారాయణ మంత్రము వలన నాకు శాపవిమోచనము కలిగింది అని పలికి ఆరుణి మహర్షికి నమస్కరించి వెళ్ళిపోయాడు

గంధర్వుడు.

ఆరుణి మహర్షి బోయవాడితో – వ్యాధుడా! వ్యాఘ్రమునకు బలి కాబోతున్న నా ప్రాణమును రక్షించిన మానవత్వమును ప్రసాదించావు. నీవు గావించిన కార్యమునకు నేను ప్రసన్నుడనయినాను. నీకు వరము ప్రసాదిస్తాను. ఏ వరము కావలెనో నిస్సంకోచముగా అడుగుము అని పలికాడు. దానికి సమాధానంగా బోయవాడు – మహాత్మా! మీరు వాత్సల్యంతో నాతో మాట్లాడారు. ఇంతకంటే గొప్ప వరం ఇంకేముంటుంది? అయినా వరంతో నాకు పని ఏమున్నది? ఆ వరమును నేనేమి చేసుకోవాలి? అని అన్నాడు. బోయవాడి సమాధానము ద్వారా వ్యాధుడు తపము ద్వారా మోక్షమును పొందగోరుతున్నాడని అర్థమయింది. వ్యాధుడితో ఆరుణి మహర్షి ఇలా అన్నాడు. 'వ్యాధుడా! నీకు నారాయణ మంత్రము జపిస్తూ తపము చేయవలెనన్న ఆలోచన వచ్చింది. నన్ను అభ్యర్థించావు. కాని ఆ సమయంలో నీవు క్రూరమైన పాప కర్మములను గావించిన పాపాత్ముడివి. ప్రస్తుతం నీలో మార్పు వచ్చింది. నీ అంతఃకరణము పరమ పవిత్రముగా మారిపోయింది. అలా మారిపోవడానికి కారణం నీవు ప్రతిరోజూ దేవికానదిలో స్నానమాచరించడము, రోజూ నన్ను దర్శించుకోవడము, నిత్యం నారాయణ మంత్రమును వినడం. అందువలన నీవు ఇక్కడే ఉండి తపము చేసుకొనుము. నిష్కల్మష భావనతో వ్రతమాచరింపుము. ఈ వ్రతమును ఆచరించునప్పుడు అన్నము తినకూడదు. అసత్యము చెప్పకూడదు అని పలికి ఆశ్రమము నుండి ఎక్కడికో వెళ్ళిపోయాడు.

బోయవాడు నిత్యము దేవికానదిలో స్నానము చేసి గురువుగారిని స్మరించుకుంటూ, నారాయణ మంత్రమును జపిస్తూ తపము చేయసాగాడు. గురువుగారు చెప్పినది గుర్తుపెట్టుకుని నిరాహారుడై తపము చేయసాగాడు. వృక్షముల నుండి రాలి క్రిందపడి ఎండిపోయిన పత్రములను భుజించేవాడు. ఒకసారి ఎండిన పత్రములను తినబోవుచుండగా ఆకాశవాణి వినిపించింది. దాని ప్రకారం ఈ వృక్షపు ఆకులు నికృష్టమైనవి. కావున తినకూడదు. ఆ వృక్షపు ఆకులు తినడం మాని, వేరొక వృక్షము దగ్గరకు పోయాడు. అక్కడా అదేమాదిరి ఆకాశవాణి వినిపించింది. వ్యాధుడు నిరంతరం గురువును స్మరించుకుంటూ నిరాహారుడై తపము చేయసాగాడు. తపస్సు చేత, నిరాహారము చేత అతని శరీరం చిక్కి శల్యమయింది. చూపరులకు అతడు ఒక అస్థిపంజరము లాగా కనిపించసాగాడు.

దూర్వాస మహర్షి ఒకనాడు వ్యాధుడి దగ్గరకు వచ్చాడు. వ్యాధుడిలో పవిత్రభావాలు ఎంతవరకు ఉన్నాయి? ఇంద్రియ జయత్వం ఎంతవరకు వచ్చింది? తపస్సు ద్వారా ఎంతవరకు బలాన్నిప్రాప్తించుకున్నాడు – వీడిని పరీక్షించడానికే దూర్వాసుడు అక్కడికి వచ్చాడు. వ్యాధుడు దూర్వాస మహర్షిని చూడగానే ఆనందంతో శిరస్సు వంచి ప్రణామం చేశాడు. వినయంతో ఇలా అన్నాడు – ''మహాత్మా! ఈ దీనుడి మీద దయ కలిగి ఇంతదూరం వచ్చినందుకు ఆనందంగా ఉంది. మీ దర్శనభాగ్యం వలన నేను కృతార్థుడనయినాను. ఎండిపోయిన దళములు మున్నగువాటితో అతిథులకు తృప్తిని కలిగిద్దామనుకుంటున్నాను. నా ప్రార్థనను మన్నించి నా ఆతిథ్యమును స్వీకరించండి'' అన్నాడు. దూర్వాసుడు ఆనందంతో వ్యాధుడి ఆతిథ్యము స్వీకరించడానికి అంగీకరించాడు. సిద్ధాన్నముతో భోజనము పెట్టమని ఆదేశించాడు. దూర్వాసుడి ఆదేశమును వినిన వ్యాధుడు ఆలోచనలో పడిపోయాడు. ఇప్పటికిప్పుడు సిద్ధాన్నము ఎలా వస్తుంది? అని చింతించసాగాడు. ఆలోచనలో ఉండగానే ఆకాశము నుండి ఒక బంగారు పళ్ళెరము క్రింద పడింది. దానిని తీసుకుని వ్యాధుడు భిక్షకు బయలుదేరాడు. ఆరోజు అతని అదృష్టమేమో గాని పళ్ళెరము భిక్షతో నిండిపోయింది. దానిని తీసుకుని తన స్వస్థలమునకు రాగా, అక్కడ దూర్వాస మహర్షి ఆసనం మీద కూర్చుని కనిపించాడు. వ్యాధుడు దూర్వాసముని దగ్గరకు వెళ్ళి పాద ప్రక్షాళనము గావించుకొని ఆసనము మీద కూర్చొనవలసిందని ప్రార్థించాడు. వ్యాధుడిని పరీక్షిద్దామనుకొని దూర్వాసమహర్షి వ్యాధుడితో – వ్యాధా! నేను నది వరకు నడిచే స్థితిలో లేను. నా దగ్గర జలము కూడా లేదు. నేను కాళ్ళు ఎలా కడుక్కోవాలి అని పలికాడు. ఏమి చేయాలో అర్థం కాని వ్యాధుడు దేవికా నదిని ప్రార్థించాడు. వ్యాధుడి ప్రార్థనను మన్నించి దేవికా నది దూర్వాస మహర్షి దగ్గరకు వచ్చింది. అది చూచి దూర్వాస మహర్షి ఆనందభరితుడయ్యాడు. పాదప్రక్షాళనము గావించుకొని ఆనందముగా భిక్షను స్వీకరించాడు. తృప్తుడైన దూర్వాసమహర్షి వ్యాధుడితో – వ్యాధా! గురువుగారిని స్మరించుకుంటూ, నిష్కల్మషంగా, నిరాహారివై తపము చేసుకుంటున్న కారణము చేత నీ పాత సంస్కారం అంతరించిపోయింది. నీ అంతఃకరణంలో ఇప్పుడు శుద్ధరూపుడు, అవినాశి, పరమాత్మ నివాసం ఉంటున్నాడు. కావున నీవు ఇప్పుడు పవిత్రుడివి. కాబట్టి నీకు వేదాలు, శాస్త్రాలు బాగా పరిచితమవుతాయి అని పలుకుతూ దూర్వాసమహర్షి వ్యాధుడికి కొత్తపేరు పెట్టాడు. ఎల్లప్పుడూ సత్యము కొరకు తపిస్తున్నావు కాబట్టి సత్యతపుడు అనే పేరుతో గొప్ప ఋషివి అవుతావు అని వ్యాధుడిని ఆశీర్వదించాడు.

వ్యాధుడు క్రూరుడు, పాపాత్ముడు అయినప్పటికీ, ఆరుణి మహర్షితో సాంగత్యము ఏర్పడిన తరువాత, ఆయన ఉపదేశముతో నారాయణ మంత్రమును జపిస్తూ, దూర్వాస మహర్షి బోధనలు, ఆశీర్వాదాలతో పరిపూర్ణ వ్యక్తిగా పరిణతి చెందాడు. సర్వదా నారాయణ మంత్రమును జపించితే అది రక్షగా నిలబడుతుంది. కాపాడుతుంది.



# 28వ భాగము

## తిరుమల శ్రీ వేంకటేశ్వరుని


# దిశానిర్దేశం

## స్వామి వారి దివ్య లీలలు

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**


శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

— **గోవింద దాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)

**దిశా నిర్దేశం :** సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 28 వ భాగపు లీలల ప్రచురణ. (సెప్టెంబర్ 2013 నుండి ఫిబ్రవరి 2014 వరకు).

ఈ కాలంలో రకరకాల శారీరక బాధలు కలిగించి జీవితపు చరమాంకమునకు తీసుకెళ్ళారు. ఫలితంగా వ్యాపారంపై మనస్సు వెళ్ళలేదు. మరియు మా తల్లితండ్రులను చూడాలనే కోరిక ననుసరించి వారిని చూపారు. ముఖ్యంగా మా తల్లికి వైకుంఠం ప్రాప్తించిందని నిదర్శనాలను చూపారు. ''ఓయీ! నీ అన్ని కోరికలను తీర్చాను. నా కోరికను తీర్చమన్నారు''.

### ఉన్నంతలో తృప్తిగా జీవించమని మా తండ్రిచే హితబోధ చేయించుట


తిరుమల శ్రీవేంకటేశ్వరుడు నాలో 'నా' అన్నది నశింపచేయుటకు ఎంతో ప్రయత్నించారు. నేను యోగ్యత సాధించుటే లక్ష్యంగా పరిస్థితులను కల్పించి లీలలను చూపేవారు. చివరికి 1990 లో చనిపోయిన మా తండ్రి చేత హితబోధ చేయించారు. ఇది అత్యంత విశ్లేషణాత్మకమైన ఒక దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా ఉన్న మధురమైన లీల. ఆ లీల ఈ విధంగా ఉంది.

స్వామివారికి 11వ పర్యాయంగా 7 కోట్ల జపాన్ని సమర్పించి వచ్చిన తరువాత ఈ జపాన్ని స్వీకరించినట్లైతే మా తల్లితండ్రులను చూపమంటూ ఇలా ప్రార్థించాను. ''ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! నేను మీకు 11వ పర్యాయంగా 7 కోట్ల జపమును సమర్పించాను. ఇట్టి సేవ చేసే ఈ మానవ జన్మకు కారణమైన నా తల్లితండ్రులను చూపించమని వేడుకున్నాను. ఇద్దరినీ లేదా ఎవరినైనా ఒకరిని చాలా దగ్గరగా చూడాలి, వారితో తనివితీరా మాట్లాడి అత్యంత తృప్తి చెందాలని కోరాను. మరియు మా తల్లితండ్రులు వారు చనిపోయే ముందటి రూపము కాకుండా వారు ఆరోగ్యముగా ఉన్న రూపమును చూపమన్నాను. ఈ కోరికను తీర్చినట్లైతే మీరు 11వ పర్యాయంగా 7

కోట్ల జపమును స్వీకరించినట్లు భావిస్తానని చెప్పాను''.

నా ఈ కోరికను స్వామివారు బహు చక్కగా తీర్చారు, కాని ఒక దెబ్బకు రెండు పిట్టలు లాగా ఒకప్రక్క నా కోరికను నెరవేర్చుచు మరోప్రక్క నాలో 'నా' అన్నది నశింపచేసుకుని ఉన్నంతలో తృప్తిగా జీవించుమనే సందేశాన్నిచ్చారు. ఈ సమయాన నా పెద్ద కొడుకు చి॥ వేదాంత్ అమెరికాలో వాడి ఎం.ఎస్ చివరి సెమిస్టర్ లో ఉన్నాడు. మరియు క్యాంపస్ ఇంటర్వ్యూలో మంచి వేతనముతో చక్కటి ఉద్యోగాన్ని సాధించాడు. ఈ పరిస్థితులను ఉపయోగించి ఒక విశ్లేషణాత్మక అద్భుతమైన లీలను ప్రసాదించారు.

**తేది 08-09-2013 కల :** ఈ కలలో నేను ఒక విదేశమునకు వెళ్ళాను. అక్కడ మన భారతీయులు కొందరు జీవనాధారమునకు వెళ్ళి నివసిస్తున్నారు. అక్కడి వారి ఇళ్ళు, పరిస్థితులు చాలా బాగున్నాయి. నేను, నాకు తెలిసిన ఒక మిత్రుని ఇంటిలో గెస్టుగా ఉన్నాను. ఆ మిత్రుడు కొంతమంది తెలుగు ప్రజల సమూహములో నివసిస్తున్నాడు. ఒక రెండు రోజులు గడిచాక ఆ తెలుగు ప్రజలలో ఒకామె వచ్చి ''మీ తండ్రి ఇక్కడనే ఉన్నాడు'' అని నాతో చెప్పింది. మరియు ఆయనకు నా రాక గురించి తెలుసన్నది, పైగా నేను ఎక్కడున్నది, ఎలా ఉన్నదీ తెలియక బెంగ పెట్టుకున్నాడన్నది. ఆయన కూడా ఆ ప్రాంతానికి జీవనోపాధి గురించి చాలా రోజుల క్రితం వచ్చారట. ఆ తరువాత నేను మా తండ్రి వద్దకు ఆత్రుతతో వెళ్ళాను. ఆయనను చూచాను. ఎంతో సంతోషించాను. ఆయన చనిపోయిన నాటికంటె 20 సంవత్సరాల ముందుటి రూపముగా ఆరోగ్యంగా ఉన్నాడు. తెల్లని వస్త్రాలు ధరించి ఉన్నాడు. ఆయన మరియు ఆయన ఒక మిత్రుడు కలిసి ఒక వ్యవసాయ క్షేత్రములో పని చేస్తున్నారు. చెట్లకు నీరు పెట్టుట ఆయన పని. ఆ నీరు చాలా స్వచ్ఛంగా ఉన్నది. పెద్దదైన ఒక పచ్చని వ్యవసాయ పొలము, పెద్ద పెద్ద చెట్లు కనబడ్డవి. ఆ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న ఒక బండపై ఆయనకు ఎదురుగా కూర్చుండి ఆయనతో తృప్తిగా చాలాసేపు మాట్లాడాను. ఆయనతో మాట్లాడిన తరువాత ఆయన చాలా తృప్తిగా జీవిస్తున్నట్లు అర్థమయింది. ఇంతలో మాటల మధ్యన నీకు ఎంత జీతం ఇస్తున్నారని అడిగాను. దానికాయన 150 డాలర్లని బదులిచ్చారు. ఇంతలో నేను ఈ చిన్నపాటి సంపాదనకు తృప్తి చెందక ''ఇంత దానికి నీవు మన ఇంటిని వదిలి ఇక్కడికి రావలెనా? మన వేదాంత్ నెలకు 3000 డాలర్లకు పైగా



మా తండ్రితో మాట్లాడుట

సం పాదిస్తున్నాడు, నీవు ఈ ఉద్యోగాన్ని వదులు, మన ఇంటికి వెళ్ళుదామని'' అన్నాను. దానికి ఆయన ఒక పరిపూర్ణుడైన గురువులాగా అత్యంత తృప్తితో నెమ్మదిగా తలూపుచూ నా కోరికను కాదన్నాడు, తను ఆ స్థితిలో అత్యంత తృప్తిగా ఉన్నట్లు సంకేతమిచ్చాడు. ఇది నాకు కలలోనే కనువిప్పు కలిగించింది, మరియు నాలో తృప్తి భావం వ్యాపించింది. కల చెదిరింది.

ఈ కలలో మొదట నేను మా తండ్రి గురించి చింతించాను. తరువాత ఆయన జీవనమును చూచి జాలిపడ్డాను. కాని తరువాత ఆయన ఒక పరిపూర్ణుడైన వ్యక్తి లాగా, అత్యంత తృప్తితో జీవించుట చూచి నాకు కనువిప్పు కలిగింది. వెంటనే నాలో కూడా తృప్తి భావం వ్యాపించింది. మనస్సు చల్లనైంది. అత్యంత తృప్తితో హాయిగా అనిపించింది. దీనర్థం... శ్రీవేంకటేశ్వరుడు నేను కోరినట్లు మా తండ్రిని ఒక ప్రక్క చూపుచు, మరోప్రక్క వారిచే హితబోధ చేయించారు. ఉరుకులు పరుగులు లేకుండా వ్యాపారము మానివేసి ఉన్నంతలో తృప్తిగా జీవించుమనే సందేశం ఇప్పించారు.

## చిన్నగుండవెల్లి భూములు విలువైనవిగా మారునని చెప్పట

హరినామ క్షేత్రము నిర్మించనున్న మా చిన్నగుండవెల్లి భూముల గురించి స్వామివారు మరో చక్కని లీలను చూపెట్టారు. అక్కడ భూముల విలువ పెరుగునని, హోటల్స్, షాపులు వెలుస్తాయని సూచించారు. ఇంతకు ముందు మా తోటబావి వద్ద ఎక్కడ పడితే అక్కడ బహిర్భూమికి వెళ్ళేది, ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదని సూచించారు. కాని ఆ రోజులలో దీని అర్థమును గ్రహించలేదు.

**తేది 11-10-2013 కల :** నేను చిన్నగుండవెల్లిలోని మా తోటబావి వద్దకు పోయాను. ఆ గుడ్డము దున్నబడి నాగలి సాలులు చక్కగా కనిపిస్తున్నాయి. ఇంతలో నేను బహిర్భూమికి వెళ్ళాల్సి వచ్చింది. చిన్నప్పటి అలవాటు ప్రకారం ఎక్కడెక్కడ అవకాశం ఉందో ఆ ప్రాంతాలకు వెళ్ళాను. కాని అక్కడ అందరూ జనాలు ఉన్నారు. ఇంతలో మరికొంతమంది జనాలు వచ్చారు. నాకు తెలిసిన మరో చోటుకు పోయాను. అక్కడ అన్నీ దుకాణాలు, హోటల్స్ వెలిసి మనుష్యులు ఉన్నారు. మేము పూర్వం ఒక బాత్రూమ్ నిర్మించామట, అక్కడికి వెళ్ళాను. అక్కడ దీనిని అనుకుని ఒక హోటల్ వెలిసింది. స్థలము ఇరుకుగా ఉండుట వలన ఈ బాత్రూమ్ గోడను తీసివేశారు. కుండీ ఆనవాళ్ళు కనబడ్డాయి. ఇలా మా ప్రాంతమంతా కట్టడాలు, హోటళ్ళతో జనాలు నిండి వున్నారు. ఇంతే కల.

దీని అర్థం – భవిష్యత్తులో అక్కడ దుకాణాలు, హోటళ్ళు రాగలవని, ఎక్కడ చూచినా మనుష్యులు ఉందురని సూచించారు. అంటే... తప్పక అక్కడ హరినామ క్షేత్రం ఏర్పడునని సూచించారు.

కాని ఆ రోజులలో నేను దీనిని అర్థం చేసుకోలేదు. ఆర్థిక ఇబ్బందులలో ఉన్నాను కావున భవిష్యత్తులో అక్కడ అభివృద్ధి చెంది మా భూములు విలువ కలవిగా మారునని భావించాను.

## స్వామి సేవలో 12వ సంవత్సరము

తేది 13-10-2013 నాడు విజయదశమి. ఈ రోజు స్వామివారిని అత్యంత తృప్తిగా పూజించాను. శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠమును స్థాపించి 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని 12 వ సంవత్సరంలోనికి అడుగిడింది. ఈ సందర్భంగా నా కార్యక్రమాలను గుర్తు చేసుకున్నాను. తమ శక్తి, కృపావిశేషం చేత ఇంతవరకు 11 పర్యాయాలు 7 కోట్ల జపమును సమర్పించానని, గత 8 సంవత్సరాల నుండి శ్రీవేంకటేశం మాసపత్రికను నడుపుచున్నానని విన్నవించాను. ఇది అంతా తమకు మాపై ఉన్న ప్రేమకు నిదర్శనమని, నన్ను తగిన విధంగా మార్చి మీ సంకల్పం నెరవేర్చుకోండని ప్రార్థించాను.

## శారీరక రుగ్మతలను ప్రసాదించి మార్చుటకు ప్రయత్నించుట

తిరుమల స్వామివారు ఆయా సమయాలలోని నా మానసిక స్థితికి అనుగుణంగా సామ దాన భేద దండోపాయాలను వాడి నన్ను తన దారికి తెచ్చుకునేవారు. మేము వ్యాపారము చేయకూడదని గతంలో స్వామివారు చెప్పారు. ఏ పనీ లేకుండా ఉండలేము కాబట్టి కనీసం కాలక్షేపం కోసమైనా చిన్నగా చేద్దామనుకున్నాను. ఒకరకంగా స్వామి మాటను పెడచెవిన పెట్టాము. కాబట్టి నాకు ఆరోగ్య సమస్యలను సృష్టించి, జీవితం విలువ తెలుసుకునేటట్లు చేశారు. ఈ ఆస్తిపాస్తులు మన వెంట రావని, స్వామి సేవనే ప్రధానమని అర్థం అయ్యే విధంగా ఈ క్రింది లీలలను ప్రసాదించారు.

గత రెండు మూడు సంవత్సరాల నుండి నాకు ఏదో ఒక జబ్బు చేస్తున్నది. మొదట పెరి ఆర్థరైటిస్, స్పాండిలోసిస్, మోకాళ్ళ నొప్పులు మొదలైన వాటిచే బాధపడ్డాను. గత సంవత్సరం నుండి న్యూరోపతి వల్ల అరికాళ్ళ మంటలు కలుగుచున్నవి. అల్లోపతి, ఆయుర్వేదిక్ మందులు వాడినా తగ్గలేదు. ఈ మధ్యన మోకాళ్ళ నొప్పులు, నరం లాగుటచే తీవ్రబాధ కలుగుతున్నది. ఈ విషయంలో స్వామివారిని వేడుకున్నప్పటికీ లాభం లేకపోయింది. చివరికి నా ఓపిక నశించింది, మనస్సు ప్రశాంతతను కోల్పోయింది. ఎటూ తోచలేదు, ఆఫీసులో కూడా శ్రీవేంకటేశం కొరకు వచ్చిన రచనలను మనస్సు పెట్టి చదువుట లేదు. మనస్సంతా పిచ్చిగా, అయోమయంగా ఉంది.

గత చాలా రోజుల నుండి స్వామి లీలలను చూడని బాధ కూడా ఇందుకు తోడైంది. చివరికి స్వామివారి ఎదుట కూర్చుండి ఇలా రకరకాలుగా ప్రార్థించాను. ''ప్రభూ! గత కొన్ని సంవత్సరాల నుండి నా సమస్యలకు మీరు స్పందించుట లేదని బాధ పడ్డాను. మరియు ఇలా ప్రార్థించాను. ప్రభూ! నేను ఏకాకిని, నాకు మిత్రులు లేరు, అందరికీ దూరమైనాను, ఏ పనీ లేక జీవితము ఒంటరిదైపోయింది. ఎవ్వరితోనూ మాట్లాడాలనిపించదు. నేను ఒంటరిగా ఉన్నాను. పైగా నేను డయాబెటిక్ కావటం వలన ఏమీ తినను, మద్యం, మాంసం అలవాట్లు లేవు, జీవించుటకు కేవలము నాలుగు ముద్దలు అన్నం తింటున్నాను. ఈ విధంగా నియమ నిష్ఠలతో జీవించు నాకు రకరకాల రోగాలు వచ్చి, నానా బాధలు పడుచున్నాను. వీటిని బాగు చేయమని ప్రార్థించినా మీరు చేయనందుకు బాధ కలుగుచున్నదన్నాను. నా ఆరోగ్యాన్ని మరియు ఆర్థిక పరిస్థితిని బాగు చేయమని ప్రార్థించాను. చివరికి కనీసం మీ లీలలను చూస్తూ ఆనందంగా జీవించుదామంటే... మీరు మీ లీలలను కూడా చూపుటలేదు. ఇలా నా బాధలతో, ఒంటరితనంతో మతి పోవుచున్నదని విన్నవించాను. చివరికిలా ప్రార్థించాను. ప్రభూ! నాకు ఎన్ని బాధలున్నా, శారీరకంగా ఎన్ని నొప్పులున్నా భరించగలను కాని, మిమ్ములను, మీ లీలలను మాత్రం చూడాలని ఉన్నది, ఈ కోరికను కాదనకండి అంటూ ఏడుస్తూ ప్రార్థించాను. స్వామివారికి నేనంటే ఇష్టం లేదని, నన్ను మరచారని ఊహించుకుంటూ చాలా బాధపడ్డాను. నన్ను మరువ వద్దని ప్రార్థించాను. నేను ఏ రోజూ మీకు అపచారము చేయలేదు, నాకు చేతనైన సేవ చేశాను అనుకుంటూ ఏడుస్తూ వేడుకున్నాను. మనస్సు నిలకడగా లేనందున చిన్నబుచ్చుకుని తొందరగా ఆఫీసు నుండి ఇంటికి పోయాను.

స్వామివారు చివరికి నాపై కరుణించారు. నాలుగు రోజులలో రెండు ఆణిముత్యాలను ప్రసాదించారు. ఆ తరువాత మళ్ళీ నా ఆరోగ్య సమస్యను పెంచారు. ఆరోగ్య సమస్యలను సృష్టించి నన్ను తన దారిలోనికి తెచ్చుకొనుట స్వామివారి లక్ష్యం. కాని దీనిని నేను గుర్తించలేదు. మొదటి లీలలో ఆయన ద్వితీయ రూపమును తృప్తి చెందేవరకు చూపారు. మనస్సు ఆనందించింది, సంతోషానికి హద్దులు లేవు. నా స్వామికి కోటి కోటి ప్రణామాలను సమర్పించాను. ఈ కల ఉదయం 4.30 గంటల నుండి 5 గంటల మధ్యన వచ్చింది.

## ద్వితీయ రూపమును దర్శించుట

**తేది 19-10-2013 కల** : అది వెడల్పాటి ఏటవాలుగా ఉన్న పెద్దదైన ఒక దిగుడుబావి. మనుష్యులు ఎలాంటి సహాయము లేకనే ఈ బావిలోనికి దిగగలరు, ఎక్కగలరు. ఈ




నీటిలో శివ లింగాలను దర్శించుట


బావిలో దాదాపు సగము వరకు నీరు ఉన్నది. ఆ నీరు స్వచ్ఛంగా, చాలా స్పష్టతతో ఉన్నవి, అంటే ఆ నీటి అడుగు భాగము కూడా స్పష్టంగా చూడగలము. అది చాలా పవిత్రమైన బావి అట. ఆ బావిలో ప్రతి శివరాత్రికి మూడు శివలింగాలు క్రింది నుండి పైకి వచ్చునట, వీటిని ప్రజలు దర్శించుకుని ధన్యులౌతుంటారు. ఈ రోజు కూడా శివరాత్రేనట. మూడు శివలింగాలు పైకి వచ్చాయి. అవి బావిలోని నీటి అంచున ఉన్నాయి. మూడు అడుగుల గ్యాపుతో మూడు శివలింగాలు ఒక వరుస క్రమములో ఉన్నవి. నేను బావిలోనికి దిగి నీటి మట్టము కంటె 10 అడుగుల దూరములో నిలబడి వాటిని దర్శించుకున్నాను. ఈ శివలింగాల ఆవలివైపు, నీటిలోపల నిలుచుని శివలింగాల వైపు ముఖము చేసి ముగ్గురు బ్రాహ్మణులు, ఈ శివలింగాలకు అభిషేకము చేసి పూజ చేస్తున్నారు. ఒక్కొక్క లింగానికి ఒక్కొక్క బ్రాహ్మణుడు చొప్పున అర్చిస్తున్నారు. వారు శైవ సాంప్రదాయపు బ్రాహ్మణులు. విభూతిని ధరించి చక్కని మంత్ర పఠనం చేస్తున్నారు. ఈ లింగాలు కొంతభాగము నీటిలో మునిగి మరికొంత భాగము నీటిపై తేలి ఉన్నాయి. ఈ బ్రాహ్మణులు ఎవరు వస్తున్నారు, ఎవరు పోతున్నారు అనే ధ్యాస లేక ఏకాగ్రతతో శివుణ్ణి అర్చిస్తున్నారు. నేను ఈ శివలింగాలకు రెండు చేతులు జోడించి, నమస్కరిస్తూ నిలబడ్డాను. మూడు శివలింగాలు ఒకేరకమైన ఆకారాలు కలిగి లేవు. ఒకటి కొంచెం నలుపుతో, ఒకటి కొంచెం ఎరుపుతో, మరొకటి మధ్యరకంగా కొన్ని మచ్చలతో (రాయికి ఉండే మచ్చల మాదిరి) ఉన్నాయి. పొడుగు, వెడల్పు దాదాపు ఒకే మాదిరిగా ఉన్నాయి. నీటిపై దాదాపు ఒక అడుగు పైకి లేచి ఉన్నాయి. చాలా నున్నగా, సుందరంగా, చూసేవారికి భక్తిభావం పుట్టుకొచ్చే విధంగా, మనస్సును ఆకర్షించే విధంగా, అతి మనోహరంగా ఉన్నవి. వాటిని చూచినప్పుడు నేను ఎంతో ఆనందాన్ని పొందాను. అనిశ్చితిలో ఉన్న నా మనస్సు నిశ్చలంగా మారింది. ఆ మహదానందంతో నేను అలాగే ఆ శివలింగాలకు నమస్కరిస్తూ నిలబడిపోయాను. ఆపాదమస్తకం నాలో తన్మయత్వం నిండిపోయింది. చివరికి కల చెదిరింది.

ఇది స్వామివారు చెదిరిన నా మనస్సును, తన దివ్యదర్శన భాగ్యాన్ని ప్రసాదించి ఆనందభరితుణ్ణి చేశాడు. నేను శివుణ్ణి నా స్వామి యొక్క ద్వితీయ రూపముగా భావించుకుంటాను కాబట్టి ఆ శివలింగం నా స్వామివారే! ఇది నా జీవితములో స్వామి ప్రసాదించిన మరో ఆణిముత్యం. నా స్వామివారికి కోటి కోటి ప్రణామాలర్పించాను. ఇక రెండవది కూడా అద్భుతమైన కల. ఇది నా జీవితానికి మరో ఆణిముత్యం. ఒకరకంగా భవిష్యత్తులో నేను శ్రీవేంకటేశ్వరుణ్ణి పొందగలనని సూచించే లీల. ఆ లీల ఈవిధంగా ఉంది.

## స్వామివారు నా సొంతమవుతారని చెప్పట

గతంలో నన్ను స్వామివారు ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణ నిమిత్తం చేర్పించారు. దానికి అనుగుణంగానే ఈ కల వచ్చింది.

**తేది 24-10-2013 కల :** నేను ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాలలో చదువుచున్నానట. వయస్సు, రూపము కూడా నేను చదివే రోజుల మాదిరిగానే ఉన్నవి. నేను ఆ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్ మరియు ఎన్.సి.సి లో ఉండేవాణ్ణి. ముఖ్యమైన ఒక ప్రత్యేకమైన ఉత్సవము దగ్గరలో ఉన్నదట. ఈ విద్యార్థులు ఆ ఉత్సవమునకు సిద్ధమై వెళ్ళవలసి ఉన్నది. కావలసిన శిక్షణను గత కొన్ని రోజుల నుండి తీసుకున్నాము. నేను కూడా ఇందులో ఉన్నాను. కాని నేను శిక్షణ ఆఖరు రోజున నిర్లక్ష్యముతో వెళ్ళలేదు. తదుపరి ఆ ఉత్సవమునకు మాత్రము వారు నిర్దేశించిన పోలీస్ డ్రెస్ వేసుకుని అందరికంటే ముందే వెళ్ళాను. కాని ఏ దుంబా లేనివారికి ఒక రోజు ముందుగా మంచి బూట్లు, టై వద్ద మెరుపు దారాలతో ఒక ప్రత్యేకమైన స్టార్ ఎంబ్లమ్ ను ఇచ్చుటచే వారు దానిని ధరించి వచ్చారు. నేను ఒక మిత్రుడిని వాటి గురించి అడిగి తీసుకున్నాను. పరేడ్ కు సిద్ధమైనాను. ఈ కళాశాల ప్రిన్సిపల్ గా శ్రీమాన్ రమణాచారి గారు ఉన్నారట. ఆయన నా మనస్సులో ఒక్క క్షణము మెదిలారు. నేను చాలా చక్కగా ఈ పరేడ్ ను చేయాలనుకున్నాను. తరువాత మేము ఎక్కడికో, బహుశా ఒక క్యాంపుకు కొన్నిరోజుల నిమిత్తం వెళ్ళాము. మేము వెళ్ళినచోట ఒక శ్రీవేంకటేశ్వరుని ఆలయము ఉన్నదట. ఆనాడు వైకుంఠ ఏకాదశిట. స్వామి దర్శనార్థం లైనులో నేను చేరాను. నేను పంచె, తెల్లని చొక్కా ధరించి వెళ్ళాను. కొంతదూరము గుడి ప్రాంగణము లోనికి వెళ్ళగానే ఆ ఆలయ పూజారిగా నా మిత్రుడు, వైష్ణవుడు, శ్రీమాన్ కలకుంట్ల వేంకట నరసింహాచారి (హైస్కూల్ లో ఈయన నా క్లాస్ మేట్, మరియు పుల్లూరు స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకుడు) గారు నా వద్దకు వచ్చారు. "ఎవరైనా విష్ణు సహస్రనామము చేయించుకుంటారా?" అని ఆ లైనులోని భక్తులను అడిగాడు. నేను చేయించుకుందునని అన్నాను. చేయించుకునేవారిని లైను నుండి బయటకు పిలిచి లోనికి తీసుకుపోయాడు. ఇంతలో ఆయన ఈ చొక్కా విప్పాలి అని అన్నాడు. మరియు ఇలా అన్నాడు "చొక్కా విప్పితే మాయ తొలగినట్లు, ఆ తర్వాత స్వామివద్ద విష్ణు సహస్రనామం పఠించుతే స్వామివారు శాశ్వతంగా మన సొంతమవుతారని" ఈ వైష్ణవ పూజారి నాతో అన్నాడు. నేను చొక్కా విప్పి మరింత లోనికి వెళ్ళాను. లోపల విష్ణు సహస్రనామం చదివించేవారు టి.టి.డిలో పని చేసే శ్రీమాన్ విష్ణుభట్టాచార్యులట. ఈయన తిరుమలలో వైఖానస పండితుడు, యజ్ఞయాగాదులను నిర్వహిస్తారు. మరియు ఆ సమయాన టిటిడికి వైఖానస ఆగమ




స్వామి వారు నా సొంత
మైతారని చెప్పట

సలహాదారులు. నాకు తెలిసినవారు. ఇంతలో కల చెదిరింది.

దీని భావం – తిరుమల వైఖానస పండితులైన శ్రీమాన్ విష్ణుభట్టాచార్యులు ఎవరినైతే పూజించుదురో వారు శాశ్వతంగా నా సొంతం కాబోతున్నారని అర్థం. నా ఆనందానికి హద్దులు లేవు, పరవశించి పోయాను. కాని దీనిని 2020 సంవత్సరంలో మాత్రమే అర్థం చేసుకున్నాను.

## ఇదే రోజు మరో కల కన్నాను.

**కల:** నేను స్కూటర్ పైన నా భార్యతో ఉస్మానియా యూనివర్సిటీ రోడ్డులో లా కళాశాల నుండి ఇంజనీరింగ్ కళాశాల వైపు పోవుచున్నాను. అప్పటి ఒక మిత్రుడు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్ళుచున్నాడు. లేడీస్ హాస్టల్ మొదలగు ప్రాంతము చాలా లోతుకు కృశించిపోయింది. మేము చదివే సమయాన ఈ ప్రాంతము ఇంత క్రిందికి లేదని నా భార్యతో కలలోనే చెప్పాను. కల చెదిరింది. దీనర్థం గ్రహించలేదు. బహుశా... సృష్టి మారుచూ ఉండునని కావచ్చును.

## మా అమ్మకు వైకుంఠం ప్రసాదించినట్లు నిదర్శనాలు చూపుట

గతంలో దీనస్థితిలో చేసిన నా ప్రార్థనకు తృప్తి చెంది పైన చెప్పిన రెండు ఆణిముత్యాలను ప్రసాదించారు. ఆ తరువాత మళ్ళీ నన్ను మార్చుటకు ఆరోగ్య నష్టాలకు సంబంధించి కొన్ని లీలలను చూపెట్టి శారీరక బాధలను ఎక్కువ చేశారు. ఫలితంగా నాకు ఈ జీవితంపై విరక్తితో పాటు, మా తల్లితండ్రులు గుర్తుకొచ్చారు. ముఖ్యంగా మా తల్లిని చూపెట్టుమని స్వామివారిని తీవ్రంగా ప్రార్థించాను. ఈ జన్మలో ఆమె ఋణం తీర్చుకున్నానా? అనే అనుమానం కూడా వచ్చింది. దీని నివృత్తి కొరకు మరో షరతును పూరించమని ప్రార్థించాను. ఆ షరతు ప్రకారం మా అమ్మతో పాటు శ్రీమహాలక్ష్మి మాతను మా ఇంటికి పంపి ఇద్దరినీ ఒకేసారి చూపమని వేడుకున్నాను. స్వామివారు అట్లే చేశారు. నా ఆనందానికి హద్దులు లేవు, పరవశించిపోయాను. ఈ లీలను చూచేముందు మూడు నాలుగు ఘట్టాల లీలలను చూడవలసి ఉంది. వాటిని చూద్దాం.

## ముందు అనారోగ్యపు సూచనలు ఇచ్చుట

**తేది 26-10-2013 కల :** ఈ కలలో ఒక కాకి గాలిలో ఎగురుచూ నా వైపుకు వస్తున్నది. మొదట ఈ కాకికి ఒక గాయం అయినటుల అది దానితో బాధపడుచున్నటుల కనిపించింది. తరువాత కొంత సేపటికి ఎగురుకుంటూ దూరము నుండి నా వైపు వస్తున్నది. దీనిని చూచి ఇది నా వైపుకే, నా వద్దకే వస్తున్నదని

భావించి ప్రక్కకు తిరిగాను. కాని అది నన్ను చూచింది. కావ్ కావ్ అంటూ అరుస్తూ అది దూరము నుండి నా వైపుకు వచ్చుటను చూచాను. కల చెదిరింది.

ఇది శుభసూచకమా? అశుభసూచకమా? తెలియదు. దీని భావం ఏమిటో అంతుపట్టలేదు. అశుభమని భావించి, స్వామివారిని శరణు పొందుటే ఏకైక మార్గమని భావించాను.

ఇదే సమయాన నా భార్యకు బిపి వచ్చింది. మరోప్రక్క నా ఆరోగ్యము క్షీణించింది. ఎప్పుడూ లేనిది నా షుగర్ చాలా పెరిగింది. హెచ్.బి ఏవన్ సి 9.2 వచ్చింది. మోకాళ్ళ నొప్పులు, న్యూరోపతి మంటలచేతల్లడిల్లిపోయాను. ప్రతిక్షణందుఃఖకరంగా మారింది, రోజు ఎలా గడపాలో తెలియలేదు. ఈవిధంగా కొద్ది రోజులు గడిచాక జీవితంపై నిరాశ పెరిగింది. జీవితంలో సాధించింది, సాధించవలసింది పునరాలోచించుకుంటూ రెండు పేజీలు వ్రాసుకున్నాను. నాకు జన్మనిచ్చిన తల్లితండ్రులు గుర్తుకొచ్చారు. ముఖ్యంగా 2008 సంవత్సరంలో మా అమ్మ చనిపోవునప్పుడు నా 3వ వంతు పుణ్యమును ధారపోసి ఆమెకు వైకుంఠమును ప్రసాదించమని స్వామివారిని వేడుకున్నాను. నేను మా తల్లి ఋణాన్ని తీర్చుకున్నానా...? మీరు మా అమ్మకు వైకుంఠాన్ని ప్రసాదించారా...? అని స్వామివారిని అడిగాను. మరియు ఒకవేళ ప్రసాదిస్తే... వైకుంఠములో మా అమ్మతో పాటు శ్రీమహాలక్ష్మి మాత కూడా ఉంటుంది కాబట్టి ఆ ఇద్దరినీ నా వద్దకు పంపమని, నేను ఏకకాలములో వీరిద్దరినీ చూచినట్లైతే, మా అమ్మకు వైకుంఠం ప్రాప్తించిందని భావించుదునని ప్రార్థించాను. స్వామివారు అట్లే చేశారు. అప్పుడు నా ఆనందానికి హద్దులు లేవు. నాలుగు రోజుల వరకు ఆనందంతో పరవశించిపోయాను. ఇంతటి భాగ్యాన్ని ప్రసాదించినందుకు స్వామి ఋణం ఎలా తీర్చుకోవాలని పరితపించిపోయాను. ఆ లీలలు ఈవిధంగా ఉన్నవి.

## పునరాలోచన

**తేది 24-11-2013 :** గతంలో స్వామివారు 'నా' అన్నది వదిలివేయుమని, సంపూర్ణ శరణాగతి పొందమని చెప్పారు. ఈ రెండు విషయాలు సాధించుటకు ఎన్నోసార్లు ప్రయత్నించాను. కాని సఫలం కాలేకపోయాను. నిరుత్సాహపడ్డాను. కొన్నిసార్లు ప్రయత్నించి, ఇదే సంపూర్ణ శరణాగతి అని, 'నా' అన్నది నశించిందని విన్నవించుకున్నాను. ఇలా ఒకసారి కాదు, పలుసార్లు విన్నవించుకున్నాను. అప్పుడు స్వామివారు నేను 'నా' అన్నది నశింపచేసుకోలేదని, పూర్వము లాగనే ఉన్నావని, మార్పు జరగలేదని చెప్పారు. సిగ్గుతో తల వంచుకున్నాను. నా స్వామి ముందు మాట్లాడుటకు సాహసించలేకపోయాను. ఏవిధంగా స్వామి చెప్పిన స్థితికి చేరాలో అర్థం కాలేదు. చివరికి గతంలో కొన్నిసార్లు స్వామి చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. "నీవు జీవితంలో సాగిపోతూనే ఉండు. నీవు వక్రమార్గంలో పోవునప్పుడు నేనే సరి చేయుదును" అని అన్నారు. దీని ప్రకారం ముందుకు పోవుచున్నాను. ఇలా గత రెండు మూడు సంవత్సరాల నుండి జరుగుచున్నది, కాని నాలో 'నా' అన్నది నశించలేదు. కాని నా వంతు ప్రయత్నం మాత్రం చేస్తున్నాను. బహుశా ఇప్పుడు నా ప్రయత్నంతో నేను చేరుకోవలసిన స్థితికి చేరుకోనందున, నా స్వామి స్వయంగా పూనుకొని నన్ను సరైన మార్గమున పెట్టదలచాడు. అందుకు నాకు ఇష్టమైన నా శారీరక వ్యవస్థను అస్తవ్యస్త స్థితిలో ఉండునట్లు చేశాడు. ప్రస్తుతం నా వయస్సు 53 సంవత్సరాలు. ఇప్పుడే నాకు విపరీతమైన మోకాళ్ళ నొప్పులు, మధుమేహము పరిధి దాటుట, కాళ్ళలో న్యూరోపతి మంటలు వచ్చాయి. ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. ఒకానొక స్థితి యందు నా ఈ జీవితము ఎందుకనిపించింది. లోకంలో దేనిపైనా మోహము లేకుండా పోయింది. జీవితపు చరమాంకంలో ఉన్నట్లు భావించాను. ఇక జీవితం ఇంతే కనుక సంపాదించింది ఏమి చేయాలని ఆలోచించాను. నాకున్న ఇద్దరు పుత్రులలో పెద్దవాడు డిసెంబర్ 2013 వరకు ఎమ్.ఎస్ పూర్తి చేసి అక్కడే ఉద్యోగం చేస్తాడు. చిన్నవాడు కూడా ఇంజనీరింగ్ ఫైనల్ చదువుతున్నాడు. వీడికి కూడా గ్రీన్ కార్డు ఉంది. అమెరికా వెళ్ళి చదివి అక్కడే స్థిరనివాసమేర్పరచుకుంటాడు. వీడి చదువు ఖర్చులు సమకూర్చుకుంటే సరిపోతుంది అనుకున్నాను. ఆ తరువాత పుత్రులెవ్వరూ నానుండి ఏదీ ఆశించరనుకున్నాను. కాబట్టి నాకు ఇంకా సంపాదనపై మక్కువ చచ్చిపోయింది. ఉన్నంతలో తృప్తిగా జీవిస్తూ ఉండాలనుకున్నాను.

మరియు గత కొన్ని సంవత్సరాల నుండి నా మానసిక స్థితిని ఈ క్రింది విధంగా గమనించాను. ఒక్కొక్కసారి భక్తి పరవశంతో నాకున్నదంతా స్వామివారికి అర్పణ చేస్తాను. కాని ఆ తరువాత మళ్ళీ దీనిపై నా పెద్దరికమును చలాయిస్తాను. మళ్ళీ భక్తిభావం పరవశించినప్పుడు తప్పైందని క్షమించమని వేడుకుంటాను. కాని రెండు రోజులకే పూర్వస్థితికి వచ్చి మళ్ళీ నేనే యజమానిని అగుచున్నాను. ఇలా మళ్ళీ మళ్ళీ క్షమించమని కోరుట చూచి నాకే సిగ్గేసింది. నోట మాట రాకున్నది. చెంపలు వేసుకొనుటకైనా సిగ్గుపడవలసిన స్థితిలో ఉన్నాను. ఇలాంటి స్థితిలో నా స్వామి దయ వలన శారీరక బాధలు వచ్చాయి. ఇప్పుడు మళ్ళీ పునరాలోచించుకున్నాను. 'నా' అన్నది ఎందుకు వదలలేకపోయానో ఆలోచించి, వదులుదునని నిశ్చయించుకున్నాను. గత కొన్ని రోజుల క్రింద 'నా' అన్నది వదిలాను అని ప్రభువుకు విన్నవించుకున్న స్థితి కంటే చాలా మెరుగ్గా ఉన్నట్లు అనిపించింది. నాలో పరివర్తన కొంత జరిగింది. ప్రస్తుతం నా ఆరోగ్య స్థితిని బాగు చేయమని, మీకు సర్వము సమర్పిస్తానని మళ్ళీ ప్రార్థించాను. చివరికి నన్ను మీరు ఏ స్థితికి

తీసుకెళ్ళినా మీ ఇష్టం, నేను మీ సేవకుడిని, మీవాడిని, నన్ను ఏ విధంగా ఉపయోగించుకున్నా నేను సిద్ధం. కాని నాకు మీ సేవను మాత్రం ప్రసాదించమని ముగించాను. మరియు ఈ బాధలలో మా అమ్మ మరీ మరీ గుర్తుకొచ్చింది కాబట్టి మా అమ్మను నేను చిన్నప్పుడు చూచినట్లు చూపమని వేడుకున్నాను. దీనికి స్వామివారు కరిగిపోయి అదేవిధంగా మా అమ్మను చూపారు. నేను సంతోషించాను.

## వెనకటి రూపములో మా అమ్మను చూపుట

ఈ కలలో నేను మా అమ్మను చూచాను. నేను ఊరిలో ఉన్నప్పటి లాగా ఆమె కలదు. ఆమె చనిపోవునాటి కంటే ఒక 25 సంవత్సరముల ముందటి రూపములో చూచాను. అదే వేషధారణ, అవే మాటలు, అదే వ్యవసాయపు అలవాట్లతో నన్ను ఆనందానికి గురి చేసింది.

**తేది 26-11-2013 కల :** అది మా చిన్నగుండవెల్లి గ్రామము. మా తండ్రి గారు చనిపోయారు. మేము మా పొలము వద్దకు పోయాము. (ఈ పొలమును 1989 లో అమ్మాము) ఈ పొలమునకు ఒక ప్రక్క ఈ పొలము మొత్తానికి ఒక మట్టికట్ట, దానిపై బాట ఉన్నది. పై పొలముల వారు ఈ మట్టి కట్టపై నడుచుకుంటూ వెళుతుంటారు. దీని చివర మా బావి ఉన్నది. ఈ పొలము మడులు మడులుగా, అంటే ఒక మడికి మరో మడి ఎత్తులో ఎక్కువ తక్కువగా ఉన్నది. ఈ పొలమును వరి నాటు నిమిత్తమై దున్నారు. నేను హైదరాబాద్ నుండి ఊరికి వెళ్ళి, ఈ పొలమును చూచుటకు అక్కడికి వెళ్ళాను. ఈ పొలము మధ్యలో ఒక గట్టుపైన కూర్చున్నాను. మా అమ్మ కూలివారిని తీసుకుని కట్టపైనుండి వచ్చి, బావి దగ్గర ఇతర వ్యవసాయదారులతో, పనివారితో మాట్లాడుచున్నది. ఆమెది అదే నేను చిన్నప్పుడు చూసిన వ్యవసాయము చేసేనాటి రూపము, అదే శారీరక స్థితో ఉన్నది. ఆమె ఇతరులతో మాట్లాడే మాటలను స్పష్టంగా విన్నాను. ఇంతలో నా దగ్గరికి మా పొలములో పనిచేసేవారు వచ్చి ఆ పొలము గురించిన లీగల్ విషయాలను అది ఇట్లా, ఇది అట్లా అనుచు ఏదో లోపము ఉన్నదని, దీనిని బాగు చేయాలని, మీ బాపు బాగుచేసేవాడే... కాని చనిపోయాడు కాబట్టి నీవు చేయాలని చెప్పారు. ఇంతలో ఇదే విషయమై మా ప్రక్క పొలము వారు వచ్చి వారి పొలము గురించి కూడా చెప్పి బాగు చేయమని అడిగారు. ఈ సమయంలో పై పొలముల వారు తలలపై చద్దుల మూటలను పెట్టుకొని కట్టపై నుండి నడుచుకుంటూ మా అమ్మను మాట్లాడించుకుంటూ పోవుటను చూచాను. కల చెదిరింది.

ఈ కలలో నా ప్రార్థన అనుసారం స్వామివారు మా అమ్మను నేను చిన్నప్పుడు చూచినట్లు స్పష్టంగా చూపారు. నా చిన్ననాటి ఆమె వ్యవహారమును చూచి ఆనందించాను.

## మళ్ళీ అమ్మ గుర్తుకు వచ్చుట


ప్రతిరోజూ శారీరక నొప్పులచే బాధపడుతున్నాను. మనస్సు స్వామి పైకి కూడా వెళ్ళటం లేదు. ఈ బాధలో, ఒక్కసారి నేను మా అమ్మ ఋణం తీర్చుకున్నానా? స్వామివారు మా అమ్మకు వైకుంఠాన్ని ప్రసాదించారా? అది సంభవించిందా? అనే అనుమానం వచ్చింది. వెంటనే స్వామివారిని ఇలా ప్రార్థించాను. "ప్రభూ శ్రీవేంకటేశ్వరా! గతంలో తేది 15-10-2008 నాడు మా అమ్మ చనిపోయినప్పుడు, నేను నా మూడవ వంతు పుణ్యాన్ని మీకు ధారపోసి, దీనిని మా అమ్మ అకౌంటుకు బదిలీ చేసి, మా అమ్మ సంపాదించిన పుణ్యముతో పాటు దీనిని జత చేసి ఆమెకు వైకుంఠమును ప్రసాదించమని ప్రార్థించాను. మీరు ప్రసాదించారనే అనుభూతి కూడా పొందాను. అయినప్పటికీ నా తృప్తి కోసం మా అమ్మకు వైకుంఠము ప్రాప్తించిందని నిదర్శనము చూపమన్నాను. నాకున్న జ్ఞానముతో ఇలా ఆలోచించాను. మా అమ్మకు వైకుంఠం ప్రసాదిస్తే... ఆమె వైకుంఠంలో ఉంటుంది. మరియు అదే వైకుంఠంలో శ్రీమహాలక్ష్మి అమ్మవారు కూడా ఉంటారు, నాకు ఇద్దరినీ ఒకేసారి చూడాలనే కోరిక పుట్టింది. కాబట్టి ఇద్దరినీ కలిపి నా వద్దకు పంపమన్నాను. నేను నా ఒకే చూపులో ఇద్దరినీ చూడాలని, వారితో మాట్లాడాలని ప్రార్థించాను" మరియు శ్రీమహాలక్ష్మి మాతను కూడా మా అమ్మను మా ఇంటికి తీసుకురమ్మని అత్యంత దీనంగా ప్రార్థించాను. ఈ షరతును పూరించినట్లైతే మా అమ్మకు వైకుంఠం లభించిందని తృప్తి చెందుదునన్నాను. నా ఈ జన్మకు కారకురాలు మా అమ్మ. ఆమె ఋణం తీర్చుకున్నానని సంతోషించుదునన్నాను. నా ప్రార్థనకు అనుగుణంగా స్వామివారు నా షరతును పూరించారు. ఒక విశ్లేషణాత్మక లీలను చూపి నన్ను ధన్యుణ్ణి చేశారు.

ఈ కల నాకు ఈరోజు ఉదయం 6 గంటల ప్రాంతమున వచ్చింది. ఈ కలలో స్వామివారు మా తల్లిని చూపారు. మా తల్లిని మా ఇంటికి లక్ష్మీమాత తీసుకొని వచ్చింది. ఆనందంగా ఆమెను ఆలింగనం చేసుకున్నాను. ఆ లీల ఈవిధంగా ఉంది.

మా అత్త, అంటే మా సురేఖ అమ్మ పేరు చెఱుకుపల్లి శకుంతలాదేవి. మంచి భక్తురాలు, ఈమె నలుగురు పిల్లలు అమెరికాలో ఉండుట వలన అక్కడి సిటిజెన్షిప్ తీసుకుని అక్కడే ఉంటోంది. ఇండియా వచ్చినప్పుడు మా ఇంట్లోనే ఉండేది. ఈమె ఫిబ్రవరి 2022 లో చనిపోయింది. ఈ కల కన్న సమయాన మా అత్త కీ.శే శకుంతలాదేవి గారు అమెరికాలో వారి చిన్నకుమారుడైన శ్రీమాన్ చక్రధర్ రెడ్డి ఇంటిలో ఉన్నది. మామూలుగా మా సురేఖ ప్రతి రెండు మూడు రోజులకు ఒకసారి వారితో సుదీర్ఘంగా మాట్లాడుతూ ఉండేది. ఈ కలలో కూడా ఇదేవిధంగా మాట్లాడుతోంది.

**తేది 05-12-2013 కల :** మా ఇంటిలో నేను, నా భార్య

సురేఖ, చిన్నకుమారుడు అరవింద్ ఉన్నామట. నా భార్య సురేఖ అమెరికాలోని ఆమె చిన్నన్న శ్రీమాన్ చక్రాధర్ రెడ్డితో, ఫోన్ లో ఏదో విషయమై తరచు మాట్లాడుచున్నది. నేను దీనిని గమనించాను. కాని వారి అమ్మ, అన్నతో ఏదో విషయమై ఉండవచ్చనే ఉద్దేశ్యముతో ఉన్నాను. అమెరికాలో చక్రాధర్ ఇంటిలో వారి అమ్మ అంటే మా అత్త కూడా ఆ సమయాన అక్కడే ఉన్నది. ఇక్కడ నేను, నా కుటుంబం ఒక ఇంటిలో మొదటి అంతస్తులో ఉంటున్నాము. మా ఇంటి గుమ్మం ముందు పెద్ద వరండా ఉన్నది. ఎవరైనా మెట్లు ఎక్కి మా ఇంటికి రావాలన్నచో ఈ వరండా నుండే రావాలి. మరియు ఈ వరండా పైకి వచ్చిన వారు ఇంటిలో ఉన్న మాకు స్పష్టంగా కనపడగలరు. అంటే మొత్తం గుమ్మాలు ఎదురెదురుగా వరుస క్రమంలో ఉన్నాయి (ఈ ఇల్లు హబ్సీగూడ లోని మా ప్రస్తుత నివాసమును కొంచెము మార్చి చూపెట్టారు). విషయమేమిటంటే అమెరికాలో ఉన్న మా అత్త ఎవరికీ ఏమాత్రం తెలియకుండా అమెరికా నుండి నేరుగా మా ఊరు చిన్నగుండవెల్లికి వెళ్ళింది. అక్కడ మా అమ్మ రుక్కమ్మను బలవంతంగా తీసుకొని అంటే వెంటబెట్టుకొని హైదరాబాద్ లోని మా ఇంటికి రావడానికని ఈ వరండా గుండా మెయిన్ డోర్ వరకు వచ్చింది. నేను ఇంటి బెడ్రూమ్ లో ఏదో పనిపై ఉన్నాను. ఒకేసారి నా చూపు అనుకోకుండా వచ్చిన మా అమ్మమీద పడింది. ఆమెను చూచిన నేను ఆనందముతో మురిసిపోయి పరుగెత్తుకొచ్చి ఆమెను ఆలింగనము చేసుకున్నాను. ఆమె చేతులను పట్టుకుని



**లక్ష్మీ మాత మా అమ్మ ను మా ఇంటికి తెచ్చి చూపుట**


**మా అమ్మ కీ।।శే।। రుక్కమ్మ**


**మా అత్త కీ।।శే।। శకుంతలాదేవి (లక్ష్మి)**

ప్రేమగా ఒత్తుచూ ముద్దాడాను. ఎప్పుడొచ్చినవు? ఎలా వచ్చినవని అడుగుచు ఆమె వద్దకు వెళ్ళాను. ఈమె వెనుకనే మా అత్త కూడా ఉన్నది. మా అత్తను చూపుచు ఈమె బలవంతంగా నన్ను ఇక్కడికి తీసుకొచ్చిందని మా అమ్మ అన్నది. ఇది చూచి మా అత్త నవ్వుతోంది. ఇంతవరకు అమెరికాలో ఉన్నదనుకున్న ఈమె ఇండియాకు వచ్చి, నేరుగా మా ఊరికి వెళ్ళి మా అమ్మను తీసుకు రావడంతో నేను ఆశ్చర్యానికి లోనైనాను. బహుశా వీరు నన్ను ఆశ్చర్య పరచుటకు ఇలా చేశారనుకున్నాను. ఇదే మాట మా అత్త కూడా నవ్వుతూ చెప్పింది. నన్ను సర్ప్రైజ్ చేద్దామని ఈ విధంగా చేశానన్నది. నేను నా ఒకే చూపుతో ఈ ఇద్దరినీ కలిపి చూచాను. ఒకేసారి చూచాను. ఇక మా అమ్మను తనివితీరా అత్యంత సమీపముగా చూచి ఆమెతో మాట్లాడాను. ఆమె కూడా నన్ను చాలా సంతోషంగా ఆహ్వానించింది. ఇంతే కల. తెల్లవారి కూడా ఈ సంతోషము నన్ను మైమరపించింది. చాలా ఆనందంగా ఉన్నది. దీనికి నా ప్రభువుకు కోటి కోటి ధన్యవాదములను తెలుపుకున్నాను.

స్వామివారు ఈ లీలను అత్యంత విశ్లేషణాత్మకంగా ప్రసాదించారు. నిజానికి మా అమ్మను మా ఇంటికి తీసుకురమ్మని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారిని ప్రార్థించాను. ఇద్దరినీ నేను ఒకేసారి నా ఒకే చూపుతో చూడాలని, వారితో మాట్లాడాలని, ప్రత్యేకంగా మా అమ్మను అత్యంత సమీపంగా చూచి, ఆమెతో తనివితీరా మాట్లాడాలని కోరాను. అన్నీ నెరవేరాయి కాని శ్రీమహాలక్ష్మి స్థానములో మా అత్త శకుంతలాదేవి గారిని పంపారు. దీని

గురించి ఆలోచిస్తూ ఈ విషయాన్ని నా భార్యకు చెప్పాను. ఆమె వెంటనే వారి అమ్మ పేరు శకుంతలాదేవి కాదని, లక్ష్మి అని చెప్పింది. నిజానికి ఆమె పేరు శకుంతలాదేవి అయినప్పటికీ, ఆమె పెండ్లి సమయాన ఆమె పేరును లక్ష్మిగా మార్చారట. మా మామ ఊరిలో, అందరూ లక్ష్మి అనే పిలిచేవారట. వీరు హైదరాబాదులో స్థిరపడిన తరువాత తిరిగి శకుంతలాదేవి పేరే స్థిరపడిందట. నాకు పెండ్లై 24 సంవత్సరాలవుతోంది. కాని ఇంతవరకు ఈ విషయం నాకు తెలియదు. దీనిని వినినంతనే ఆశ్చర్యపోయాను. దీనితో శ్రీవేంకటేశ్వరుడు మా అమ్మకు వైకుంఠాన్ని ప్రసాదించిన విషయం సత్యమని భావించి ఎంతో సంతోషించాను. నేను ఈ జన్మలో మా అమ్మ ఋణం తీర్చుకున్నానని మురిసిపోయాను. స్వామివారికి శతకోటి ప్రణామాలర్పించాను.

ఒక విశ్లేషణ : వైకుంఠము లేదా మోక్షము పొందినవారు తిరిగి లోకానికి కాని, కలలోనికి కాని రారని ఒక లోక వాక్కు. కాని... యశోద శ్రీకృష్ణునికి చేసిన సేవ అనన్య సామాన్యం, ఈ లోకంలో అంతటి సేవ మరెవ్వరూ చేసి ఉండరు. ఈమె మోక్షానికి అర్హురాలు. మరి శ్రీవేంకటేశ్వరుని తల్లిగా, వకుళమాతగా మళ్ళీ ఎలా రాగలిగింది? అర్జునుడు శ్రీకృష్ణునికి ఇష్టుడు, భగవంతుని విశ్వరూపాన్ని దర్శించిన మహానుభావుడు. మరి వీరు భక్తకన్నప్పగా తిరిగి జన్మించారనే ఒక నానుడి ఎలా ఏర్పడ్డది? భగవంతుణ్ణి శాస్త్రముతో బంధించలేము. వీరు శాస్త్రము కంటే గొప్పవారు.

## చిన్నగుండవెల్లి భూములు – స్వామివారి దిశా నిర్దేశం

నా ఆరోగ్యము బాగాలేదు. న్యూరోపతి మంటలు, మోకాళ్ళ నొప్పులు, షుగర్ కంట్రోల్ తప్పి శారీరక వీక్నెస్, ప్రక్కటెముకలు నొప్పి పెట్టుట మొదలగు వాటిచే తీవ్ర మానసిక వ్యధను అనుభవిస్తున్నాను. ఈ సందర్భంగా స్వామివారిని ఇలా ప్రార్థించాను. ప్రభూ! మీరు మీ సేవా భాగ్యమును ప్రసాదించారు బాగానే ఉంది, కాని ఆ సేవ చేయుటకు శారీరక శక్తి సామర్థ్యాలను ప్రసాదించకుంటే నేను మీ సేవను చేయలేనని విన్నవించాను. మరియు నాయందు దయ తలచి నా అనారోగ్య బాధలను తగ్గించమని వేడుకున్నాను.

ఈ విధంగా నా శారీరక బాధల వలన జీవితంలోని ప్రతి విషయాన్ని పునరాలోచించుకున్నాను. ఈ క్రమంలో మరో తప్పుడు ఆలోచనకు చక్కని దిశా నిర్దేశం చేశారు స్వామివారు.

గత కొన్ని రోజుల నుండి మా ఊరి జ్ఞాపకాలు వచ్చినవి. ఊరిలోని మా భూములు, ఇల్లు, అప్పటి మా తల్లితండ్రుల మనస్తత్వము, ఈ భూమి ఏమగునో అనే బెంగ మొదలగునవి నా మనస్సులో దూరి బాధిస్తున్నవి. నేను చిన్నప్పుడు పెరిగిన పచ్చని పరిసరాలు మరీ మరీ జ్ఞాపకము వచ్చినవి. ప్రస్తుతం నేను హైదరాబాదులో, ఆ భూమి సిద్ధిపేట వద్ద, నా పిల్లలు బహుశా అమెరికాలో స్థిరపడతారు. అప్పుడు నేను ఆ ఊరి భూములను ఏమి చేయాలి? అమ్మినచో నా తల్లితండ్రులను మోసం చేసిన వాణ్ణవుతానని అనిపించింది. వారికి ఆ భూమి ప్రాణం కాబట్టి నేను అమ్మితే వారు బాధపడతారని భావించాను. కొన్ని వేల ఏండ్ల నుండి ఆ ఊరి ఆవాసమును, మా తాత ముత్తాతల నుండి వచ్చు వరుస క్రమము నాతో తెగతెంపులు కావటం బాధ కలిగించింది. ఎందుకో ఈ విషయాలు నాకు కొన్ని రోజుల నుండి స్ఫురణకు వచ్చి బాధిస్తున్నవి. ఎంత ఆలోచించకూడదనుకున్నా వదలటం లేదు. చివరికి నా ప్రభువును ఈ విషయమై ప్రార్థించాను. ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! నాకు నా చిన్నప్పటి మా ఊరు, భూములు, ఆస్తులు మొదలైనవి జ్ఞాపకమొస్తున్నాయి, వాటిని అమ్మినచో మా తల్లితండ్రులకు ద్రోహం చేసినవాని నగుదును. వారి నమ్మకమును వమ్ము చేసిన వాణ్ణగుదును. వాటిని ఏమి చేయాలి? అని అడుగుచు నన్ను ఈ మోహ మాయ నుండి బయటకు తీసుకురండని, మనశ్శాంతిని ప్రసాదించమని ప్రార్థించాను. ఈ ప్రార్థన నా మనస్సు అంతరంగాల నుండి వచ్చింది కావున ప్రార్థన సమయాన నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. స్వామిని పదే పదే వేడుకున్నాను. నేను స్వామిని తేది 05-02-2014 నాటి సాయంత్రం 7 గంటలకు ప్రార్థించాను. నా ప్రార్థనకనుగుణంగా చక్కని కలను చూపాడు. దీనితో కనువిప్పు కలగడమే కాకుండా, వెంటనే రాత్రికి రాత్రే నాకు ఏ ఆస్తులు, భూములు వద్దని, బుద్ధి వచ్చిందని చెంపలేసుకున్నాను. ఆ లీల ఈ విధంగా ఉంది.

**తేది 06-02-2014 కల :** బహుశా తెల్లవారు ఝామున 4.30 గంటల తరువాత ఈ కల వచ్చింది. చాలా చిన్న కల, కాని దాని భావం చాలా పెద్దది. ఈ కలలో నేను ఒకానొక రోజు మధ్యాహ్నము వేళ ప్యాంటు చొక్కా ధరించి (ఆఫీస్ డ్రస్సులో) హబ్సీగూడ వీధి నెం.1 లో ఉన్న శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆఫీసులో కూర్చున్నాను. నా వద్దకు ఎవరో ఒక వ్యక్తి లేదా భక్తుడు వచ్చి మాట్లాడుతున్నాడు. మా ఆఫీసులోని స్టాఫ్ కూడా ఉన్నారు. అది శ్రావణమాసము, గోకులాష్టమి రోజట. నేను రథయాత్ర జరుపవలసిన రోజులు, కాని రథయాత్ర జరపక ఆఫీసు వద్దనే ఉన్నాను. మాటల సందర్భంలో ఆ వ్యక్తితో ఇలా అన్నాను. మేము ప్రతిసారీ ఈరోజు రథయాత్ర చేస్తూ ఉంటాము, కొన్ని కారణాల వల్ల ఈసారి చేయలేదని చెప్పే సమయాన నేను గోకులాష్టమి స్వామిసేవకు దూరమయ్యాననే భావం మనస్సులో బాణంలా గుచ్చుకుంది. ఒకవేళ నాకు ఈ ఆస్తులపై వ్యామోహం ఉన్నట్లైతే స్వామివారు ప్రసాదించిన సేవలను ఉపసంహరించుకుంటారనే భావం వెంటనే ఏర్పడింది. ఒక్కసారి ఉలిక్కిపడి లేచాను. నన్ను మీ సేవ నుండి దూరము చేయరాదని స్వామివారిని ప్రార్థించాను.

లేచిందే తడవుగా స్వామి ఫోటో వద్దకు వెళ్ళి ఆయన పాదాలకు నమస్కరిస్తూ, నేను నా సర్వస్వం వదులుకుంటాను, ఊరి జ్ఞాపకాలను తెంచుకుంటాను, కాని నన్ను మీ సేవ నుండి దూరము చేయవద్దని ప్రార్థించాను. ఈ దెబ్బతో నిజంగానే నా మనస్సులో చాలా మార్పు వచ్చింది. ఆ భూములపై అధికారాన్ని నా ప్రభువుకే వదిలివేయాలని నిర్ణయించుకున్నాను. మొత్తం 12 గంటల లోపే ఈ మార్పును నా మనస్సులో తెచ్చిన నా స్వామికి శతకోటి వందనాలను సమర్పించాను.

ఈ సందేశం ద్వారా నాలో కలిగే వ్యామోహాలను దూరము చేశారు. ఒకవేళ నేను స్వామి సేవను కోరుకున్నచో ఈ సాంసారిక వ్యామోహాల నుండి బయట పడాలని సూచించారు. తన సేవను ప్రసాదించే సమయాన కూడా ఇదే బోధించారు. కేవలం తననే చూడాలని, ఇతరముల దేనిపైనా శ్రద్ధ వద్దని చెప్పారు. ఇప్పుడు మళ్ళీ నేను ప్రార్థించిన 12 గంటల లోపే నాలో కలిగిన మోహ భావాన్ని ప్రార్థించిందే ఆలస్యం అన్నట్లు తీసివేశాడు నా స్వామి. నా మదిలో కలిగిన ఈ విషభావాన్ని ఆయన బహుశా చాలా రోజులనుండి చూస్తున్నారు. నేను ఎప్పుడు ప్రార్థిస్తానా అని ఎదురు చూస్తున్నట్లు అనిపించింది. మరియు చాలా ఆనందం వేసింది. నేను స్వామి వాణ్ణినే భావన మరొక్కమారు నా మదిలో కలిగి ఆనందించాను.

## స్థితప్రజ్ఞత సాధించుటే లక్ష్యం

తేది 16-02-2014 : నేను గతంలో కంటే 'నా' అన్నది వదిలించుకొనుటలో కొంత మెరుగైన స్థితిలో ఉన్నానని గత కొన్ని రోజుల నుండి భావించసాగాను. బహుశా దీనిని గమనించిన స్వామివారు ఒక పది రోజుల నిమిత్తము ఒక ఆస్తిలో చిన్న గొడవను సృష్టించి నేను మళ్ళీ పూర్వం లాగా ఆదుర్దాతో స్వామిని స్మరించేలా చేశారు. నేను ఏమాత్రము మారలేదని నన్ను నేను తెలుసుకున్నాను. నా స్థితిని చూచి నన్ను నేను అసహ్యించుకున్నాను. లోపం ఎక్కడుందని పరి పరి విధాల ఆలోచిస్తూ కాలం గడిపాను. నేను ఒకరిది ఆశించలేదు. కేవలం నాది నేను కాపాడుకొనుటకు తాపత్రయపడ్డాను. ఇది తప్పెలా అవుతుంది? మన ఇంటినుండి ఒక వస్తువును ఎవరైనా దొంగిలిస్తే అడ్డుకోవడం తప్పెలా అవుతుందని తర్కించుకున్నాను. చివరికి స్వామివారు బహుశా నన్ను 'స్థిత ప్రజ్ఞత'ను సాధించమని చెప్పి ఉంటారని భావించాను. ఈ ఆలోచన నేడు అంటే తేది 27-11-2023 కార్తీక పౌర్ణమి నాడు ఈ భాగం వ్రాయునప్పుడు మాత్రమే వచ్చింది. నేను ఈ స్థితప్రజ్ఞతను సాధించుటకే ఇప్పటినుండి సాధన చేస్తానని స్వామివారికి తెలిపాను. ఆయన దీనిని అభినందించినట్లు తేది 28-11-2023 నాటి లీలలో చూపెట్టారు.


**తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం**

**స్వామివారి 700 దివ్యలీలలు**

1వ మరియు 2వ సంపుటములు

**ఉచిత పంపిణి**




ఆసక్తి కలవారు ఈ క్రింది అడ్రస్ నుండి నేరుగా పొందవచ్చును. లేదా పోస్టు ద్వారా పొందగోరు వారు పోస్టు ఖర్చుల నిమిత్తం సంపుటము ఒకంటికి రూ. 75/- లను ఫోన్‌పే / గూగుల్ పే / పేటీఎం ద్వారా 9348212354కు మీ అడ్రస్‌తో పాటు పంపి పొందవచ్చును.

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇ.నం. 1-1-53, వీధి నం.1, హబ్సిగూడ,
హైదరాబాద్ - 500 007. ఫోన్:040-27175050,
సెల్: 93482 12354 (మెసేజ్ మాత్రమే)


**నా దిశ :** ఉన్నంతలో తృప్తిగా జీవించమన్నారు. స్వామి సేవలో 11 సంవత్సరాలు పూర్తయినవి. స్వామివారు నా సొంతమవుతారని సూచనలిచ్చారు. మా అమ్మకు వైకుంఠాన్ని ప్రసాదించినట్లు నిదర్శనాలను చూపారు. స్థితప్రజ్ఞత సాధించుటే లక్ష్యంగా స్వామివారు కష్టపడుచున్నారు.


**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగానైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.


**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**
**గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**
**ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,**
**హైదరాబాద్. ఫోన్: 040-27175050**

తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 23వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చుమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050


ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**

# తిరుప్పావై

## శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు

గత సంచిక తరువాయి

### 19వ పాశురము

కుత్తు విళక్కెరియ క్కోట్టుక్కాల్ కట్టిల్ మేల్,
మెత్తెన్ఱ పఞ్చశయనత్తిన్ మేలేఱి,
కొత్తలర్ పూంకుళల్ నప్పిన్నై కొంగైమేల్,
వైత్తు క్కిడన్ద మలర్ మార్ పా! వాయ్ తిఱవాయ్,
మైత్తడంకణ్ణినాయ్! నీ యున్ మణాళనై,
ఎత్తనైపోదుమ్ తుయిలెళవొట్టాయ్ కాణ్!,
ఏత్తనై యేలుమ్ పిరివాత్త కిల్లాయాల్,
తత్తువమన్ఱు తగవేలో రెమ్బావాయ్.

తాత్పర్యము – నీళా శ్రీకృష్ణులిరువురను కలిపి లేపుట, అర్థించుట మన కర్తవ్యము. చుట్టును దీపములు వెలుగుచుండగ కువలయాపీడమనే గజదంతముల కాళ్ళు గల మంచముపై మృదువైనట్టి చల్లదనము, మార్దవము, వైశాల్యము, సౌగంధ్యము, తెల్లదనము మొదలగు ఐదు లక్షణములు గల శయ్యపై అధిరోహించి, గుత్తులుగ వికసించిన పుష్పములకు ఆధారమైన శిరోజములు కల నప్పిన్నపిరాట్టి యొక్క వక్షోజములను తనపై నుంచుకొని (లేక) నీళాదేవి యొక్క ఉన్నత స్తనగిరి తటములపై శయనించియున్న విశాలమైన వక్షస్థలముచే శోభిల్లు స్వామీ! నోరు తెరచి ఒక్కమారు పలుకవయ్యా. కాటుక నలుపు కలిగి విశాలమైన నేత్రశోభ కల ఓ నీళాదేవీ! ఏమమ్మా! నీవు నీ భర్త నొక్కక్షణమైన నీ యందలి మోహమును వదలి మావద్దకు వచ్చుట కంగీకరింపకున్నావే! ఆ మాత్రము గూడ భర్త యొక్క విశ్లేషము సహింపలేవా? ఇది నీ యొక్క పురుషకార స్వరూపానికి స్వభావానికి కూడా తగినది కాదమ్మా!

విశేషార్థము – భారతీయ ఆధ్యాత్మిక వాఙ్మయానికుండే గొప్పదనం మరి దేనికీ లేదు. మనిషికి సహజమైన భావనలను వదలమనదు, లేనివి తెమ్మనదు. బాగుపడడానికి ''ఆ స్వభావాలనే'' దైవం వైపు మలచ గలిగితే చాలునంటుంది. పుట్టిన ప్రతి ప్రాణికీ శృంగారం తెలుసు. దానివల్లే కదా



జాతులు జీవించేది. ఏ చదువూ లేకున్నా మనిషికి అది తెలుసు. దైవానుగ్రహం, ఆత్మోద్ధరణ కోరినవాడది మరచిపోవాలా? వదలాలా? కాదట. ఆ శృంగార భావాల్లో దైవాన్నే పెట్టుకుంటే చాలు.

వానాకాలంలో నదిలో పొంగిన ప్రవాహం ఊళ్ళు ముంచుతుంది. సముద్రం పాలౌతుంది. ఆపితే ఆగేది కాదుగా! ఏం చేస్తున్నాం? ఒకచోట డామ్ కట్టి, ప్రవాహాన్ని ఆపి, తిరిగి కాలువల్లో వదులుతున్నాం. ఇక ఊళ్ళు మునగవు. పంటలు పండుతాయి. మిగిలితే అది సముద్రం పాలు. ఫర్వాలేదు. ఈ సహజ ప్రవాహాన్ని క్రమబద్ధం చేసినట్లే మనిషి శృంగారాన్ని క్రమబద్ధం చేయాలట. మానవ సహజ సెక్సు బలహీనత నాసరా చేసుకుని దండగ సాహిత్యాన్ని రాసిపారేశారు కవులు. రాస్తున్నారింకాను. మొదలే బలహీనమైన సమాజాన్ని ఎంతగా దిగజారుస్తుందో ఈ సాహిత్యం చూస్తునే ఉన్నాం. మనిషికది సహజం. ఈ భావప్రవాహానికి ఒక డామ్ కట్టాలి. అదే దైవమన్నది. మన వాఙ్మయం. చేదు మందు మీద తీపిపూత, మింగడానికి పనికి వస్తుందంతే. అసలు పనిచేసేది లోపల చేదుమందే. రోగం పోతుంది. అలానే సెక్సు పూత పూసి లోపల దైవాన్ని మందుగా పెడితే సాత్విక స్వభావాలను పుంజుకుంటుంది. దైవస్తోత్రాల్లోని

వర్ణనల ప్రయోజనమదే. శృంగార వర్ణన అలవాటు కనుక ఆకర్షిస్తుంది. వింటాం, చదువుతాం. శృంగారం మనలోని తుచ్ఛ సుఖవాంఛలను కడిగేస్తుంది. అందులోని దైవం మన మనః ఫలకం మీద అందముగా ముద్రపడుతుంది. అయితే ఎవరిదీ శృంగారం? జగన్మాతా పితరుల శృంగారమది. ఆమె అత్యంత సుందరి. ఆమె వక్షస్థలంలో పర్వతాల లోపలే సింహం ఉన్నట్లు ఒకమూల ఒదిగిపోయి స్వామి ఉంటాడట. స్వామి విశాల వక్షస్థలమందు ఆమె ఇమిడి ఒకసారి ఉంటుందట. ఇలా మారుతూ ఉంటుందట వారి స్థితి.

ఆమె లక్ష్మి. జీవులందరికీ తల్లి. నారాయణుడు తండ్రి. మన పుట్టుకకు కారణమేమిటి? అమ్మలోని వక్షస్థల సౌందర్యానికి తండ్రి ఆకర్షితుడౌతాడు. కామం కలుగుతుందాతనిలో. అమ్మ అతనిని వశం చేసుకుంటుంది. అప్పుడు సంతానం కలిగింది. అంటే అమ్మలోని అందం తండ్రికి భోగసాధనం కదా! పిల్లవాని జన్మకూ కారణం అయింది. అంతేకాదు, తండ్రికి సుఖభోగ్యమైన ఆ వక్షసౌందర్యమే పిల్లవానికి స్తన్యాన్ని అంటే పాలనందించి ఉపజీవ్యమైంది. లేకపోతే పిల్లవాడికి బ్రతుకేది? తనకు జన్మనిచ్చి జీవనాన్నిచ్చేది అమ్మలోని సౌందర్యమే అని తెలుసుకున్ననాడు ఆ సౌందర్యానికి కృతజ్ఞతతో నమస్కరించడా? స్తుతించడా? మ్రొక్కడూ! ఆ మాత్రం చెయ్యకపోతే పిల్లవాడు బ్రతికి దండగ. అమ్మ అందాలు తనకి జీవనాధారాలని చూడాలి. నాన్నకి భోగాయతనాలని తలచాలే తప్ప, తనకైతే కాదుకదా! ఈ విషయం తెలియని మందబుద్ధులు తమను తండ్రి స్థానంలో భావిస్తూ ఈ శృంగారాన్ని దూషిస్తారు. ఈ శృంగారమే జగన్మాతా పితరులది. జీవులందరికీ ఆధారం.

పరమాత్మలో చేరివున్న జీవులు, శరీరం దాల్చాలంటే ఆయనలో కామం కలగాలి. 'సోఽకామయతా' అంది వేదం. 'వానిలో సంకల్పమేర్పడెను' ఎప్పుడు? జీవుల దశ చూసి జాలి పొంగినప్పుడు. జాలికే కరుణ, క్షమ, దయ, కృప అని పేర్లు. ఈ స్త్రీ లింగ శబ్దాలే శ్రీరత్నమైన 'లక్ష్మి'. ఈ కారుణ్యాదులు ఎవరిలోనైనా హృదయంలోనే ఉండేది. అవి పైకి రావాలి. అవే రూపు దాల్చి 'అమ్మ'గా భావిస్తే ఆమె పైకి వచ్చింది. స్వామి హృదయం మీద ఉన్నది. జాలి పైకి రాగానే జీవుల సృష్టి చేద్దామనుకున్నాడు. జీవుల పాత కర్మలు చూసి ఛీ వద్దు అనుకున్నాడు. కృప క్రిందికి పోయింది. స్వాతంత్ర్యం పైకి చేరిందన్నమాట. ఇప్పుడు అమ్మ క్రింద, స్వామి పైన ఉన్నారు. ఇప్పుడు మనకి కష్టం. అమ్మ పైకి వస్తేనే కాని లాభం లేదు. సౌందర్యంతో అమ్మ నాన్నను లాలించినట్లే, కారుణ్యం భగవంతుని స్వాతంత్ర్యాన్ని లాలించి జీవసృష్టి జరిగేట్టు చేస్తుంది. 'శ్రద్ధయా దేవో దేవత్వ మస్నుతే' అమ్మతో కలిస్తేనే మన రక్షకుడు కాగలడు. లేకపోతే దేవుడే కాడాయన అనేసింది వేదం.

ఈ జగత్ సృష్టికి ముందు స్వామి, కృప రెండే ఉంటాయి. స్వామిలో జీవులంతా ఉంటారు. ఇది నీళాభవనము. లోపలి గదిలోని స్థితి. ఎవరి వల్ల సృష్టి? ఎవరు తీయాలి తలుపును?

బయట వీరు పిలిస్తే విన్న అమ్మ, తొందరగా రాబోయిందట. కృష్ణుడు నీళాదేవిని అదిమిపట్టి తనపై వేసుకున్నాడట. అది చూసి 'స్వామీ తగునా అమ్మని అడ్డుట' అంటూ పిలుస్తారు. అప్పుడు తనని పిలిచారని తృప్తిగా తనే లేవబోతాడట. అతన్ని పట్టి అమ్మ తన హృదయంపై అదిమిపెట్టి కాటుక కళ్ళతో 'నీవు వెళ్ళ తగదు' అన్నట్టు చూస్తుందట. ఏమి ఈ వింత! మమ్మల్ని కాపాడడానికి ఈ దంపతులిద్దరికీ ఒకరిని మించి మరొకరికి 'త్వర' ఉంది. ఎవరు ముందు? అమ్మా కొద్దిసేపు కూడా ఎడబాటు ఓర్వలేకపోతున్నావేమమ్మా! అంటూ అమ్మను పిలుస్తారు ఈనాటి పాటలో. వారి రక్షణ దీక్షను, వారు పడుకొనిన పడకను అందంగా వర్ణిస్తుంది ఆండాళ్.

ఏమున్నదో స్పష్టం కాకున్నా తెలుస్తున్నాయి గదిలో. కువలయాపీడ దంతాలు నాలుగు పీకి తెచ్చి ఈమె మంచపుకోళ్ళుగా చేశాడు స్వామి. వాటిపై నాలుగు కమ్మెలు, ఆపైన త్రాటి అల్లిక, మెత్తటి ఐదు లక్షణాల పరుపు తెలుపు, చల్లన, పరిమళం, మృదువుగా, విశాలమై అందంతో పడక ఉండాలట. దానిపై సుకుమార తెల్లవస్త్రం, ఆపైన వీరిరువురూ కనపడుతున్నారు. ఎందుకంటే గుత్తి దీపాలు చుట్టూ ఉన్నాయి మంచానికి. అమ్మ కేశాలలో వికసించిన పూలగుత్తులూ కనిపిస్తున్నాయి. ఇవన్నీ చూస్తూ పాడింది ఆండాళ్. ఇవన్నీ భగవానుడు సృష్టి జరిపే ముందుండే స్థితిలోంచి ఈ కనబడే స్థితికి రావడానికి సూచించే సాంకేతిక పదాలు. భగవానుడు దీపం అయితే అమ్మ కాంతి. మనవద్ద అవసరం తీర్చేది కాంతి. దీపం కాదు. అయితే దీపం దూరంగా ఉంటుంది. దాన్ని ముట్టుకుంటే కాలుతుంది. అలానే జీవుల రక్షణకి స్వామి లేచి రారాదు. కృప రావాలి. అది తీయాలి తలుపు. అది స్వామిని అడ్డి తాను తీస్తానంటుంది. కాదు తానంటాడు. చివరికి అమ్మే పైకి లేచినట్లు కృపయే జయిస్తుంది. తలుపు తాను తీస్తుంది. అయితే ఇద్దరూ విడిచి ఉండరు కదా! కృప అనేది వానిలో ఉండే గుణమే. కనుక ఇద్దరూ లేచినట్లే. దయగలవాడు తియ్యాలి. కేవలం దయ కాదు కదా! అంటే సృష్టి అంతా కృపతో భగవానుడు చేస్తాడని అర్థం. కృపలేనివాడు దేవుడు కాడు. దాన్ని వదలి రారాదు.

ఆ భగవానుడొక్కడే. అయితే దయతో కూడి ఉన్నవాడు. అందుకే ఆయన 'అద్వైత తత్త్వం' కృపాదులతో కూడుకున్నవాడు. అంటే విశిష్టం అంటాడు. ఆ పరబ్రహ్మ ఒక 'విశిష్టాద్వైత తత్త్వ' మని ఉపనిషత్తులు చెప్తాయి. సృష్టికి ముందు దయ ఉంటుంది. సృష్టి తరువాత రక్షించేప్పుడు దయతోటే లయము కూడా. మరో అవకాశం ఇద్దామనే దయతోనేనట. పరమాత్మ కృపా విశిష్టుడైన

ఒక అద్వైత తత్వమని ఆశ్చర్యంగా చెబుతోంది ఉపనిషత్ ఆ దయే అమ్మ. ఆయన తండ్రి. వారి శృంగార లీలావిలాసమే ఈ ప్రపంచమంతా. కనుకనే దైవ ప్రార్థనలలో కన్పించే శృంగారాన్ని తుచ్ఛ భావనలతో ద్వేషించకుండా బుద్ధిమంతులైనవారు దాని అంతరార్థాన్ని గుర్తించి ఆరాధించాలని ఆండాళ్ ఈ పాశురంలో నీళా కృష్ణుల నిరువురినీ సంబోధించింది.

## 20వ పాశురము

ముప్పత్తు మూవరమరర్కు మున్ శెన్ఱు,
కప్పమ్ తవిర్కుమ్ కలియే! తుయిలెళాయ్,
శెప్పముడైయామ్ తిఱలుడైయాయ్! శెత్తార్కు
వెప్పం కొడుక్కుమ్ విమలా! తుయిలెళాయ్,
శెప్పెన్న మెన్ ములై, శెవ్వాయ్ శిఱుమరుంగుల్
నప్పిన్నై నంగాయ్! తిరువే! తుయిలెళాయ్,
ఉక్కముమ్ తట్టొళియుమ్ తన్దున్ మణాళనై,
ఇప్పోదే యెమ్మై నీరాట్టేలో రెమ్బావాయ్.

తాత్పర్యం – ముప్పది మూడు రకములైన దేవజాతుల వారికిన్ని ఆపదలు సంభవించుటకు ముందుగనే వెళ్ళి, వారి వారి వణుకుడు భయాన్ని తొలగించు బలాఢ్యుడా! నిదుర లేవయ్యా! ఋజుస్వభావము నాశ్రిత రక్షణ యందు కలవాడా! గొప్ప సామర్థ్యము కలవాడా! శత్రువులకు భీతిని, దుఃఖమును కలిగించు దోషదూరుడా! నిర్మలుడా! నిదుర లేవవయ్యా! బంగారు భరిణ అనదగి భర్త విశ్లేష సహించలేని మృదుత్వము కల వక్షోజసంపద కల ఎఱ్ఱని అధరోష్ఠము కలదానా! నీళాదేవీ! ఓ పరిపూర్ణురాలా! శ్రీకృష్ణానుభవ ఐశ్వర్యము కలదానా! మేల్కోవమ్మా! విసనికఱ్ఱను, కంచు అద్దమును, నీ భర్త యగు శ్రీకృష్ణుని కూడా మాకొసగి, వెనువెంటనే మమ్ము స్నానమాడింపుమమ్మా!

విశేషార్థము – నామము, రూపము లేని స్థితిలోంచి, ఇన్ని రకాల ఆకారాలు, పేర్లు కలవిగా ఈ పదార్థాలను పుట్టించి, రక్షించేవాడు పరమాత్మ. ఆయనెవడు? కళ్యాణగుణాలన్నీ కలిగినవాడు. ఏవవి? రెండు రకాలు. ఉన్నాయని తెలిస్తే వెళ్ళి ఆశ్రయిద్దామనిపించేవి నాలుగు గుణాలట. అవి జీవుడిలో దోషం చూసినా, ఆవు తన దూడ ఒంటిపై మురికిని నాకి ప్రేమతో శుభ్రపరచినట్లు, ప్రేమతో అంగీకరించేది 'వాత్సల్యం'. వీరంతా తన వారనుకొనే 'స్వామిత్వం'. వీడు క్షుద్రుడైనా, వీడిలోపల ఉండగలిగే 'సౌశీల్యం'. ఎప్పుడు కోరితే అప్పుడు అక్కడ లభింపచేసే సౌలభ్యం. ఈ నాలుగు తెలిస్తే జంకకుండా వెళ్ళి ప్రార్థించడమే కాదు పిల్లవాడు తండ్రిని నిర్బంధించినట్లు భగవంతుణ్ణి డిమాండ్ చేయవచ్చు.

అడిగితే పని చేసి పెట్టగలడనే ధైర్యం చెప్పే గుణాలు మరో నాలుగున్నాయట. అందరి గురించి, సదా తెల్సుకొనే 'సర్వజ్ఞత'. తనకు తెలిసినట్లు ఆయన చేస్తే ఎవడూ అతణ్ణి ప్రశ్నించరాదు. అలాంటి 'సర్వశక్తి'. జీవులందరితో విడరాని సంబంధం 'ప్రాప్తి'. ఎవరికి ఎంత ఇచ్చినా తరిగిపోని 'పూర్ణత' ఈ నాలుగు. పై నాలుగు తెలిస్తే భగవంతుణ్ణి చేరగలమా? లేదా? చేరితే మన పని జరుగునా? లేదా? ఈ సందేహాలు తీరిపోతాయి. ఈ 8 గుణాలు నారాయణ పదంలో ఉన్నాయి. వేదము యొక్క ఆది స్వరమైన ఓంకారములో మొదటి అక్షరం అకారం. ఈ 'అ' అనే అక్షరం ఎవనిని చెపుతుందో అతడే మహేశ్వరుడని 'తస్య ప్రకృతి లీనస్య యః పరః స మహేశ్వరః' అనే వేదమంత్రం చెప్పింది. ఆ మహేశ్వరుడే నారాయణుడు. అ = రక్షకుడు. కారణమైనవాడు అని అర్థం. ఇవి చేయాలంటే పై 8 గుణాలుండాలి. అందుకే ఆండాళ్ నారాయణ మంత్రాన్ని ఉపాసిస్తూ రక్షకుడైన మహేశ్వరుడు ఉత్త నారాయణుడు కాదని 'శ్రీ' తో కూడి ఉంటాడని, ఆయన శ్రీమన్నారాయణుడని తెలిపింది. ఆ శ్రీ అంటే అమ్మ. స్వామిలో గుణాలు పొంగేట్లు చేసి మనం రక్షింపబడేట్లు చేస్తుంది. ఇది తెలిసి అమ్మ ద్వారా స్వామిని చేరితే మనము కూడా ఆయన్ని గట్టిగా డిమాండ్ చేయవచ్చును. అదెలాగో పాశురంలో చూపింది.

'నిద్ర లేవలేని నీ స్వరూప స్వభావాలకిది తగదని' నిన్న కఠినంగా అమ్మని పలికారు వీరు. విరహ బాధతో వాళ్ళలా అన్నా, సమయం చూసి స్వామికి చెపుదామని ఉందట అమ్మ. ఆయనే కాపాడాల్సి ఉండగా అమ్మను పిలిచినా, రానివ్వలేదంటే, అమ్మను నిందించామని ఆగ్రహించి ఉంటాడు అని వీళ్ళు గుర్తించారు. వెంటనే ముందు స్వామిని, ఆపై అమ్మ సౌందర్యాన్ని స్వామికి ప్రీతి కలిగేట్లు స్తుతించారు. ఆపై 'స్వామి నీ అధీనం' కనుక నీవే అనుగ్రహించమని అమ్మని తమకేమి కావాలో కోరుతారీ రోజు. ఆ దంపతులు మన తల్లితండ్రులే అని తెలిస్తే దబాయించి అడగవచ్చు. ఎలా అడిగిందో చూడండి ఆండాళ్.

'ముప్పై మూడు కోట్ల దేవతలకు ఆపదలో ముందు ముందే వెళ్ళి వాళ్ళ వణుకు తగ్గించి, కోరిన రాజ్యములనిచ్చిన బలాఢ్యుడా! ఆర్జవం కలిగిన స్వామీ! నీ తేజస్సుతో శత్రువులను నిర్వీర్యులను చేయు తేజశ్శాలీ! దుష్టులకు దుఃఖాన్నిచ్చే వాడవైనా నీకే దోషమూ అంటని విమలుడా! పరిశుద్ధుడా! నిదుర మేల్కొనవయ్యా'! ఇవన్నీ పైకి పొగడ్తల వలె ఉన్నా, వ్యంగ్యంగా ఆయన్ని ఆక్షేపిస్తున్నారు.

'ఏమయ్యా మేము 5 లక్షల గోపికలమే. దేవతలు 33 కోట్లు. అంత ఎక్కువమంది ఉంటే కాని కాపాడకూడదని నియమమా ఏమి? అల్పసంఖ్యాకులమై పోయామని అనాదరణా?', 'వాళ్ళంతా మగవాళ్ళు. బలశాలులు. మేము స్త్రీలము. నీవే బలం తప్ప వేరు బలం లేనివారం'. 'స్వశక్తితో అహంకరించేవాళ్ళు

దేవతలు'. 'నీకే పారతంత్ర్యం కలవాళ్ళం మేము. వాళ్ళు కోరికలు తీరేదాక పళ్ళికిలించి, తర్వాత నీమీద కత్తి యెత్తే వాళ్ళు దేవతలు'. 'ఏ కోరికలూ లేక, నిన్ను పాడుటే ప్రయోజనం మాకు. ఇలాంటి మమ్ము ఆదరిస్తే తప్పా?' 'కష్టాలు రాకుండా ముందే వెళ్ళి భగదత్తుడి అస్త్రాన్నుంచి అర్జునుని కాపాడావే'. 'నీవు కన్పడక పోవడమే కష్టమైన మమ్ము కాపాడకూడదా?' 'మరణం లేనివారు అమరులు. వాళ్ళనెందుకు కాపాడడం? నిన్ను చూడకపోతే మాకు మరణం'. 'పదవి పోతే ఏడ్పు ఇంద్రాదులకే తప్ప, నీ సేవకోరే మా ఏడుపు, నీ సేవనిస్తూ తీర్చరాదా?' 'నీవే వెళ్ళి వాళ్ళను కాపాడావు. నిన్ను శ్రమ పెట్టవద్దని మేము వచ్చాం'. తప్పైందా? నీవే అడగవలసి ఉండగా, మేం ప్రార్థించడం తప్పైందా? నువ్వు తలవాలి, మమ్మల్ని 'స్మరామి' అన్నావు. మేం స్మరించామని కోపగించావా?

లోకుల బాధలు తీర్చే నీవు... నీ వాళ్ళమైన మమ్ము అనాదరించుట న్యాయమా? ఇంద్రుడిలా మాకు రాజ్యాలు వద్దు. అర్జునుడి కోసం బాణం దెబ్బలు తిన్నట్లు, మా కోసం ఏ దెబ్బలూ తినవద్దు. యుద్ధాలు చేయవద్దు. లోకాలు కొలువవద్దు. మేం కోరేదల్లా నీవు మేల్కొంటే ఆ సౌందర్యం చూడనీ! నీ చూపులను పొందనీ! నీ మాట ఒక్కటి విననీ! నీకు ఏ దృష్టిదోషం తగలకుండా మంగళం పాడనీ! నీ బలము ప్రేమించిన వాళ్ళని బాధించడానికా ఏమిటి? నీ తేజస్సు మా అడ్డు తొలగించడానికా? మమ్మల్నే అడ్డడానికా? నీ ఋజుత్వం మా కోసం కాదా? మమ్ము రక్షించు అన్నారు దేవతలు. 'నిన్ను రక్షించుకుంటాం' అంటున్నాం మేం. మాకూ, ఆ స్వార్థపరులకి తేడా తెలియడం లేదా? ప్రేమించి వచ్చిన మమ్మల్ని దుఃఖపెట్టవచ్చా? నీ గుణాలన్నీ, మమ్మల్ని వేధిస్తే, అబద్ధాలవుతాయి సుమా! ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు, అష్టవసువులు, రెండు అశ్వనీదేవతలు మొత్తం 33 విభాగాలు దేవతలు. వీరందరినీ కాపాడి జగద్రక్షణ చేస్తాడు సర్వేశ్వరుడైన నారాయణుడు. వీరడిగినా చూద్దాం కాసేపని ఊరుకున్నాడు స్వామి. 'ఓహో! అమ్మను కఠినంగా పలికామని అలిగావా! సరే అమ్మకి కోపం లేదు కానీ, నీ కోసం అమ్మనే కీర్తిస్తాం సరేనా!' అంటూ అమ్మ అద్భుత సౌందర్యాన్ని పాడింది ఆండాళ్.

బంగారు భరిణ వంటి సుకుమార స్తనయుగళితో ప్రకాశించు వక్షసౌందర్యం కలదానా! సుకుమార నాజూకు నడుము కల నప్పిన్నా! ఓ పరిపూర్ణురాలా! నీవు సాక్షాత్తు అమ్మవు, లక్ష్మీదేవివి కదా! సౌందర్యము, శీలము, ప్రేమ, విరహము ఓర్వజాలని పరమభక్తి చూచియే స్వామి నీ మాట జవదాటడు. అవియే మా పాలిటి రక్షకములమ్మా. మమ్ము వదిలితే నీ పూర్ణతకు లోటు కాదా! దేవతా స్త్రీల చెర విడిపింప నీవే 9 మాసాలు రావణ చెర పడిన కీర్తి మమ్ము బాధించి కోలుపోవద్దమ్మా! స్త్రీ బాధ స్త్రీకి తెలియదామ్మా! అని ప్రార్థించారు. వెంటనే అమ్మే 'నేను నిద్ర పోలేదర్రా! ఏమి కావాలో చెప్పండి' అంది. అమ్మా 'వింజామరము, అద్దము, నీ స్వామి ఈ మూటిని ఇచ్చి మమ్ము స్నానమాడించు' అన్నారు. నీ స్వామితో మమ్ము స్నానమాడించమనడం దోషం కాదు. లక్ష్మి కూడా మనవలె జీవకోటిలో చేరినదే. అయితే ఎప్పుడూ ప్రకృతి బద్ధురాలు కాదు. స్వరూపజ్ఞానం కలిగి ఉంటుంది. భగవానుడందరికీ తాపము తీర్చు హరి సరస్సు. మనకు దానిలో దిగి స్నానమాడ చేతకాదు. తెలిసినవారు దారి చూపాలి. వారు దేశికులు, అమ్మ, నిత్యులు అట్టివారు. సవతి పోరు లేని అందరికీ చెందిన తత్వం భగవానుడు. అంతా ఒకేసారి సేవించి తరించవచ్చు. సేవ చేసేటప్పుడు అహంకారం, స్వార్థం రాకూడదు. అమ్మకు అది లేదు. కనుక మనమూ భగవత్సేవ చేస్తూ, ఇతరులను చూచి అవి రాకుండా ఉండగలగాలి. అందుకే స్నానము కాగానే స్వేదము పడితే విసనకర్ర, అలంకరించుకొనేందుకు అద్దమూ అడిగారు. స్నానమే భగవదనుభవము కాగానే వచ్చే చెమటయే 'నేను ఆనందించుటకే ఈ సేవ' అనిపించడం. అష్టాక్షరితో 'నమః' నాకు కాదు వాని కొరకే అని తెలియాలి. నా తెలివి వల్లే దేవుడు లభించాడనిపిస్తుంది. 'ఓం' కారమే అద్దం. 'అ' కారమునకే చెందినది 'మ' కారము. నారాయణునకే చెందినవాడీ జీవుడు అని చెప్పును. ఈ స్వరూపజ్ఞానం అమ్మ అనుగ్రహంతో కలుగుననే ఉపనిషదర్థాన్ని రహస్యంగా ఆండాళ్ వివరించింది.

## 21వ పాశురము

ఏత్త కలంగళ్ ఎదిర్ పొంగి మీదళిప్ప,
మాత్తాదే పాల్ శొరియుమ్ వళ్ళల్ పెరుం పశుక్కళ్,
ఆత్తప్పడైత్తాన్ మగనే! అఱివుఱాయ్,
ఊత్త ముడైయాయ్! పెరియాయ్! ఉలగినిల్
తోత్తమాయ్ నిన్ఱ శుడరే! తుయిలెళాయ్,
మాత్తారునక్కు వలి తొలైందు ఉన్ వాశఱ్కణ్,
ఆత్తాదువన్దు ఉన్నడి పణియుమాపోలే,
పోత్తియామ్ వన్దోమ్ పుకళ్ న్దేలోరెమ్బావాయ్.

తాత్పర్యం – అభిముఖురాలై వచ్చి గోష్ఠిలో చేరిన శ్రీ నీళాదేవితో కలిసి అంతా శ్రీకృష్ణుని లేపుట, ఎత్తిపెట్టిన కుండలు పెట్టుటయే తడవుగా పైపైకి పొంగి పొరలిపోతున్ననూ ఆపుట అనేది లేక ఏకధారగా పాలను కురిపించు ఔదార్యము గల గొప్ప పశువుల సమూహములనేకములు గల నందుని యొక్క ముద్దు బిడ్డడవైన శ్రీకృష్ణా! తెలివి తెచ్చుకోవయ్యా! దృఢమైన వేదప్రతిపాద్యుడా! ఇంతమాత్రమే యని చెప్ప వీలుకాని అపరిచ్ఛేద్యుడవే యయినా మా కొఱకై లోకములో ఒక రూపాన్ని ధరించి కన్పట్టుచూ నిలచిన తేజోవిశిష్టుడా! నిదురలెమ్మా! శత్రువులు నీ బలము ముందు నిర్వీర్యులై నీ వాకిటను విడువలేక

వచ్చి నీ పాదసేవకుద్యమించినట్లే మేమున్నూ నీ గుణముల ముందు ఓడిపోయి స్త్రీత్వాహంకారము వదలి నిను కీర్తింప, మంగళమాలాపింప వచ్చి పడియుంటిమయ్యా! లేచి రమ్మా!

విశేషార్థము – భగవంతుణ్ణి పొందడానికి అందరికీ అధికారం ఉంది. పొందించే ఒక యోగ్యుడైన గురువు మాత్రం ఉండాలి. పొందే క్రమం వారే చెబుతారు. లక్ష్మీ సంబంధం తెలుపుతారు. ప్రకృతి సహజంగా ఏర్పడే ఈర్ష్యాసూయలను ఉపదేశం ద్వారా దూరం చేస్తారు ఇక్కడ. మోక్షం చేరినా ఆచార్య సంబంధం ఉండాలనేది ఉపనిషద్రహస్యం. 'అత్ర పరత్రచాపి నిత్యం యదీయ చరణౌ' అక్కడ కూడా నిత్య కైంకర్యాభివృద్ధికి వారు తోడ్పడతారు.

మనలాగే మనిషిలా ఉండే గురువు శక్తిమీద విశ్వాసం కలగడం చాలా కష్టం. కారణ తత్వాన్ని ఉపాసించమన్నది వేదం. అదేమో కన్పడదాయె. కనుకనే ఉపనిషత్తులు కన్పడే ఆకారంలో 'విగ్రహంగా, ఆచార్యునిగా' దైవాన్ని కొలవమంది. 'యథా దేవే తథా గురౌ' అన్నది శ్వేతాశ్వతరం అనే మరో ఉపనిషత్. భగవంతుని యందు ఎంత భక్తో, అంత ఆచార్యుని పట్లా కలిగి ఉండాలంది. ఎదురుగా కనపడగానే చులకన భావం కలుగుతుంది మనకి. చతుర్ముఖ బ్రహ్మ గారికే ఆ బలహీనత ఉందిట. చిన్నికృష్ణుడు చల్దులారగిస్తుంటే ఇదేమి దేవుడు? 'చూద్దామని' 'గో గోపకులందరినీ దాచేశాడు'. తర్వాత 'బుద్ధొచ్చిందని' కాళ్ళపై పడ్డాడు. విగ్రహారాధన మొదటి మెట్టు. చివరి మెట్టులో ఏమీ ఉండవని కొందరి భావన. అది తప్పని మన ఆండాళ్ నిరూపణ. ఇక్కడ విగ్రహమే మొదటిది. ఇదే చివరిది. ఆండాళ్ విగ్రహరూపుని దగ్గరే వ్రతం చేసింది. ఫలించింది. గోపికలు కృష్ణుణ్ణి నమ్మారు. ఫలించింది. రూపు మారినంత మాత్రాన దేవుని విలువ తగ్గదు. గొలుసుగ మారినా బంగారము విలువ మారదు కదా!

విగ్రహంలో, గురువులో పూర్ణత్వము, దివ్యత్వము దర్శించగలవారే ధన్యుడనేది ఆండాళ్ స్పష్టపరుస్తుందీ తిరుప్పావై ద్వారా. ఇది తెలిసినవాడు కనపడే గురువు వద్ద శరణాగతి చేస్తాడు. వారి బాహ్యరూప, ప్రవృత్తులను దాటి వారిలో పరంపరాగత తత్వజ్ఞానాన్ని అనుభవిస్తాడు. అది తెలపాలనే ''గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః'' అని, 'ఆచార్యస్తు హరిస్సాక్షాత్ చరరూపీ న సంశయః' తిరుగాడే దైవమే ఆచార్యుడంటే అని మనకి నేర్పారు పూర్వులు. ఆ ఆచార్యులు మనకి అర్చావిగ్రహంలో పూర్ణత్వాన్ని తెలుపుతారు.

అందుకే ఆండాళ్ వటపత్రశాయిని కొలిచింది. కృష్ణుని భావించింది. వేంకటేశునిలో చేరతానంది. సుందరబాహు స్వామిని మ్రొక్కింది. శ్రీరంగణ్ణి పెండ్లాడింది. ఇదేదో తమాషాగా ఉంటుంది కదూ! కాని కాదు. పై రూపాలు వేరుగా ఉన్నా లోపలి 'నారాయణుడు' ఒకడే అని మనకి అమ్మ దీనితో తెలిపింది. తెలిసి మనము కూడా ఏమీ ఎరుగని 'స్త్రీలము' అని విగ్రహంలో, గురువులో పూర్ణత భావించాలే తప్ప, చేతనౌను అని ఎగరరాదు. ఎక్కడుంటాడని ఎగురుతాం? నీలో పూర్ణత ఉంటే నీ ముందున్న స్తంభంలోంచే వస్తాడు పరమాత్మ. వేదసంపన్నుడైన గురూపదేశం నీలో పూర్ణత్వం కలిగిస్తుందని ఈరోజు అమ్మ తెలుపుతోంది. నిన్న 'అద్దము', 'విసనకర్ర' అడిగారు. స్వామితో స్నానమాడాలన్నారు. ఈ అద్దము ఓంకారం. శరీరంలో ఉండే జీవుణ్ణి దేవునికి చెందినవాడని చూపిస్తుందది. భగవదనుభవం నా తృప్తికేననే స్వార్థాన్ని తుడిచేయడానికి 'నమః' అనే విసనకర్ర కోరింది. నిత్యులు ముక్తులు కూడా పరమపదంలో 'నమ ఇత్యేవ వాదినః'. 'నీ సేవ నీ తృప్తికి తగ్గట్లు ఉంచు తండ్రీ' అని ప్రార్థన ఇది. భగవంతుని కళ్యాణగుణ ప్రవాహంలో స్నానం కోరారు. 'నేనూ మీలో ఒకదాన్నే కదా!' మీ కోరిక తీరేట్లు తప్పక ప్రయత్నిస్తా. రండి! అంతా ప్రార్థిద్దాం స్వామిని అంటూ 'శ్రీమన్నారాయణ చరణౌ శరణం' అనడం నేర్పుతోంది వీరికందరికీ నీళాదేవి. స్వామి పాదాలే తప్ప వేరు గతి లేదని విశ్వాసం. దాని అడ్డురాని బయటి ఆచరణ మనిషికి కావాలి. అమ్మతో కలిసి అంతా స్వామిని లేపుతున్నారు.

''గొప్ప ఉదార పశుసంపద కల నందగోపుని పుత్రరత్నమా! తెలివి తెచ్చుకొని లెమ్ము. పాల్కడలిలోనో, అయోధ్యలోనో లేవు సుమా! మా నందగోపుని అధీనంలో ఉన్నావని మరువకు. వీరికి పశువులని బాగా పెంచడం వచ్చు, కుండలు పెట్టి ఒక్కసారి పొదుగు లాగితే ఇక ఆగవట పాలధారలు. కుండలు తీయడానికి అలసిపోవాలంతే. కుండ పెట్టనివారిది లోటు. పాలది, పశువులది కాదు. ఆ నింపడం కూడా పాలు పొదుగులోంచి వస్తున్నాయా? కుండలోంచా? అన్నట్లు ఎదురు పొంగి వస్తాయట కుండల్లోంచే. ఎవరికో ఉపకారం చేస్తున్నామని కాక తమ పొదుగుల బాధ తీరడానికే ఇస్తున్నట్లు స్రవిస్తాయట పశువులు. అంత ఉదారమైనవి, పెద్దవిన్ని అక్కడ గోవులు. అది నందగోపునివి కదా మరి!'' ఆయనంతటి ఔదార్యాన్ని అవి కూడా కలిగి ఉన్నాయట.

కృష్ణుని ఆనందించి రక్షించు నందగోపుడు ఆచార్యుడే. ఆయన ఎందరికో వేద వేదాన్త శాస్త్రాలు నేర్పుతారు. ఆచార్యుని ఔదార్యమే వారిలోనూ ఉంటుంది. వారే గోవుల సంపద. అడవిలో గడ్డితిని పాలిచ్చు గోవులే శాస్త్రాలు. శాస్త్రారణ్యంలో వారు విహరించి సారం గ్రహించి సులభతరం చేసి శిష్యులకు పాలవలె భగవద్గుణాలు స్రవిస్తారు. ఆ వినెడి శిష్యులే కుండలు. అడిగితే చాలు చెప్తూనే ఉంటారు. అడగని వారిదే లోటు తప్ప ఈ గురువులలో లోటు ఉండదు. వీరందరినీ కల కులపతులే నందగోపుడు. మన రామానుజుల వంటి ఆచార్యులు. వారి వద్ద ఉంటాడు కృష్ణుడు. ఆచార్య సంబంధం చెబితే లేచి వస్తాడు.

తప్పదు.

'ఐశ్వర్య గర్వమా? మాతో సంబంధం లేదా? నిన్ను మరచానా? నిన్ను గుర్తుంచుకుంటే మా కోరిక తీరడంలో ఆలస్యం ఏమీ ఉండరాదు. ఏమి సర్వజ్ఞుడవయ్యా? లే లేచిరా!' అంటూ అడిగారు.

'పశుసంపద అందరికీ ఉంది. నాకు అసాధారణ సంపదొకటుంది. అది మీరు గుర్తించలేదుగా' అని లేవలేదాయన. దాన్ని చెప్తోంది ఆండాళ్, బృందంతో కలిసిన నీళాదేవి.

'దృఢమై వేదము చేత మాత్రమే తెలియబడే ఆది దైవమా! సర్వస్మాత్ పరదైవమా! వేదములో తెలిపిన దానిని నిజము చేయడానికి ఈ లోకుల కన్నులకు దర్శనమిస్తూ ఎన్ని అవతారాలెత్తావయ్యా! అయినా నీలో కాంతి పెరుగుతూనే ఉంది. కృప వల్ల అవతారాలు. కనుక నమ్మినవారిని కాపాడతానని ప్రతిజ్ఞ చేసి ఆరు నూరైనా అది వదలని దార్ఢ్యం కలవాడా! కోరినవారికి కోరికలకు మించి ఇచ్చే పెద్దమనసున్న తండ్రీ! మమ్మల్ని తృప్తి పరచితేనే ఆనందమనుకొనే తేజోమూర్తీ! నీవు ఇపుడు లేవకపోతే అవన్నీ అసత్యాలైపోవూ!' అన్నారు.

'సరి సరి! ఎందుకొచ్చారో చెప్పండి! అడిగాడాయన. 'స్వామీ! శత్రువులు నీ బాణపు దెబ్బలు తినలేక రక్షణకై నీ బలం ముందు దాసోహమని నీ ముంగిట శరణాగతులై పడిగాపులు పడతారు. కాకాసురుడు, రావణుడు వీళ్ళంతా అంతే. అలాగే వాళ్ళకు మించిన దురభిమానం మాలోనూ ఉంది. ఆ స్త్రీత్వాభిమానం వదులుకున్నాం. నీలోని కళ్యాణగుణాలు మమ్మల్ని దూరంగా ఉండనివ్వటం లేదు. నీ పాదాల ముందుకి తెచ్చి పారవేశాయి. శత్రువులు ఏడుస్తూ వస్తారు. మేము ప్రేమించి స్తోత్రాలు చేస్తూ మంగళం పాడుతూ వచ్చాం. వాళ్ళు బాణాల దెబ్బలు తింటే శరీరానికే బాధ. కాని నీ గుణాలు మా మనస్సుని చీలుస్తున్నాయి. ఇవి పైకి కనబడవు. లోపల హింసిస్తాయి. బాణపు దెబ్బలు తప్పించుకోవచ్చునేమో! నీ గుణాలు ఏ మూలున్నా మమ్మల్ని బాధిస్తాయి. స్వామీ నీ పాదాలే పట్టాం. మేం చేసేది చేసేశాం. ఇక నీ ఇష్టం. మమ్మల్ని పొందినా, మానినా మాకేమీ అందులో ప్రమేయం లేదు. ఇవన్నీ నీ సొత్తు!' అని నీళాదేవి ప్రార్థించ నేర్పితే ఆండాళ్ పాడింది.

# భక్త పుండరీకుని కథ

పూర్వం ముచుకుందుడనే రాజు అసురుల మీద యుద్ధం చెయ్యటంలో దేవతలకు సహాయం చెయ్యగా, దేవతలు విజయం పొందారు.

ముచుకుందుడు దీర్ఘకాలం యుద్ధం చేసి అలసిపోవటం వల్ల కొంతకాలం విశ్రాంతి తీసుకోదలచి, తనని నిద్ర లేపినవారు తన చూపుతో భస్మమవుతారనే వరం దేవతల ద్వారా పొంది ఒక గుహలో నిద్రపోసాగాడు.

శ్రీకృష్ణుడు కాలయవనుడనే రాక్షసునితో యుద్ధం చేస్తూ అతడు ఏ ఆయుధం చేతా మరణించడని గ్రహించి ముచుకుందుడు నిద్రించే గుహలో ప్రవేశించాడు. నిదురిస్తున్నది శ్రీకృష్ణుడేననే ఊహతో కాలయవనుడు ముచుకుందుని నిద్రాభంగము చెయ్యటం, అతని చూపు పడి మరణించటం, ముచుకుందునికి శ్రీకృష్ణ దర్శనం కావటం జరిగాయి. ఆ ముచుకుందుడే మరుజన్మలో 'పుండరీకుడి'గా జన్మించాడు. పుండరీకుడు ఒకసారి తాను వెళ్ళే దోవలో కుక్కుటముని ఆశ్రమం దగ్గర నల్లగా, అతి వికారంగా ఉన్న ముగ్గురు స్త్రీలు వాకిలి శుభ్రం చేసి, నీళ్ళు జల్లి, ముగ్గులు పెట్టటం, వారలా చేయగానే అత్యంత సౌందర్యవంతులుగా మారి వెళ్ళిపోవటం చూసి ఆశ్చర్యచకితుడై వారిని ప్రశ్నించగా వారు తాము గంగ, యమున, సరస్వతులనే నదులమని, తమలో మునిగినవారి పాపాల వల్ల తమకి ఆ దుస్థితి వస్తుందని, కుక్కుటముని లాంటి మహనీయుల సేవల వలన ఆ పాపాలు పోయి యథాస్థితికి వస్తామని పేర్కొన్నారు. కుక్కుటమునికి అంత మహిమ అతని మాతాపితరుల సేవతో వచ్చిందని కూడా తెలిపారు. పుండరీకుడు అప్పటి నుండి తన మాతాపితరులకు అత్యంత భక్తి శ్రద్ధలతో సేవ చేయసాగాడు.

ఒకసారి తన భక్తుని పరీక్షించదలచిన పాండురంగడు పుండరీకుడు మాతాపితరుల సేవ చేస్తున్న సమయంలో వచ్చి బయటనుంచి పిలిచాడు. పుండరీకుడు తాను అప్పుడు బయటకు వస్తే తన మాతాపితరులకు నిద్రాభంగం అవుతుందని, అందుకని కొంతసేపు వేచి వుండమని తన చేతికి అందుబాటులో ఉన్న ఒక ఇటుకని విసిరి దానిమీద వేచి ఉండమంటాడు.

భక్తవశుడైన పాండురంగడు పుండరీకుడు బయటకు వచ్చేదాకా ఆ ఇటుకమీదే నుంచుని ఉంటాడు. పుండరీకుని భక్తికి, మాతా పితరుల సేవా తత్పరతకు మెచ్చి వరము కోరుకోమనగా, అక్కడ ఇటుకమీద నుంచున్నట్లుగానే భక్తులకు దర్శనమిచ్చి బ్రోవమని కోరాడు.

విఠలుడు అనే పేరు విట్టు లోంచి వచ్చిందంటారు. విట్టు అంటే కన్నడ, మరాఠీ భాషలలో ఇటుక అని అర్థం. భగవంతునికి భక్తులపై గల కరుణకు ఇది ఒక ఉదాహరణ మాత్రమే.



# భక్తి ముక్తి ప్రదాయకం శయనైకాదశీ వ్రతం

**– చింతలపాటి శివశంకర శాస్త్రి**

శ్లో ॥ "చతుర్భుజం చిదానందం మల్లచాణూర మర్దనం
చరాచర గురుందేవం తం వందే చక్రపాణినం
శ్రియఃకరం శ్రియోనాథం శ్రీధరం శ్రీ వరప్రదం
శ్రీ వత్సల ధరం సౌమ్యం తం వందే శ్రీ సురేశ్వరం"

పద్మనేత్రుడు, పద్మనాభుడు, పద్మమాలాధరుడు, దేవదేవుడుగ ప్రసిద్ధికెక్కిన శ్రీమహావిష్ణువుకు నమస్సులు.

ఆషాఢ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశిగా పేర్కొంటారు. దీనినే 'శయన ఏకాదశి' అని కూడా పిలుస్తారు. శ్రీమహావిష్ణువు ఈ రోజు నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు యోగనిద్రలో ఉంటాడు. నాటినుండి శ్రీహరి భక్తులు కామ క్రోధాదులను వర్జించి, ప్రయాణాలు చేయకుండా ఒకేచోట ఉండి శ్రీహరిని అర్చిస్తూ తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు ఆ నాలుగు నెలలు 'చాతుర్మాస్య వ్రతం' కూడా పాటిస్తుంటారు. ఈ తొలి ఏకాదశిని గురించి భవిష్య పురాణం, బ్రహ్మవైవర్త పురాణం, స్కాంద పురాణం, ధర్మసింధు మొదలైన గ్రంథములు విస్తృతంగా వివరించాయి. అన్ని ఏకాదశులకన్నా దీనికి ప్రత్యేకత ఉంది. ఇది విష్ణువుకు ప్రియమైనది.

"ఏకాదశ్యాంతు శుక్లాయా మాషాఢే భగవాన్ హరి
భుజంగ శయనే శేతే యథా క్షీరార్ణవే తథా"

ఈ రోజు నుండి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు శ్రీమహావిష్ణువు ఆదిశేషునిపై పాలసముద్రంలో పడుకొని యోగనిద్రలో ఉంటాడని భవిష్య పురాణము నందు చెప్పబడింది. అంటే విష్ణుమూర్తి శయనించే రోజు కాబట్టి 'శయనైకాదశి' అని పిలుస్తారు. సంవత్సరంలోని అన్ని ఏకాదశులకూ ఉపవాసం ఉండటానికి వీలుకాని వారు ఈ ఆషాఢ శుక్ల ఏకాదశి నాడు ఉపవాసం ఉండి చాతుర్మాస్య వ్రతం చేస్తే సంవత్సరంలో వారు చేసిన పాపాలు నశించిపోతాయి.

సంవత్సరమునకు పన్నెండు మాసాలు. ప్రతి మాసమునకు రెండు ఏకాదశులు వస్తాయి. "తిథేశ్చ శ్రియ మాప్నోతి". తిథి మానవులకు శ్రేయస్సును కలిగింపచేస్తుంది. తిథులలో

పదకొండవ తిథిని ఏకాదశి అని అంటారు. విష్ణు భక్తులకు ఏకాదశి మహాపర్వదినం. అయిదు కర్మేంద్రియములు, అయిదు జ్ఞానేంద్రియములు మనసు – మొత్తం పదకొండింటి యందు భగవంతుని లగ్నం చేసి సేవించిన వారికి తప్పక ముక్తి లభిస్తుంది. ఈ సత్యాన్ని తెలియజేసేందుకే ఏకాదశికి అంతటి ప్రాముఖ్యత కలిగిగింది.

**"ఏకాదశి నామ సర్వకామ ఫలప్రదం కుర్యన్తి సర్వదా"**

సర్వ కామితములు తీర్చగలది ఈ తిథి. ఈ రోజున విగ్రహారాధన, ఉపవాసముండుట మున్నగునవి ముఖ్యమైనవి. మనిషి ఇంద్రియములకు అధీనుడై ప్రవర్తిస్తాడు. సుఖభోగాలు మనిషిని దైవానికి దూరం చేస్తాయి. ఉపవాసాది కఠిన నియమాల వల్ల ఇంద్రియాటల ప్రభావం తగ్గి, ఆధ్యాత్మిక సాధనలకు మార్గం సుగమం అవుతుంది. ఉచ్ఛ్వాస, నిశ్వాసములలో దైవచింతన ఇమిడిపోవాలి. మనస్సు నిర్మలంగా ఉండి సదా భగవద్భజన యందు విహరించాలి. ఉపవాసం అనగా ఉప + వాసం = ఉప యనగా సమీపాన, దేనికి సమీపాన యనగా భగవంతుని సమీపాన అని అర్థము. వాసము అనగా నివసించుట అని అర్థము. భగవంతునికి సమీపములో ఉండి హరినామ స్మరణ నిరంతరం చేస్తుండాలి. బుద్ధిని భగవంతుని మీద కేంద్రీకరించాలి. అరిషడ్వర్గాలను త్యజించాలి. పరనింద చేయరాదు. అసందర్భపు ప్రేలాపనలు పనికిరావు. అప్పుడే సర్వకామితములు ఈడేరుతాయి. పది ఇంద్రియములు ఏకరూపమై నియంత్రించేందుకు మనస్సు సాధనముగా మలచబడింది. కావున ఏకాదశి అయ్యింది. మనోవికాసం, సమయపాలన, సాత్విక చింతన, సత్కర్మాచరణ, సత్యనిష్ఠ, జ్ఞానపిపాస, మోక్షాసక్తికి సోపానం ఏకాదశి అని అనడం అక్షర సత్యం.

తొలి ఏకాదశినాడు సూర్యోదయానికి ముందే నిద్ర లేచి, కాలకృత్యములు ముగించుకుని స్నానమాచరించి ఏకాదశీ వ్రతాన్ని ఆచరిస్తున్నానని విష్ణుమూర్తికి నమస్కరించాలి. పూజ చేయదలచుకున్న చోట పీఠం ఏర్పాటు చేసుకుని అందులో శ్రీహరి చిత్రపటమును గాని, ప్రతిమ కాని ప్రతిష్ఠించాలి. కొబ్బరి నూనెతో కానీ, నువ్వులనూనెతో కానీ దీపారాధన చేయాలి. ముందుగా పసుపుతో గణపతిని చేసుకుని, గణపతిని పూజించాలి. తర్వాత శ్రీమహావిష్ణువును షోడశోపచారాలతోనూ, అష్టోత్తరాలతోనూ పూజించాలి. తామరపువ్వులు, తులసీదళాలతో పూజ చేయాలి. పండ్లను నివేదన చేయాలి. ఆవు నేతితో పంచహారతి, తూర్పున తిరిగి పంచామృతంతో స్వామిని అభిషేకించాలి. విష్ణు సహస్ర నామాలు, విష్ణు పురాణం, నారాయణ కవచాలను పారాయణం చేయాలి.

**"త్వయి సుప్తే జగన్నాథ జగత్సుప్తం భవే దిదమ్**
**విబుద్ధే త్వయి బుధ్యేత తత్స్వం స చరాచరమ్"**

అనే శ్లోకాన్ని పఠించాలి. ఈరోజు పూర్తిగా ఉపవాసం ఉండి రాత్రి జాగరణ చేయాలి.

మరుసటి రోజు ఆషాఢ శుక్ల ద్వాదశి నాడు యథావిధిగా బ్రాహ్మీ ముహూర్తంలోనే లేచి కాలకృత్యములను తీర్చుకుని స్నానమాచరించాలి. శ్రీమహావిష్ణువును పూజించి నైవేద్యం సమర్పించి భోజనం చేయాలి. శయనైకాదశి నాడు (రాత్రి) విష్ణుమూర్తి కథలను, మాహాత్మ్యాన్ని స్మరిస్తూ, భజనలు చేస్తూ, ఆ స్వామి లీలా విశేషాలను గానం చేస్తూ జాగరణ చేస్తూ గడపాలి. నియమ నిష్ఠలతో ఈవిధంగా ఏకాదశీ వ్రతాన్ని (శయన) పూర్తి చేసిన వారు మరణించిన తర్వాత వైకుంఠమును చేరుకుంటారు.

ఏకాదశీ మాహాత్మ్యాన్ని తెలిపే కథలు అనేకం వివిధ పురాణాల్లో ద్యోతకం అవుతున్నాయి. వాటిలో విష్ణుభక్తులలో అగ్రగణ్యుడు, సద్గుణ గరిష్ఠుడైన అంబరీషుని చరిత్ర కడు మనోహరమైనది. మరియు కమనీయమైనది. పరమ భాగవతోత్తముడైన అంబరీషుని చరితము వినడము వల్ల విష్ణు సేవ చేయాలన్న బుద్ధి వికసిస్తుంది. మోక్షం కోరే వారికి మోక్షం లభిస్తుంది. భవబంధాలు పటాపంచలవుతాయి.

నభాగుని పౌత్రుడు, రెండవ నాభాగుని కుమారుడు అంబరీషుడు. గొప్ప విష్ణుభక్తుడు. ఇతనికి బాల్యం నుండే శ్రీమన్నారాయణునిపై భక్తిభావం ఏర్పడింది. తదేకంగా విష్ణుధ్యానంలో ఉండటం, విష్ణుకథలను వినడం వంటి పనులు చేస్తుండేవాడు. ఇతనికి యుక్తవయస్సు రాగానే తండ్రి నాభాగుడు యువరాజ పట్టాభిషేకాన్ని అంగరంగ వైభవంగా జరిపిస్తాడు. తదనంతర కాలంలో అంబరీషుడు రాజై ప్రజానురంజకంగా పరిపాలన సాగిస్తూ ప్రజల మనస్సులను దోచుకుంటాడు. అంతేకాక యజ్ఞాలు, హోమాలు, సత్సంగాలు నిర్వహిస్తూ ప్రజలలో భక్తి భావాన్ని పెంపొందిస్తాడు.

ఇంతటి విష్ణుభక్తుడైన అంబరీషుడు ఏకాదశీ వ్రతాన్ని చేయాలని సంకల్పించి తన రాజ్యంలోని ఋషులకు, మునిపుంగవులకు తెలియజేసి వ్రతము చేయడానికి పూనుకుంటాడు. ఈవిధంగా సంవత్సర కాలం వ్రతము పూర్తి చేసి ద్వాదశి ఘడియలలో బ్రాహ్మణోత్తములందరికీ భోజనము పెట్టి, తాను భుజించాలని తలపోస్తాడు. అన్న సంతర్పణ చేయుటకు పూనుకొనుచుండగా దుర్వాస మహర్షి తన దగ్గరకు వస్తున్నట్లుగా చారుల వల్ల తెలుసుకుని, ఆతనికెదురేగి అతిథి సత్కారములొనర్చి ''స్వామీ! మీ రాకతో ఈ రాజ్యం పావనమైంది. నేను ఏకాదశీ వ్రతమును సంవత్సరం పాటు చేసి ఉన్నాను. ఈరోజుతో ఏడాది సమయం పూర్తైంది. అతిథులైన మీరు మా ఆతిథ్యమును స్వీకరించి ఆశీస్సులు అనుగ్రహించ వలసిందిగా కోరుతున్నాను'' అని ప్రార్థించాడు.

మహారాజు కోరికకు దూర్వాసుడు అంగీకరించి ద్వాదశి

ఘడి యలు పూర్తికాకముందే నేను యమునానదిలో స్నానమాచరించి వచ్చెదనని పలికి యమునానదికి చేరుకుంటాడు. యమునానదికి వెళ్ళిన దూర్వాసుడు ఎంతసేపటికీ తిరిగి రాకపోయేసరికి అంబరీషుడు ఆందోళన చెంది అక్కడ ఉన్న ముని పుంగవులకు వివరించగా ''ద్వాదశి ఘడియలు పూర్తయ్యే సమయం ఆసన్నమైంది. ఈ స్థితిలో మీరు పారణ చేయకున్న ఫలితము దక్కదని, వారు వచ్చేలోపు జలాన్ని స్వీకరించి వారు వచ్చిన తర్వాత వారికి ఆతిథ్యము ఇచ్చి భోజనం చేయండి. దీనివలన వ్రతభంగము కాదని'' చెబుతారు.

ఋషీశ్వరుల అభిప్రాయము తెలుసుకున్న అంబరీషుడు వారు చెప్పిన విధంగానే తీర్థం స్వీకరించి పారణ పూర్తి చేస్తాడు. అనంతరం దూర్వాసుడు వచ్చి తన జ్ఞాన నేత్రంతో అంబరీషుడు పారణ చేసిన విషయాన్ని గ్రహించి ఆగ్రహంతో అతిథి మర్యాదని పాటించని నీవు క్షమించరాని నేరం చేశావు. అందుకు శిక్ష అనుభవించవలసిందేనని పలికి 'కృత్య' అను రాక్షసితో అంబరీషుని చంపమని ఆజ్ఞాపించాడు. వెంటనే ఆ రాక్షసి హా హా కారాలు చేస్తూ అంబరీషుణ్ణి సమీపించబోగా నారాయణుని సుదర్శన చక్రం అక్కడ ప్రత్యక్షమై కృత్యను వధించి దూర్వాసుణ్ణి చంపడానికి వెంటబడింది.

సుదర్శన చక్రం తనవైపు రావడంతో భీతిల్లిన దూర్వాసుడు బ్రహ్మను, శివుణ్ణి ఆశ్రయించి, భంగపడి చివరకు నారాయణుని ఆశ్రయించాడు. తనను ఆశ్రయించిన దూర్వాసుణ్ణి చూసి ఆతనితో పూజించవలసిన వారిని, సత్పురుషులను అవమానిస్తే తగిన శిక్ష అనుభవించవలసిందే! పరమ భాగవతోత్తముడైన అంబరీషుణ్ణి పట్టుకుని నీవు విష్ణుభక్తుడివా? అని నిందించావు. అది క్షమించరాని నేరం. నీవు ఎవరినైతే నిందించావో వారే నిన్ను కాపాడగల సమర్థులు. నీ తప్పుని సరిదిద్దడం నావలన కాదు కావున ఆతనినే శరణు వేడమని పలికాడు.

దూర్వాసుడు శ్రీహరి పలుకులు విని చేయునది లేక అంబరీషుణ్ణి చేరి శరణు జొచ్చాడు. తనను శరణు జొచ్చిన దూర్వాసుణ్ణి చూసి అతని భయాన్ని పోగొట్టి అభయమిచ్చి నారాయణుని ప్రార్థించి ప్రసన్నం చేసుకున్నాడు. అంబరీషుని ప్రార్థనతో శ్రీమహావిష్ణువు సుదర్శన చక్రాన్ని శాంతింప చేసి దూర్వాసుని భీతిని పోగొట్టాడు. అనంతరం అంబరీషుని ప్రార్థనతో దూర్వాసుడు ఆతని ఆతిథ్యాన్ని స్వీకరించాడు. అంబరీషుడు తన ఏకాదశీ వ్రతాన్ని పూర్తి చేశాడు.

విష్ణు ప్రీతికరమైన శయనైకాదశి వ్రతాన్ని నియమ నిష్ఠలతో ఆచరించి తరిద్దాము. జీవితమును చరితార్థము చేసుకుందాము.

**"నారాయణ నారాయణ జయగోవింద హరే**
**నారాయణ నారాయణ జయగోపాల హరే"**


# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

## రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

కాకిని తోలటంలో చాలాసార్లు ప్రయత్నించింది సీతమ్మ. చూశాడు రాముడు. నవ్వాడు. కాని మిన్నకున్నాడు. తన ప్రయత్నం మానింది వైదేహి. జీవుడు తన ప్రయత్నాల్లో ఉంటే భగవంతుడు ఉపేక్షిస్తాడు. స్వప్రయత్నం విరమిస్తే అపుడు రంగంలోకి దిగుతాడు. జీవుణ్ణి ఆదుకుంటాడు స్వామి. కౌరవ సభలో ద్రౌపది తన ప్రయత్నంలో వుంది. ఒకచేత చీరముడి పట్టుకుంది. కృష్ణుని రక్షించమని కోరింది. స్వప్రయత్నం మానింది. రెండు చేతులెత్తి ప్రార్థించింది. రక్షింపబడింది. గజేంద్రుడు మొసలితో పోరాడాడు. ఎంతకాలమో పోరాడాడు. శక్తిహీనుడైనాడు. రావే ఈశ్వరా కావవే అన్నాడు. రక్షణ పొందాడు.

ఎవరి సమక్షంలో మన సంతోషం ద్విగుణీకృతమవుతుందో, ఎవరి దగ్గర మన బాధలు సగమవుతాయో, ఎవరి దగ్గర మన మనసు ప్రశాంతంగా ఉంటుందో వాళ్ళే మనకు ప్రియులు, ఆత్మీయులు. సీతమ్మ ఆత్మీయుడు హనుమ. అంతేకాదు ఆచార్యుడు కూడా.

## ధైర్య వచనాలు

హనుమంతునితో మళ్ళీ అంటోంది మైథిలి. 'ఈ చూడామణి చూస్తాడు రాముడు. వెంటనే నా తల్లిని, తండ్రిని, దశరథ మహారాజును గుర్తుకు తెచ్చుకుంటాడు. నన్ను స్మరిస్తాడు. హనుమా! ఈ కార్య నిర్వహణకు నీవే సమర్థుడవు. నడుం బిగించు. నా దుఃఖాన్ని పోగొట్టు. నన్ను గట్టెక్కించు'.

'అలాగే' అని ప్రతిజ్ఞ చేశాడు. వైదేహికి నమస్కరించాడు. వెళ్ళటానికి ఉపక్రమించాడు. వెళ్ళిపోతున్నాడని కన్నీరు పెట్టుకుంది సీతమ్మ. గద్గద స్వరంతో అంది మళ్ళీ.

''సుగ్రీవుని క్షేమమడిగినట్లు చెప్పు. రామునికి ఇక్కడి సంగతులు చెప్పు. రాముణ్ణి ఉత్సాహపరుచు. పౌరుషాన్ని పెంచు. హనుమా! ఒక్కరోజు ఇక్కడ ఉండవా? రహస్యంగా దాగి ఉండు. నా మనసుకు శాంతి లభిస్తుంది. దుఃఖం తగ్గినట్లు ఉంటుంది. కాదని వెళ్ళిపోతావా? నీవు తిరిగి వచ్చేలోపల వుంటానో వుండనో? నాయనా! గరుత్మంతుడు, వాయుదేవుడు, నీవు – మీ ముగ్గురే శక్తిమంతులు. వానరసేనలో నీవే గొప్పవాడివి. మిగిలిన వానరులు రామలక్ష్మణులు సముద్రం దాటగలరా? అదే నా సందేహం''.


అయినా ససైన్యంతో రాముడు రావాలి. బాణవర్షంతో లంకను చికాకు పరచాలి. రావణుని చంపాలి. నన్ను తీసుకెళ్ళాలి. అది రామునికి తగింది. అది అతని పరాక్రమానికి తగింది. ఆ పనులు నీవు ఎలా చేయిస్తావో.

విన్నాడు హనుమంతుడు. 'అమ్మా! కోట్లాది వానర

భల్లూక సేనలున్నాయి. రామునితో వస్తాయి. వాళ్ళు మహా పరాక్రమవంతులు. శక్తిమంతులు. తేజస్సంపన్నులు. సముద్రం దాటుతారు. భూమండలాన్ని చుట్టి రాగలరు. మనోవేగ గమనులు. పైకి కిందికి అడ్డంగా పోగలరు. ఎంత కష్టమైన పనైనా చేస్తారు. భయపడరు. సుగ్రీవుని దగ్గర నన్ను మించిన వారున్నారు. నాతో సమానులున్నారు. నాకంటే తక్కువ వాడు ఒక్కడూ లేడు. ఇలాంటి పనులకు దూతగా తక్కువ వారినే పంపుతారు. గొప్పవాళ్ళని పంపరు. అందుకే నన్ను పంపారు. దేవీ! విచారపడకు. మావాళ్ళు ఒక్క గంతులో సముద్రాన్ని దాటుతారు. రామలక్ష్మణుల విషయమా – వారిని నా భుజాలపై తీసుకువస్తాను. నేను వెళ్ళటం – రామునికి చెప్పటం ఆలస్యం – రాముడొచ్చేస్తాడు. అంతవరకు ఓర్చి ఉండు తల్లీ – అలా ధైర్యం చెప్పాడు.

వినిందామె. మళ్ళీ అంటోంది. హనుమా! పైరు సగం పెరిగింది. వాన పడినట్లు నీ మాటలు నాకు ఆనందాన్ని కలిగించాయి. కాకిపై అస్త్రం వేశాడు. అది రామునికి చెప్పు. ఒకరోజు నా నుదుటి బొట్టు చెదిరిపోయింది. మణిశిల తీసుకున్నాడు. గంధం తీశాడు. దాన్ని నుదుట కాదు చెక్కిలి మీద దిద్దాడు. ఆ విషయం గుర్తుగా చెప్పు.

నాయనా ఇంతవరకు చూడామణి ఉంది. అందులో రాముణ్ణి చూసుకునేదాన్ని. దాన్ని గుర్తుగా ఇచ్చాను. ఇక శోకంతో కృంగిపోవాలి. నేనెలా బతకాలి? ఒక నెల మాత్రం ఉంటాను. రాముడు రాలేదో నా ప్రాణాలు పోతాయి. రావణుడు మహా క్రూరుడు. వాడి చూపులు ఇంకా క్రూరంగా ఉంటాయి. అవి



నన్నెంతో బాధించాయి. నీవు రావడం ఆలస్యమైతే నేను బతకను – అవి సీతమ్మ దీనాలాపనలు.

విన్నాడు హనుమంతుడు. అంటున్నాడు. తల్లీ! నీవు నాకు కనిపించావు. ఇక మీకు దుఃఖాలుండవు. నిబ్బరం తెచ్చుకో – అని మళ్ళీ ధైర్యం చెప్పాడు. శిరసా ప్రణమిల్లాడు. దేహం పెంచాడు.

"హనుమా! రామ సన్నిధికి వెళుతున్నావు. అందరినీ అడిగినట్లు చెప్పు. ఇక్కడ రక్కసి మూకలు నన్ను భయపెట్టాయి. బాధ పెట్టాయి. ఆ తీరు విన్నవించు. నీ ప్రయాణం సుఖంగా సాగుగాక" అంది సీతాదేవి. సరే అన్నాడు మారుతి. మిగిలిన పని ఉంది కదా అని ఆలోచించాడు మనసులో. ఉత్తర దిశ చేరాడు.

## అశోక వన ధ్వంసం

దుఃఖాన్ని దిగమింగటం కష్టం. నిరాశ నిస్పృహల్లోంచి బయటపడాలి. అందుకు తగిన మనోబలం కావాలి. నిబ్బరం కావాలి. అది ఆచార్యుని ద్వారా / గురువు ద్వారా జీవునికి లభిస్తుంది. ఇక్కడ సీతాదేవి శోకనిమగ్న అయింది. ఆచార్యునిగా హనుమంతుడు వచ్చాడు. ధైర్యాన్ని నిబ్బరాన్ని ప్రసాదించాడు.

సీతమ్మ దగ్గర సెలవు తీసుకున్నాడు ఆంజనేయుడు. చేయాల్సిన పని మిగిలిందనుకున్నాడు. ఇంత దూరం వచ్చాక రావణుని బలమెంతో తెల్సుకోవాలి.

**కార్యే కర్మణి నిర్దిష్టే యో బహూన్యపి సాధయేత్ ।**
**పూర్వకార్య విరోధేన సకార్యం కర్తు మర్హతి ॥**

చెప్పిన పని చేయాలి. ఆ పనికి భంగం రాకుండా – ఇంకా ఎన్నో పనులు సాధించాలి. వాడే కార్యదక్షుడు. ఎంత చిన్న పనైనా ఎన్నో ఉపాయాలతో సాధించవచ్చు. అది తెలిసినవాడే చేసేవాడే సమర్థుడు. ఇపుడు శత్రుబలమెంతో తెలుసుకోవాలి. దానికి తగ్గ బలం మనకు ఉందా అని బేరీజు వేసుకోవాలి. శత్రుబలం ఇంత అని సుగ్రీవునికి చెప్పాలి.

ఇక్కడి రాక్షసుల్ని చంపాలి. అపుడు వీళ్ళు మెత్తపడతారు. నాకు, రాక్షసులకి యుద్ధం జరగాలని నిశ్చయించుకున్నాడు మారుతి. ఈ అశోకవనం ఇంద్రుని నందనవనంలా ఉంది. ఎండిన అడవిని అగ్నిదేవుడు భస్మం చేస్తాడు. అలా నేను ఈ వనాన్ని ధ్వంసం చేస్తాను. అపుడు రావణునికి తెలుస్తుంది. పెద్ద సేనల్ని పంపుతాడు. నామీద విరుచుకుపడతారు. ఆ సేనని నాశనం చేస్తాను. వచ్చిన దారిన పోతాను. కిష్కింధ చేరుతాను అనుకున్నాడు ఆంజనేయుడు.

భయంకర పరాక్రముడు మారుతాత్మజుడు. క్రుద్ధుడైనాడు. పెనుగాలిలా చెలరేగాడు. పెద్ద పెద్ద చెట్లు విరిచాడు. నానావిధ వృక్షాలతో, లతలతో వుంది ప్రమదావనం. దాన్ని భగ్నం చేశాడు. సరస్సులు పూడ్చాడు. క్రీడా పర్వతాలు నుగ్గు నుగ్గు చేశాడు. కోనేళ్ళ పాడు చేశాడు. వాటి మెట్లు విరగ్గొట్టాడు. అది అందమైన

అశోకవనం. క్ష ణకాలంలో పూర్వవైభవాన్ని కోల్పోయింది. లతా గృహా లు, చిత్రగృహాలు, శిలాగృహాలు కూలిపోయాయి. మహాసర్పాలు, క్రూరసర్పాలు బయట పడ్డాయి. నలుదిశలా పారాడసాగాయి. పక్షులు ఎగిరిపోయాయి. అశోకవనం రావణుని భార్యల భోగస్థానం. వన ధ్వంసాన్ని చూస్తే రావణుని మనస్సు క్లేశ పడుతుంది. భగ్గుమంటుంది. రాక్షస యోధులు వస్తారు. ఇప్పుడు పోరాడే సమయం అని తలచాడు. వనముఖ ద్వార తోరణం మీద కూర్చున్నాడు. శత్రురాకకై ఎదురు చూస్తున్నాడు.

## ఎవడు వాడు?

పక్షుల కూతలు, పెళ పెళా విరిగే చెట్ల శబ్దాలు, మృగాల అరుపులు లంకా పట్టణమంతా వినిపించాయి. అందరూ భయభ్రాంతులైనారు. రాక్షస వినాశనాన్ని సూచించాయి దుర్నిమిత్తాలు. నిద్రలో ఉన్నారు రాక్షసాంగనలు. ఉలిక్కిపడి లేచారు. సుందరమైన వన నాశనాన్ని చూశారు. వీరుడైన మహా కపిని చూశారు. వారిని చూశాడు హనుమంతుడు. భయపెట్టాలనుకున్నాడు. మహాకాయాన్ని పెంచాడు. అది మహాభయంకరంగా ఉంది. చూశారు వాళ్ళు.

సీతాదేవిని సమీపించారు. ''ఇతడెవరు? ఎవరు పంపించారు? ఎక్కడ నుంచి వచ్చాడు? ఎందుకు వచ్చాడు? నీతో ఏం మాట్లాడాడు? విశాలాక్షీ భయపడకు. నిజం చెప్పు''.

రాక్షసుల విషయం నాకేం తెలుసు. ఇతనెవరో తెలియదు. ఏం చేయాలనుకున్నాడో తెలియదు. అది మీకే తెలియాలి. పాముల జాడలు పాములకే తెలుస్తాయి. అది లోక విదితం. ఇతణ్ణి చూశాను. భయ పడుతున్నాను. కామరూపియై ఉంటాడు. మీ రాక్షసుల్లో ఒకడేనేమో!

అది వైదేహి సమాధానం. విన్నారు రాక్షస స్త్రీలు. కొందరు అక్కడే ఉన్నారు. కొందరు పారిపోయారు. రావణునికి చెప్పాలని వెళ్ళారు కొందరు.

హనుమంతుడెవరో తెలియదు. అది సీతమ్మ మాట. అది పచ్చి అబద్ధం. అసత్యం పలకవచ్చా? – ప్రశ్న. హనుమ తన రక్షకుడు. నిజం చెబితే అతణ్ణి చంపేస్తారు. నిజం చెప్పరాదు. అసత్యం చెబితే అది దోషం. ఒక సత్యవచనంతో అపాయం కల్గుతుంది. అది సామాన్య ధర్మం. అసత్యవచనంతో అపాయం నుండి తప్పించవచ్చు. అది సూక్ష్మ ధర్మం. అసత్యం పలికి పాపఫలం పొందినా పర్వాలేదు. తనకు సాయపడేవాణ్ణి రక్షించాలి. అది జనకాత్మజ ఆలోచన. అంటే సూక్ష్మధర్మాన్ని పాటించింది.

రాముడూ అంతే. రథం ఆపు అన్నాడు దశరథుడు. రథాన్ని పోనీయ్ అన్నాడు రాముడు. రథం ఆపితే – మహారాజు దుఃఖిస్తాడు. ఆ దుఃఖం చూడలేడు రాముడు. తండ్రి మాట వినపడలేదని చెప్పు అన్నాడు రాముడు. అది అసత్య వచనం. అది దోషం. దుఃఖాన్ని ఎక్కువసేపు చూడరాదు – అదొక కారణం. తండ్రిని సత్యవచనుణ్ణి చేయాలి. ధర్మబద్ధుణ్ణి చేయాలి – అది రెండో కారణం. సూక్ష్మధర్మానుసారం రాముడు అబద్ధం చెప్పాడు.

రాక్షసాంగనలు వెళ్ళారు. రాక్షసరాజుతో అంటున్నారు. 'మహారాజా! ఒక వానరుడు వచ్చాడు. భయంకరంగా ఉన్నాడు. అశోకవనం పాడు చేశాడు. సీతాదేవితో మాట్లాడాడు. ఎవరని అడిగాం. ఆమె జవాబు చెప్పలేదు. తనకి తెలియదని చెప్పింది. వాడు దేవేంద్రుని దూతో – కుబేరుని దూతో – రాముడు పంపిన దూతో వుండొచ్చు. అద్భుతమైన అందమైన ప్రమదావనాన్ని కూడా నాశనం చేశాడు. వాడు ధ్వంసం చేయని చోటు లేదు. జానకి వుండే స్థలం వాడు తాకలేదు. శ్రమతోనో అలసటతోనో ఆగిపోయాడేమో తెలియదు. అయినా వాడి పరాక్రమం అద్భుతం. వాడికి శ్రమ ఏమిటి? అలసట ఏమిటి? జానకిని రక్షించాలనే వచ్చాడు. సుందరమైన శింశుపా వృక్షాన్ని మాత్రం పాడు చేయలేదు.

రాజా! నీవు ఉగ్రరూపుడవు. ఆ కోతిని శిక్షించాలి. వెంటనే ఆజ్ఞాపించు. వాడు సీతతో మాట్లాడాడు. రాక్షసేశ్వరా! నీ మనసంతా సీతే కదా! ఆమెతో మాట్లాడాడు. ఆ సాహసిని బతకనిస్తావా?

## 80 వేలమంది

విన్నాడు రావణుడు. కోపంతో ఊగిపోయాడు. కనుగుడ్లు తిప్పాడు. హోతాగ్ని జ్వాలలా మండిపడ్డాడు. మండే దీపం నుంచి తైలబిందువులు రాలినట్లు – క్రోధావేశంతో అతడి నేత్రాల్లోంచి వేడి అశ్రుబిందువులు జారాయి. పరాక్రమంలో తనతో సమానులైన రాక్షసులున్నారు. వారిని పిలిచాడు. వాళ్ళు 80 వేల మంది. 'వెళ్ళండి. వానరుణ్ణి పట్టండి. బంధించండి' అది ఆజ్ఞ.

వాళ్ళంతా భయంకరాకారులు. మహాబలశాలురు. రణోత్సాహులు. పెద్ద పెద్ద కోరలున్నవారు. అనేక ఆయుధాలు పట్టి వెళ్ళారు. అశోకవనం తోరణం మీదున్నాడు హనుమంతుడు. చూశారు వాళ్ళు. మండే అగ్నిలో పడే మిడతల్లా ఉన్నారు రాక్షసులు. మహావేగంతో దూసుకుపోయారు. ఇనుప గుదియలు, అడ్డకత్తులు, శూలాలు, ఈటెలు, తోమరాలు (చిన్న ఈటెలు) బల్లాలు వారి ఆయుధాలు.


చూశాడు పర్వత సమానుడు ఆంజనేయుడు. తోకను నేలకేసి కొట్టాడు. పొలికేక వేశాడు. దేహాన్ని పెంచాడు. భుజాలు చరిచాడు. ఆ శబ్దం లంకంతా వినపడింది. ఆకాశంలోని పక్షులు నేలకూలాయి. జయఘోష పెట్టాడు.

**జయత్యతి బలో రామో లక్ష్మణశ్చ మహాబలః ।**
**రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభి పాలితః ॥**
**దాసోహం కోసలేంద్రస్య రామస్య క్లిష్ట కర్మణః ।**

హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః ॥

అతి బలశాలి రామునికి జయం. మహాబలశాలి లక్ష్మణునికి జయం. రాముడు కాపాడిన సుగ్రీవునికి జయం. అసహాయ శూరుడు, కోసల దేశ ప్రభువు రామునికి నేను దాసుణ్ణి. వాయుపుత్రుణ్ణి. నా పేరు హనుమంతుడు. శత్రుసైన్యాలను హతమారుస్తాను. వేల మంది రావణులు వచ్చినా నన్నెదిరించలేరు. నిలువలేరు. వేలాది రాళ్ళతో చెట్లతో రాక్షసుల్ని చంపుతాను. మీరు చూస్తుండగా లంకను మర్దిస్తాను. మైథిలికి నమస్కరిస్తాను. నా పని పూర్తి చేస్తాను. వెళ్ళిపోతాను.

ఈ శ్లోకాలు శ్రీరామాయణంలో రత్నాలు. ఇది విజయమంత్రం. శ్రద్ధతో అనుసంధానం చేస్తే శత్రువులపై విజయం తథ్యం అన్నారు పెద్దలు.



తనెవరో చెప్పాడు హనుమంతుడు. భయపడలేదు. తను రామ దాసుణ్ణి అని మొదటిసారి చెప్పాడు. జీవలోకే మమైవాంశః అన్నాడు కృష్ణభగవానుడు. జీవులు పరమాత్మ అంశలు. జీవులు పరతంత్రులు. పరమాత్మకి దాసులు. పరమాత్మ చేతిలో ఉపకరణాలు. రాక్షస సంహారం చేసేది నేను కాదు, నా చేత రాముడు (నారాయణుడు) చేయిస్తున్నాడు. దాని ఫలమూ పరమాత్మదే. చేయించేవాడిదే. ఇది జీవుని (ఆత్మ) స్వరూప జ్ఞానం. అది తెలుసుకోవాలంటాడు వాల్మీకి. ప్రతి కర్మ భగవదర్పితం కావాలి. అప్పుడు అది అకర్మ అవుతుంది.

హనుమంతుని చుట్టుకున్నారు కింకరులు. తోరణానికి బిగించి వుంది ఒక ఇనుప గుదియ. దాన్ని పెకలించాడు. ఆ పరిఘ చేత పట్టాడు. పాముని పట్టిన గరుత్మంతునిలా కనిపించాడు మారుతి. కింకరుల్ని చంపుతున్నాడు. కొందరు భయపడ్డారు. పరిగెత్తారు. ఉన్నవాళ్ళలో ఒక్కడూ మిగల్లేదు. అందరూ చచ్చారు. తోరణమెక్కి కూర్చున్నాడు వాయుపుత్రుడు.

పారిపోయినవాళ్ళు రావణుణ్ణి చేరారు. వాడు మనవాళ్ళని చంపాడు – చావు కబురు చల్లగా చెప్పారు. విన్నాడు రావణుడు. కన్నులెర్ర చేశాడు. రావణుని మంత్రుల్లో ప్రహస్తుడు ఒకడు. వాని కొడుకు జంబుమాలి. వాణ్ణి పంపాడు రాక్షసరాజు.

## చైత్య ప్రాసాదం

తోరణంపై ఉన్నాడు హనుమంతుడు. రాక్షస యోధుల కోసం నిరీక్షిస్తున్నాడు. అంతలో అతని చూపు చైత్య ప్రాసాదం పైన పడింది. అశోకవనం దగ్ధం చేశాను. ఈ చైత్య (గుడి ఆకారంలో ఉండే) ప్రాసాదం జోలికి పోలేదు. ఇపుడు దీన్ని పడగొడతాను – అనుకున్నాడు వాయుపుత్రుడు. తోరణం నుంచి దూకాడు. ప్రాసాదం పైకి ఎక్కాడు. మరోసారి భుజాస్ఫాలనం చేశాడు. ఆ శబ్దం లంకంతా మారోమ్రోగినట్లయింది. పక్షులు కిందపడ్డాయి. చైత్య రక్షకులు మూర్ఛపోయారు. కాసేపటికి తేరుకున్నారు. హనుమంతుని చుట్టూ కమ్ముకున్నారు. గదలతో మోదారు. బాణాలు వేశారు. నొప్పించారు. క్రుద్ధుడైనాడు మారుతి. భయంకర రూపం దాల్చాడు. ఆ ప్రాసాదానికి ఉన్న బంగారు స్తంభం పెకలించాడు. దాన్ని గిరగిరా తిప్పాడు. దాంతో అగ్నిపుట్టింది. భగభగ మంటలు లేచాయి. ప్రాసాదాన్ని కాల్చేశాడు.

బంగారు స్తంభంతో రాక్షసుల్ని కొట్టాడు. వందమంది చచ్చారు. ఆకాశంలో నిలిచి అంటున్నాడు. ''సుగ్రీవాజ్ఞ అయింది. వానరులు వేలమంది భూమండలమంతా తిరుగుతున్నారు. ఆ వానరుల్లో ఒక్కొక్కడూ పది ఏనుగుల బలం కలవారు ఉన్నారు. కొందరు నూరు ఏనుగుల బలం కలవాళ్ళు, కొందరు వేయి ఏనుగుల బలం కలవాళ్ళు ఉన్నారు. కొందరు వాయుదేవుడిలా వేగవంతులు. కొందరి బలం ఇంత అని చెప్పనలవి కానిది. కోరలు, గోళ్ళు వారి ఆయుధాలు. వందలు వేలు లక్షలు కోట్ల కొద్దీ వానరులున్నారు. వాళ్ళతో వస్తాడు సుగ్రీవుడు. మిమ్మల్ని చంపేస్తాడు. ఒక్కడూ మిగలడు. రామునితో వైరం పెట్టుకున్నాడు మీ రాజు. మీరు ఉండరు, లంక ఉండదు, రావణుడు ఉండడు.

**(సశేషం)**

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

## 360. శచీశాభీష్టదాయకాయ నమః

–శచీపతి యగు ఇంద్రుని కోర్కెలు తీర్చువాడు కృష్ణుడు.

శచి పులోముని కూతురు. ఇంద్రుని భార్య.

నరకాసురుడు దేవతలను బాధించుచుండగా ఇంద్రుడు కృష్ణుని శరణు వేడగా అతడు సత్యభామా సమేతుడై నరకాసురునితో యుద్ధము చేసి అతనిని సంహరించినాడు.

ఇట్లు కృష్ణుడు ఇంద్రుని కోరికలను తీర్చినాడు.

ఇంద్రుని అభీష్టములను తీర్చిన (నెరవేర్చిన) కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 361. సత్రాజిన్మానసోల్లాసినే నమః

సత్రాజిత్తు (సత్యభామ తండ్రి) కోల్పోయిన శమంతకమణిని కృష్ణుడు జాంబవంతుని జయించి మణిని తెచ్చి సత్రాజిత్తుకు ఇచ్చి అతనికి సంతోషము కల్గించినాడు. శమంతకమణి సమగ్ర వృత్తాంతమునకై 351 మణ్యహర్తా నమః అను నామము యొక్క వివరణము పరిశీలించండి.

సత్రాజిత్తుకు శమంతకమణిని తెచ్చి యిచ్చి అతనికి మానసోల్లాసము కల్గించిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 362. సత్యా జానయే నమః

సత్యభామను భార్యగా గలవాడు కృష్ణుడు. అష్టమహిషులలో సత్యభామ మూడవది.

అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్య జాయ అనబడును. వృత్తి యందు జాయా శబ్దమునకు ఆదేశముగా వచ్చిన రూపము జాని. రామునకు జానకీజాని అను పేరు కలదు.

సత్యభామ జాయగా కలవాడగు కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.


## 363. శుభావహాయ నమః

శుభములను కలిగించువాడు కృష్ణుడు.

కృష్ణుడు అతి కుంభవృష్టిచే బాధపడుచున్న గోవులను, గోపకులను గోవర్ధన పర్వతము పైకెత్తి గో గోపకులకు రక్షణ కల్గించినాడు.

కాళియ సర్ప నివాసము వలన యమునా జలములు విషమయములు కాగా కాళియుని మర్దించి వానిని యమున నుండి సముద్రమునకు పంపి యమునా జలములు స్వచ్ఛముగా, పానీయార్హముగా చేసి గో గోపకుల దప్పికను

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**



అన్ని నామాలూ నీవే అయిన
ఓ వేంకటేశా! నీకు నమస్కారము

తీర్చినవాడు కృష్ణుడు.

నరకాసురుని వధించి, అతడు చెరసాలలో బంధించిన పదారు వేల కన్యలకు బంధ విముక్తి అనుగ్రహించి వారిని ద్వారకకు తీసుకొని వచ్చి, ఆ రాజ కన్యలను కులీనులైన యువకులు ఎవ్వరూ వివాహమాడుటకు ఇష్టపడనందున అనాథలయిన వారందరినీ తాను వివాహమాడి ఆ రాజ కన్యలకు సమాజమున సముచిత గౌరవము కల్గించి వారికి శుభములు చేకూర్చినాడు. కృష్ణుడు గొప్ప సంఘసంస్కర్త.

కృష్ణుడు కంసుని వధించి బందీలైన ఉగ్రసేనుని, దేవకీ వసుదేవులను బంధ విముక్తులను చేసి వారికి శుభము చేకూర్చినాడు. అందరికీ శుభావహుడయిన కృష్ణునిగా జన్మించిన విష్ణుమూర్తి అర్చావతార మూర్తియగు వేంకటేశునకు నమస్కారము. వేంకటేశ్వరస్వామి భక్తులకు చేకూర్చిన శుభముల గురించి బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులు ఇట్లు చెప్పుకునేవారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఢిల్లీ, కటకం, కళ్యాణ నగరముల నుండి వచ్చిన భక్త జనులు "గ్రుడ్డి వానికి చూపునిచ్చావు, గొడ్రాలికి బిడ్డనిచ్చావు, కుంటివానికి నడకనిచ్చావు, చెవిటివానికి వినుకలినిచ్చావు" అని వేంకటేశుడు భక్తులకు ఒసంగిన శుభముల గూర్చి కొనియాడుతుంటారని క్రీ.శ. 16వ శతాబ్దం వాడైన కాకుమాని మూర్తి కవి తన రాజవాహన విజయము అను ప్రబంధములో వర్ణించినాడు.

భక్త జనులకు శుభావహుడయిన వేంకటేశునకు నమస్కారము.

## 364. శతధన్వ హరాయ నమః

శతధన్వుడు యాదవరాజు అగు హృదికుని కుమారుడు. సత్రాజిత్తు తన కుమార్తె యగు సత్యభామను తనకిచ్చి వివాహము చేయుదునని వాగ్దానము చేసి, శమంతకమణి తెచ్చి ఇచ్చిన కృష్ణునికి సత్యభామను ఇచ్చి వివాహము చేసినాడని కోపించిన శతధన్వుడు శమంతకమణి మీద ఆశతో నిద్రించి యున్న సత్రాజిత్తును చంపినాడు. శమంతకమణిని అపహరించి తీసుకొని వెళ్ళినాడు.


ఈ సంగతి తెలిసిన కృష్ణుడు సత్యభామకు ప్రీతి కల్గించుటకై శతధన్వుని చంపినాడు. కాని అతనివద్ద శమంతకమణి కృష్ణునికి లభించలేదు. శతధన్వుడు శమంతకమణిని అక్రూరుని వద్ద దాచి మిథిలా నగరమునకు వెళ్ళినాడు.

శతధన్వుడు సత్రాజిత్తును చంపినందులకు ప్రతిగా కృష్ణుడు శతధన్వుని చంపి సత్యభామకు సంతోషము కల్గించినాడు.

శతధన్వుని సంహరించిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

# గురు సాక్షాత్ పరబ్రహ్మ

- శ్రీమతి వెలమకన్ని పద్మావతి



పూర్వకాలంలో వేదధర్ముడు అనే సర్వశాస్త్ర కోవిదుడు వుండేవాడు. ప్రత్యేకంగా జ్యోతిష శాస్త్రంలో ఉద్దండ పండితుడు. ఈయన గురుకులంలో వేల సంఖ్యలో శిష్యులు విద్యలు నేర్చుకొనేవారు. రాజవంశాలకు చెందిన బాలురు, సామాన్య కుటుంబాలలోని బాలురు కూడా ఈ గురుకులంలో విద్యలు నేర్చుకుంటూ, గురు శుశ్రూష చేసుకొనేవారు. వేదధర్ముని శిష్యులలో ఒకడైన కౌత్సుడు అత్యంత ప్రతిభావంతుడు. ఏకసంథాగ్రాహి. కాలం వృధా చేయకుండా అత్యంత భక్తి శ్రద్ధలతో విద్యలు నేర్చుకుంటూ గురువుగారికి వినయ విధేయతలతో సేవలు చేసుకుంటూ కౌత్సుడు గురువు గారికి అత్యంత ప్రియ శిష్యుడిగా స్థానం సంపాదించాడు.

శిష్యులందరికీ విద్యాభ్యాసం పూర్తి కావచ్చింది. వేదధర్ముడు కార్యార్థియై, గ్రామాంతరము వెళ్తూ ఆశ్రమ నిర్వహణ బాధ్యతను కౌత్సునికి అప్పగించాడు. గ్రామాంతరం వెళ్ళిన గురువుగారు తిరిగి వచ్చి, ఆ మూడు రోజులు కౌత్సుడు ఆశ్రమాన్ని నిర్వహించిన తీరుకి చాలా సంతోషించి బహుధా ప్రశంసించాడు. విద్యలు పూర్తి చేసుకున్న విద్యార్థులంతా వారి వారి ఇళ్ళకి సంతోషంగా వెళ్ళిపోయారు. కాని కౌత్సుడు మాత్రం గురువుగారిని వదిలి వెళ్ళడానికి ఇష్టపడలేదు. కారణం చెప్పమన్నారు గురువుగారు. ''మీరు పొరుగూరు వెళ్ళినప్పుడు నా జ్యోతిష్య శాస్త్ర పరిజ్ఞానాన్ని ఉపయోగించి, మీ జాతకాన్ని, మీ అనుమతి లేకుండా పరిశీలించాను. త్వరలో మీకు కుష్టువ్యాధి సోకబోతున్నట్లు నాకు అర్థమయింది. నాకు వాసం – గ్రాసం ఇచ్చి, విద్యలు నేర్పి జ్ఞానాన్ని ప్రసాదించిన మిమ్మల్ని ఈ కష్ట సమయంలో విడిచి వెళ్ళను. మీకు శుశ్రూషలు చేసి మీరు పూర్తిగా కోలుకున్న తర్వాతే నేను మిమ్మల్ని విడిచి వెళతాను'' అంటూ గురువు గారి పాదాలు పట్టుకొని రోదించాడు కౌత్సుడు. ''ప్రారబ్ధాన్ని ఎంతటివారైనా అనుభవించవల్సిందే'' అంటూ గురువుగారు మౌనంగా ఉండిపోయారు. పూజలు, జపాలు, యాగాలు భక్తి శ్రద్ధలతో చేశాడు కౌత్సుడు. కానీ గురువుగారు రోగం బారినుంచి తప్పించుకోలేక పోయారు. ''కాశీలో ఏ పుణ్యకార్యం ఆచరించినా రెట్టింపు ఫలితం వస్తుంది కాబట్టి, మనం కాశీ వెళ్ళిపోయి అక్కడ జపాలు, హోమాలు చేద్దాం. మీరు త్వరగా రోగవిముక్తులు అవుతారు'' అంటూ కౌత్సుడు గురువుగారిని తీసుకుని కాశీకి వచ్చాడు. కాశీలో నివాసం ఉంటూ, మధ్యాహ్నం భిక్షాటన చేసి ఇద్దరికీ ఆహారం సమకూర్చేవాడు. ఉదయం పూట జపాలు, తపాలు, హోమాలు చేస్తూ, గురువుగారికి ఆరోగ్యం చేకూరాలని భగవంతుడిని ప్రార్థించేవాడు. గురువుగారికి సకల సేవలు చేస్తూ కంటికి రెప్పలా కాపాడుకొనేవాడు. ఒక్కొక్కసారి గురువుగారు తాను అన్నం తినక, శిష్యుడు కూడా తినకుండా భిక్షాటన చేసి తెచ్చిన అన్నాన్ని విసిరికొట్టి నేలపాలు చేసేవారు. కారణం లేకుండానే శిష్యునిపై కోపం ప్రదర్శించేవారు. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే గురువుగారు వ్యాధి బాధతో ఇలా ప్రవర్తిస్తున్నారని అర్థం చేసుకున్న కౌత్సుడు ఓర్పుతో మెలుగుతూ అవిశ్రాంతంగా గురు శుశ్రూష చేసేవాడు. త్రిమూర్తులైన బ్రహ్మ–విష్ణు–మహేశ్వరులు కౌత్సుని గురుభక్తిని పరీక్షించాలనుకున్నారు.

ముందుగా బ్రహ్మ మారువేషంలో వచ్చి ''నేను గమనిస్తున్నాను. నిన్ను ఇంతలా బాధిస్తున్న ఈ గురువుని వదిలేసి వెళ్ళిపో! నేను పెద్దవాడిగా చెప్తున్నా'' అన్నాడు కౌత్సుడితో. ''ఈ స్థితిలో ఉన్న గురువుగారిని వదిలి వెళ్ళమని చెప్పే మీరు పెద్దవారు ఎలా అవుతారు? వయసులో పెద్ద అయినా మీరు మనసులో – బుద్ధిలో నా కంటే చిన్న వారిలా మాట్లాడుతున్నారు'' అన్న కౌత్సుడి సమాధానానికి బదులు చెప్పలేక బ్రహ్మ అక్కడినుంచి వెళ్ళిపోయాడు. తరువాత విష్ణువు మారువేషంలో వచ్చాడు. గురువుగారికి ఇంత ప్రేమగా భక్తి శ్రద్ధలతో సేవలు చేస్తున్నందుకు కౌత్సుడిని అభినందించాడు. ప్రతిగా గురువుగారు పెట్టే హింసను ఖండిస్తూ, ఇలాంటి వాడికి సేవ చేస్తే నీకు పుణ్యం రాదు. పాపం వస్తుంది. కాబట్టి నువ్వు గురువుని వదిలి వెళ్ళిపొమ్మని ఉపదేశించాడు. ''ఇప్పుడు మా గురువుగారు వ్యాధి బాధలో సరిగా ప్రవర్తించకపోయి ఉండవచ్చు. కానీ గతంలో నన్ను ఆదరించి, అన్నం పెట్టి విద్యాబుద్ధులు నేర్పించిన గురువును ఈ స్థితిలో వదిలి వెళ్ళి కృతఘ్నుడిగా జీవించలేను'' అంటూ కౌత్సుడు వాడిగా సమాధానం చెప్పాడు. విష్ణువు మౌనంగా వెళ్ళిపోయాడు.

ఇక శివుడు మారు వేషంలో వచ్చాడు. ''నువ్వు ఎండనక వాన అనక భిక్షాటన చేసి తెచ్చిన అన్నాన్ని ఇంగితం లేకుండా విసిరికొడుతూ తాను తినక, నిన్ను తిననీయక హింస పెట్టే ఈ గురువును వదిలి వెళ్ళిపో! కనీసం కొన్నాళ్ళయినా వెళ్ళు. అప్పుడు

నీ విలువ నీ గురువుగారికి తెలిసి వస్తుంది'' అన్నాడు. ''మీ కంటే ముందు ఇద్దరు పెద్దవాళ్ళు వచ్చి మీలాగే నాకు చెప్పారు. అన్నం పెట్టి ఆశ్రయం ఇచ్చి విద్యాబుద్ధులు నేర్పించిన గురువు గారి వల్ల ఎన్ని బాధలైనా పడడానికి నేను సిద్ధమే! చివరికి పస్తులుండడానికి కూడా నాకు సమ్మతమే. మీ తర్వాత మీ లాంటివారు ఇంక ఎవరూ రాకుండా మా ఇంటిముందు కాపలాగా వుండండి. నేను మాత్రం నా గురువును వదిలిపోను'' అంటూ రెండు చేతులూ జోడించాడు కౌత్సుడు.

త్రిమూర్తులు తమ నిజస్వరూపాలలో ప్రత్యక్షమయ్యారు. ''నీ గురుభక్తిని పరీక్షింపదలచి మేము వచ్చాము. నీవే గెలిచావు. నీకు మోక్షాన్ని ప్రసాదిస్తున్నాం'' అన్నారు త్రిమూర్తులు.

''మీ దర్శనం కూడా నాకు మా గురువుగారి వల్లనే అయింది. నా దృష్టిలో గురువే బ్రహ్మ! గురువే విష్ణువు! గురువే మహేశ్వరుడు! మీ ముగ్గురినీ సృష్టించిన పరబ్రహ్మని కూడా నేను గురువులోనే చూస్తాను. నాకు మోక్షం ప్రసాదించండి అంటూ ఈ క్రింది శ్లోకాన్ని చెప్పాడు.

**"గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః**
**గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః"**

ఆనాటి నుండి ఈ శ్లోకం లోకంలో బహు ప్రసిద్ధి పొందింది. వేదధర్ముడు త్రిమూర్తుల అనుగ్రహంతో మోక్షం పొందాడు.

# గురువు గొప్పదనం

**– మందరపు వి.జి శంకరాచారి**

గురువు అంటే గురి.

ఒక దిశవైపు శిష్యులను నడిపించేవాడు. విద్య కోసం తన దగ్గరకు వచ్చిన శిష్యులందరికీ పక్షపాతరహితంగా విద్యాబోధన చేసేవాడు. ఈవిధంగా విద్యార్థులలో జ్ఞానం నింపుతున్న గురువులు ఐదు రకములుగా ఉంటారని శాస్త్రం చెబుతోంది.

అధ్యాపకుడిగా విద్యాబోధను ప్రారంభించే వ్యక్తి చిట్టచివరిది మరియు అయిదవది అయిన 'గురువు'గా రూపాంతరం చెందడానికి ప్రయత్నించాలని అంటోంది శాస్త్రం.

అధ్యాపకుడైన వాడు పుస్తకాలలో నిండియున్న సమాచారాన్ని మాత్రమే విద్యార్థులకు తెలియపరచుతాడు. ఉపాధ్యాయుడు మాత్రం తన శిష్యులకు విలువలతో కూడియున్న విద్యను అందిస్తాడు. ఆచార్యుడు మాత్రం తాను ఏ రంగంలో నిష్ణాతుడో, అదే రంగంలో తన శిష్యుణ్ణి కూడా నిష్ణాతుడిగా తయారు చేయడానికి ప్రయత్నిస్తాడు. (మహాభారతంలో ద్రోణుడు విలువిద్యలో శిష్యుడైన అర్జునుణ్ణి గొప్ప ధనుర్విద్యా నిపుణుడిగా తయారు చేస్తాడు).

ఒకానొక విషయంలో పూర్తి పరిజ్ఞానం కలిగిన వ్యక్తిని పండితుడిగా చెబుతుంది శాస్త్రం. అందుకే దేవతల గురువైన బృహస్పతి తన కుమారుడైన కచుడిని రాక్షస గురువైన శుక్రాచార్యుల వద్దకు వెళ్ళి విద్య నేర్చుకోమని పంపిస్తాడు. కారణం... సకల విద్యలలో ఆరితేరిన శుక్రాచార్యుడిని మహాపండితునిగా గుర్తించాడు కనుక. కచుడి యొక్క వినయ విధేయతలను చూచి విరోధి కుమారుడైనా సరే... శిష్యునిగా స్వీకరిస్తాడు శుక్రాచార్యుడు. అదే గురువు గొప్పతనమంటే.

అధ్యాపక వృత్తిలో ఇక చివరిది గురువు.

ఈ గురు స్థానాన్ని పొందిన వ్యక్తి తప్పనిసరిగా... తన శిష్యులతో పాటు సమాజాన్ని మార్చేందుకు కృషి చేసినవాడై యుండాలి. చీకటి నుండి వెలుగుకి, అజ్ఞానం నుండి జ్ఞానం వైపు నడిపించడమే గురువు యొక్క ప్రధానోద్దేశ్యం.

గురుస్థానాన్ని, స్థాయిని పొందినవాడు పక్షపాత రహితంగా శిష్యులకు జ్ఞానబోధ చేయాలి. స్వార్థ ప్రయోజనాలను ఆశించి జ్ఞానబోధ చేసేవాడు గురువుగా గుర్తింపబడడు. గురువన్నవాడు సమాజాన్ని ప్రభావితం చేయాలి. ప్రక్కదారిలోను, పెడదారిలోను నడుస్తున్న బాటసారులను సరియైన మార్గంలో నడిపించి, చివరికి తాము చేరుకోవలసిన గమ్యమేమిటో తెలియచెప్పేవాడే అసలు సిసలైన గురువు.

భ్రష్టు పట్టిన సమాజంలో ఆధ్యాత్మిక విలువలను పెంపొందించడానికి పాటుపడేవాడే గురువు. ఈ ప్రహసనంలో భగవంతుడి గురించి తెలియచేస్తూ, ఎవరిని నమ్మితే మనలో నిండియున్న దుఃఖం పునరావృత్తి కాదో తెలియచెప్పేవాడే గురువు. ఈ దుఃఖానికి పుట్టుక ఉండకూడదంటే భగవంతుడి చరణాలే శరణమని బోధ చేసినవాడే గురువు.

ఆదిశంకరాచార్యులవారు భగవంతుడి గురించి తెలియజేస్తూ, ఆ పరమాత్మ మన గుండె గుడిలోనే కొలువై యున్నాడని, జీవాత్మకు, పరమాత్మకు భేదం లేదని, అది అద్వైతమని తేల్చి చెప్పారు. ఈ జ్ఞానాన్ని శిష్యుల ద్వారా పరంపరగా సమాజంలోని ప్రజలకు అందజేయాలన్న ఉద్దేశంతో భారతదేశం నాలుగు దిక్కులా నాలుగు పీఠాలను స్థాపించారు (జ్యోతిపీఠం, శారదాపీఠం, గోవర్ధనపీఠం, శృంగేరీపీఠం). అంధకారంతో నిండియున్న ప్రజలలో చైతన్యాన్ని నింపి, ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయించారు. అందుకే ఆయన విశ్వగురువుగా వినుతికెక్కారు.

ఇక భగవద్రామానుజాచార్యులవారు తన గురువుగారైన యామునాచార్యుల వారి నుండి గ్రహించిన 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరీ మంత్రాన్ని, తను నరకానికి వెళ్ళినా ఫరవాలేదు... సమాజంలోని ప్రజలు భగవంతుడి చరణాలను నమ్ముకుని స్వర్గానికి వెళితే చాలు అని భావించి అష్టాక్షరీ మంత్రాన్ని విశ్వవ్యాపితం చేశారు. ఈవిధంగా గురువన్నవాడు సమాజ శ్రేయస్సు కొరకు పాటుపడాలి. ఆ విధంగా పాటుపడినవాడే విశిష్ట గురువుగా వినుతికెక్కుతాడు.

గురువు గొప్పదనం బయటపడేది అతడి స్వార్థరహిత ప్రవర్తన నుండియే కాబట్టి ఎవరైతే నిస్వార్థంగా విద్యాబోధ, జ్ఞానబోధ చేస్తారో వారే సమాజమునకు వెలుగును ప్రసరింపచేసే కోటి సూర్యుల కాంతి.

# మంగళగౌరీ వ్రతం

**- డాక్టర్ దేవులపల్లి పద్మజ**

**సర్వమంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధికే!**
**శరణ్యే త్ర్యంబకే గౌరీ నారాయణి నమోస్తుతే!!**

హైందవ సంప్రదాయంలో శ్రావణం విశేషమైన మాసం. హిందూ వివాహానంతరం మహిళలు సౌభాగ్యం, సంసార సౌఖ్యం, ఉత్తమ సంతానం కొరకు శ్రావణమాసంలో వచ్చే మంగళవార వ్రతం చేపడతారు. భర్తకి ఆయురారోగ్యాలను ప్రసాదించమని కోరుకుంటూ పంచవర్ష మంగళగౌరీవ్రతాన్ని ప్రారంభించి వరుసగా ఐదు సంవత్సరాలు ఈ వ్రతం ఆచరించి, ఉద్యాపన చేసుకొంటారు.

ఈ శ్రావణ మంగ ళవార నోమును పెళ్ళైన స్త్రీలు మొదటిసంవత్సరం పుట్టింటగాని అత్తింటగాని విడిగా ఉన్నా కూడా చేసుకొనవచ్చు. తల్లి ఆధ్వర్యంలో జరిపించుకోవడం చెప్పదగిన సూచన. అందుబాటులో లేనట్లయితే ఆ నోము వివరాలను, విశేషాలను అనుభవజ్ఞులైన పెద్ద ముత్తైదువుల సమక్షంలో చేసుకొని అవగాహన పొందవచ్చు. ముందురోజు అనగా సోమవారం శుచియై శనగలను వినాయకుని తలుచుకుంటూ నీటిలో నానబెట్టాలి. సోమవారం రాత్రి ఫలహారం చేయాలి. తమలపాకులు, వక్కలు, అరటిపండ్లు వగైరా ఏర్పాటు చేసుకోవాలి. బియ్యపుపిండి రెడీ చేసుకోవాలి. పూజా విధానం, మంగళగౌరి వ్రతం కథ అష్టోత్తర నామాలతో, అలాగే తోరగ్రంథి పూజ మొదలైన వివరాలతో ఉన్న పుస్తకం అందుబాటు లో ఉంచుకోవాలి.

వ్రతాన్ని ఆచరించే మహిళలు మంగళవారం ఉదయమే తలంటుకుని, శుచియైన వస్త్రధారణతో, కుంకుమ, కాటుక, కాళ్ళకు పారాణి అలంకరించుకుని, మంగళగౌరిని పూజకు సిద్ధం చేసుకునే స్థలంలో ఆవుపేడతో, కుదరక పోతే పసుపుచేతితో అలికి, నోము పట్టిన సంవత్సరం ఐదు, రెండవ సంవత్సరం పది ఇలా పెంచుకుంటూ ఐదవ సంవత్సరం ఇరవై ఐదు బియ్యం పిండితో పద్మాల ముగ్గులు వేసుకోవాలి. చిన్న చిన్నవి సంఖ్యలో చూసుకుని వేసుకోవాలి. వాటిపై పీఠం వేసి, గౌరీదేవిని ఇత్తడి, రాగి, వెండి లేదా పెళ్లికి ముందుగా పూజచేసిన గౌరీదేవిని స్థాపన చేయాలి. ఈ గౌరీ దేవిని తనతోపాటే వివాహానంతరం తెచ్చుకునే సంప్రదాయం ఉంటుంది. ప్రతీవారం ఇలాగే ఈ గౌరికే చేయాలి.

బెల్లం, బియ్యపు పిండిని ఆవునేయితో కలిపి, జ్యోతులు వెలిగించుటకు వీలుగా కుందిలాగ పైన ముగ్గుల సంఖ్య



మాదిరి ఐదు, పది, పదిహేను, ఇరవై, ఇరవై ఐదు ఇలా క్రమంగా పెంచుకుంటూ తయారు చేసుకుని ఆవునేయితో దీపాలు సిద్ధం చేసుకోవాలి.

**శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం !**
**ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే!!**

వినాయక స్తుతి చేసి, '"దీపం జ్యోతి పరం బ్రహ్మ దీపం సర్వతమోపహం– దీపేన సాధ్యతే సర్వం దీపదేవ నమోస్తుతే" అంటూ దీపం ఒకటి రెండువత్తుల దీపం ముందు వెలిగించాలి.

పసుపు గణపతిగాని, గణపతి విగ్రహంగాని ఇత్తడి

పళ్ళెంలో బియ్యం పోసి మధ్యలో విగ్రహం ఉంచి ముందుగా షోడశనామాలతో గణపతిని అర్చించి గౌరీవ్రతం తలపెట్టాను, విజయవంతంగా ఐదు సంవత్సరాలు పూర్తిచేసి, ఉద్యాపన చేయించి గౌరీదేవి అనుగ్రహం పొందేలా ఆశీర్వదించమని వేడుకుంటూ పూజచేయాలి. ఆదిదేవుని అనుజ్ఞ తో గౌరీదేవిని తమ గోత్ర నామాలతో సంకల్పం చెప్పుకుని షోడశోపచారాలతో మంగళగౌరిని ప్రసన్నం చేసుకుని అష్టోత్తర శతనామ పూజ కుంకుమ, పసుపు, పూవులతో పూజ జరిపించి, బియ్యం, కందిపప్పు, జీలకర్ర, మిరియాలు తో తయారుచేసిన పొంగలి, పాయసం, కొబ్బరి, అరటిపండ్లు, నైవేద్యం చేయాలి. తొమ్మిది పోగులు దారానికి పసుపురాసి, తొమ్మిది పూవుల ముడులతో మూడు తోరాలు కట్టి, ఒకటి గౌరీదేవికి, ఒకటి బుట్టవాయినం సెనగలపై, ఒకటి నోము నోచిన మహిళ తోర గ్రంథి పూజ చేసి, సిద్ధం చేసుకున్న సెనగలు, తాంబూలం గౌరీదేవికి ప్రథమ వాయనం ఇవ్వాలి. అపుడు ''ఎవరమ్మా నాచేతి వాయనం అందుకున్నది అంటే'' అమ్మ పలికినట్టుగానే మనమే ''నేనమ్మా! మంగళగౌరీదేవిని'' అని మూడుసార్లు చెప్పి ఇవ్వాలి. ఆ వాయనంపై తోరం తప్పనిసరి. తరువాత సిద్ధంచేసుకున్న జ్యోతులు వెలిగించి, ఇత్తడి గరిటెకి ఆవునేయి రాసి, వ్రత కథ చదువుతూ, కుడిచేతితో దీపాలపై గరిటె ఉంచి, జ్యోతుల నుంచి వచ్చే కాటుక గరిటెపై పట్టుకోవాలి. ఆ కాటుక ఎంత ఎక్కువ వచ్చేలా నేర్పుగా పట్టుకుని సంపాదించుకుంటే అంత మంచిది.

కథ చదివేటపుడు అక్షింతలు చేతపట్టుకొని, గరిటె జ్యోతులపై పట్టుకుని, కథ పూర్తికాగానే గౌరీదేవిపై అక్షింతలు పాదాలవద్ద ఉంచి , కొన్ని వ్రతం చేసిన మహిళ తలపై వేసుకోవాలి. మంగళగౌరికి హారతి ఇచ్చి, అపుడు బుట్టవాయనం, తాంబూలం సెనగలను ముందు బుట్టతో తల్లికి కానీ, మరెవరైనా పెద్ద ముత్తైదువుకు గాని అందించి వారిచేత పైన అమ్మ వారికి వాయనం ఇచ్చేటపుడు చెప్పినట్టు చెప్పి, వారు నేనమ్మా! గౌరీదేవిని నీచేతి వాయనం అందుకున్నది అనిపించి, వ్రతం పట్టిన మహిళ అడిగితిని వరం అంటే, ఇచ్చితిని వరం నేనమ్మా గౌరీదేవిని అని ఆశీర్వదించి అక్షతలు వేస్తారు. ఆ గౌరీదేవికి పాదాభివందనం చేయాలి. అనంతరం –

**"అనయా ధ్యానావానాది షోడశోపచార పూజయాన్**
**భగవతీ సర్వాత్మకే శ్రీ మహాగౌరీ సుప్రీతా సుప్రసన్నా వరదా భవంతు"**

అని అక్షింతలు నీరు పళ్ళెంలో విడువవలెను.

ఆ బుట్ట ఇచ్చిన వాయనంలోని సెనగలతో ఐదు, పది, ఇలా క్రమం పెంచుకుంటూ వాయనం తాంబూలాలు ఇవ్వాలి. నిరాహారంగా ఇస్తే మంచిదే. లేకపోయిన వీలును బట్టి భోజనం చేసి సాయంత్రం సమయంలో ముత్తైదువులను పేరంటం పిలిచి వారికి పసుపు, కుంకుమ, గంధం సెనగలు తాంబూలం, పూజలో పట్టిన కాటుక ఇచ్చి వారి ఆశీస్సులు తీసుకోవాలి.

పూజా విధానం పుస్తకంలో విధి విధానాలు, మన ఇంటి ఆచారాలను బట్టి అనుసరించి చేయాలి. కొంతమందికి ఐదు సంవత్సరాల కాలం కూడా ఐదు వాయినాలే. కానీ నూటికి ఎనభైశాతం సంవత్సరం సంవత్సరం పెరుగుతూ చివర ఏడాది ఇరవై ఐదు ఇవ్వాలి. ఏదైనా ఒకవారం కుదరకపోతే రెట్టింపు సంఖ్యతో మరుసటి వారం బాకీలు తీర్చుకోవాలి.

వ్రతం ఐదు సంవత్సరాలు పూర్తి చేసాక ఉద్యాపన చేయాలి. కొత్త పెళ్ళికూతురికి పెళ్ళి మండపంలోనే ఇత్తడి గిన్నెలో ఆవునేతితో చేసిన పాతిక అరిసెలు కొత్త చీరతో వాసిని కట్టి, బంగారు పుస్తెలు, మెట్టెలు, నల్లపూసలు, పసుపు కుంకుమ తాంబూలంతో బొట్టుపెట్టి, కొంగులో ఈ అరిసెల వాయనం అందజేయాలి. వ్రతం చెడినా, ఫలం దక్కాలని సామెత. పూజలో లోపం అయినా మంగళగౌరీ నీ అనుగ్రహంలో లోపం ఉండకూడదని వేడుకోవాలి.

**సర్వం శ్రీ మంగళగౌరీ దేవీం సమర్పయామి**
**శుభం భూయాత్**


# జపము వ్రాసే భక్తులకు మనవి

శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం ఆధ్వర్యంలో తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి 23వ పర్యాయంగా 7 కోట్ల జపమును వ్రాసే భక్తులకు మనవి. మీరు వ్రాసే ఈ జపమును తేది 25.07.2025 వరకు మా పీఠం అడ్రస్‌కు అందేలా పంపగలరని మనవి.

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

**1-1-53, వీధినం. 1, హబ్సీగూడ, హైదరాబాద్-500007. ఫోన్: 040-27175050**

# ముకుందమాల

- డా|| భువనేశ్వరి మారేపల్లి, 9550241921

ధారావాహికం



కులశేఖర ఆళ్వారుల ముకుందమాలలోని ఒక సార్వ విభక్తిక పద్యము.

**కృష్ణో రక్షతు నో జగత్త్రయగురుః కృష్ణం నమస్యా మ్యహం**
**కృష్ణే నామరశత్రవో వినిహతాః కృష్ణాయ తస్మై నమః ।**
**కృష్ణాదేవ సముత్థితం జగదిదం కృష్ణస్య దాసోఽస్మ్యహం**
**కృష్ణే తిష్ఠతి సర్వమేతదఖిలం హే కృష్ణ రక్షస్వ మామ్ ॥**

కృష్ణుడు జగత్రయ గురువు. మమ్ములను రక్షించుగాక! కృష్ణుని నేను నమస్కరించు చున్నాను. కృష్ణుని చేత రాక్షసులు చంపబడిరి. కృష్ణుని కొరకు నమస్కరించు చున్నాను. కృష్ణుని నుండి ఈ జగత్తు బయటపడినది. కృష్ణునకు నేను దాసుడను. కృష్ణుని యందే ఈ సర్వజగత్తు నిలిచి యున్నది. ఓ కృష్ణా! నన్ను రక్షింపుము.

ఈ శ్లోకమున విభక్తులన్నిటిలోను – అనగా ప్రథమా విభక్తి మొదలు సప్తమీ విభక్తి వరకును, సంబోధన ప్రథమా విభక్తితో సహా – కృష్ణ శబ్దమును నిర్దేశించి స్తుతించుచున్నారు.

**దీనికి అర్థము:**

కృష్ణో రక్షతు నో జగత్రయ–గురుః – జగత్రయ గురుడైన కృష్ణుడు నన్ను రక్షించు గావుత – ప్రథమా విభక్తి (Nominative case).

- అహం కృష్ణం నమస్యామి – కృష్ణుని నేను నమస్కరించు చున్నాను – ద్వితీయా విభక్తి (Accusative case).
- కృష్ణేన అమరశత్రవో వినిహతాః – కృష్ణునిచే అమరుల శత్రువులు నిర్జించబడిరి – తృతీయా విభక్తి (Instrumental case).
- కృష్ణాయ తస్మై నమః – అందులకై కృష్ణునికి నా ప్రార్థనలు – చతుర్థీ విభక్తి (Dative case).
- కృష్ణాత్ ఏవ సముత్థితం జగదిదం – కృష్ణుని వలన ఈ విశ్వము సృష్టించబడినది – పంచమీ విభక్తి (Ablative case).
- కృష్ణస్య దాసోఽ స్మ్యహం – నేను కృష్ణుని యొక్క దాసుడిని – షష్ఠీ విభక్తి (Possessive case).
- కృష్ణే తిష్ఠతి సర్వమేతదఖిలం – కృష్ణునియందు సర్వ లోకములు గలవు – సప్తమీ విభక్తి (Locative case).
- హే కృష్ణ రక్షస్వ మాం – ఓ కృష్ణుడా! నన్ను రక్షించవా – సంబోధనా ప్రథమా విభక్తి (Denominative case).

మన శరీరానికి అవయవాలు ఎంత అవసరమో, భాషకి విభక్తులు అంతే అవసరం. 'మీ సంపద అపారం' అని అంటే 'మీ యొక్క సంపద' అని అర్థం. కనుక ప్రథమ, ద్వితీయ, తృతీయ... మొదలైన విభక్తులు ఏడు ఉన్నాయి. ఇదే కాకుండా సంబోధనా ప్రథమా విభక్తి అని ఎనిమిదవ విభక్తి కూడా ఉంది. ఈ విభక్తులన్నీ ఒకదాని తరువాత ఒకటి వచ్చే విధంగా కులశేఖరులు శ్రీకృష్ణుణ్ణి కీర్తించిన విధానం అద్భుతం.

**అదెలాగంటే!**

| | |
|---|---|
| ప్రథమా విభక్తి | – కృష్ణుడు రక్షించు గాక |
| ద్వితీయా విభక్తి | – కృష్ణుని సేవించెదను |
| తృతీయా విభక్తి | – కృష్ణుని చేత అసురులు సంహరింపబడిరి |
| చతుర్థీ విభక్తి | – కృష్ణుని కొఱకు నమస్కారము |
| పంచమీ విభక్తి | – కృష్ణుని వలన ఈ జగమంతయు పుట్టినది |
| షష్ఠీ విభక్తి | – కృష్ణునకు నేను దాసుడను |
| సప్తమీ విభక్తి | – కృష్ణుని యందు ఈ జగమంతయు నెలకొని యున్నది |

సంబోధనా ప్రథమా విభక్తి – ఓ కృష్ణా! నన్ను రక్షింపుము

శ్రీకృష్ణుని మహిమను వారి మాతృభాషలలో పాడిన భక్తులు చాలా మంది ఉన్నారు – తమిళంలో 'ఊతుక్కాడు వెంకట సుబ్బయ్యర్', కన్నడలో 'పురందరదాసు', మరాఠీలో 'పందర్‌పూర్ భక్తులు', హిందీలో 'మీరా బాయి' మొదలైనవారు. ఈ భక్తుల పాటలు సంగీతం యొక్క రాగం మరియు తాళాలకు అంత ప్రాముఖ్యతను ఇవ్వవు, అవి అర్థం మరియు దైవిక

భా వోద్వేగాలను ఇస్తాయి. అయినప్పటికీ, చాలా మంది మ హానుభావులు తమ పాటలలో సంగీతం మరియు దైవిక భావోద్వేగాలకు సమాన ప్రాధాన్యత ఇచ్చారు, సాధువు త్యాగరాజ ఒ క ఉదాహరణ. ముత్తుస్వామి దీక్షితార్ మరియు శ్యామశాస్త్రి కూడా అంతే.

జయదేవ్ సంస్కృతంలో 'గీత గోవిందం' (అష్టపది) రచించారు. మరొక గొప్ప సాధువు "శ్రీ నారాయణ తీర్థులు". ఆయన తెలుగు మరియు సంస్కృతంలో కీర్తనలు రచించారు. శ్రీ నారాయణ తీర్థుల యందు కృతజ్ఞతతో తమిళనాడులోని తంజావూరు సమీపంలోని వరాహూరు అనే కుగ్రామంలో కృష్ణ జన్మాష్టమి పండుగను ఘనంగా జరుపుకుంటారు. "కృష్ణ లీలా తరంగిణి" అనే ఆయన రచనలకు నామ సంకీర్తన మరియు సంగీత కచేరీలలో గొప్ప గౌరవం మరియు గుర్తింపు లభించాయి. చిన్న వయసులోనే రచించిన ఈ పాటలు శ్రీకృష్ణుని దివ్య నాటకాలను చిత్రీకరిస్తున్నప్పటికీ, ఇది నిజంగా శ్రీమద్భాగవతం యొక్క సారాంశం అని పండితులు అభిప్రాయపడుతున్నారు.

నారాయణ తీర్థులు (c.1650–1745 CE) 17 వ శతాబ్దమునకు చెందిన ప్రసిద్ధ సంస్కృత రచయిత. "కృష్ణ లీలా తరంగిణి" అను గొప్ప సంస్కృత గేయ నాటకమును రచించిన మహానుభావులు. ఈయన కర్ణాటక సంగీత విద్వాంసులు. కృష్ణ లీలా తరంగిణి అనేది శ్రీ కృష్ణుడి జీవితంలోని సంఘటనలను వివరించే పాటలతో కూడిన ఒక మనోహరమైన రచన. శ్రీమద్భాగవతం ఆధారంగా, ఇది కృష్ణుడు రుక్మిణిల వివాహంతో ముగుస్తుంది. దీనిని సృష్టించిన స్వరకర్త నారాయణ తీర్థులు.



నారాయణతీర్థులు యొక్క అసలు పేరు "గోవింద శాస్త్రి". వీరు తెలుగు స్మార్త బ్రాహ్మణ కుటుంబ మునకు చెందినవారు. ఈయన గుంటూరు జిల్లా కాజ గ్రామములో గంగాధరము, పార్వతమ్మ దంపతులకు జన్మించారు. అతి చిన్న వయసులోనే సంగీతము, సంస్కృతము, శాస్త్రాలు అభ్యసించారు. చిన్న వయసులోనే వివాహము జరిగింది. వీరి పూర్వీకులు తొలుత విజయ నగరంలో నుండిన పండిత వంశీకులు అనియు తరువాత తరలి తంజావూరు చేరినట్లు తెలియుచున్నది.

నారాయణ తీర్థులు చిన్నతనము నుండే పూజలు, భగవన్నామ స్మరణం చేస్తుండేవారు. చిన్నతనము నుండి సంగీత, సాహిత్యములందు కడు ఆసక్తి కలిగి భాగవతము మొదలగు గ్రంథములను పాడుచుండెడివారు. స్వామి శివానందతీర్థ పరిచయ భాగ్యముతో సన్యాసదీక్షా ముఖముగా పయనించారు. నారాయణతీర్థులు సంగీత సంస్కృత భాషాపరిజ్ఞానానికి శివానందతీర్థ మెరుగులు దిద్దారు. భూపతి రాజపురములో స్థిర నివాసమేర్పరచుకొని "శ్రీ కృష్ణ లీలా తరంగిణి" కావ్యము వ్రాశారు. ఒక కావ్యానికి కావలసిన మూడు ప్రధానాంశాలు పద్యము, గద్యము, వచనము కావ్యములో అతి చక్కగా చిత్రీకరించారు. నాట్యానికి కావలసిన జతులు, కృతులు పొందుపరచబడ్డాయి. నృత్య సంగీత నాటకముగా యక్షగాన పద్ధతిలో వ్రాశారు. మేళత్తూరు భాగవతులు ఈ నాటకాన్ని మేళా పద్ధతిలో ప్రదర్శించారు. ఈ రచన భాగవతమందు దశమ స్కందము యొక్క సారాంశం.

నారాయణ తీర్థులు సంగీత కృతులే తరువాత అనేకమంది సంగీత విద్వాంసులకు స్ఫూర్తిదాయకమయ్యాయి. నారాయణ తీర్థుల ప్రభావమువల్లే తాను 'ప్రహ్లాద భక్తి విజయము', 'నావికా చరితము' వ్రాసినట్లు త్యాగరాజు చెప్పుకున్నారు. నారాయణ తీర్థుల శిష్యుడు సిద్ధేంద్రయోగి. కూచిపూడి నృత్య సంప్రదాయానికి ఆద్యుడు.

నారాయణ తీర్థులు గృహస్థాశ్రమము నుండి సన్యాసాశ్రమమును స్వీకరించుటకు ఆయన జీవితములోని ఒక ముఖ్య సంఘటన కారణమైనది. నారాయణతీర్థుని అత్తవారి ఇల్లు నది ఆవలి ఒడ్డున ఉంది. అందుచే నదిని దాటి అత్తవారింటికి వెళ్ళిచుండెడివారు. ఆ విధముగా వెళ్ళు సందర్భమున ఒకసారి మార్గ మధ్యమున నదీ ప్రవాహము హెచ్చుటచే తన జీవితముపై ఆశ వదులుకొని యజ్ఞోపవీతం తీసి పారవేసి సన్యాసాశ్రమమును స్వీకరించెను. అంతలో నదీ ప్రవాహము తగ్గుటచే ఆయన ఆవలి గట్టుకు సురక్షితముగా చేరుకొనెను. తాను సన్యసించుచునట్లు ఇతరులకు తెలియదు కనుక దానిని గుప్తముగా ఉంచదలిచెను. కాని నారాయణ తీర్థుని భార్య ఆయనని చూడగానే ఆమెకు ఒక దివ్య తేజస్సుతో విరజిల్లుతున్న ఒక మహానుభావుని వలె కనిపించెను. అంత దానిని బట్టి అక్కడ వారు ప్రశ్నింపగ నారాయణ తీర్థులు ఆప సన్యాసము స్వీకరించిన విషయము తెలిపెను. అది మొదలు నారాయణ తీర్థులు శాస్త్రోక్తముగా సన్యాసాశ్రమమును స్వీకరించెను. అనంతరము కొన్ని పుణ్య స్థలములను దర్శించి ఆంధ్రప్రదేశ్ లోని చల్లపల్లి ముక్త్యాల సంస్థానములలో కొన్ని సంవత్సరములు గడిపెను. ముత్యాల



సంస్థానములలోని నరసింహ స్వామిపై కొన్ని రచనలు చేసెను.

తన గురువు సూచనను అనుసరించి, నారాయణ తీర్థులు తీర్థయాత్రకు వెళ్ళారు. తిరుపతి వంటి పవిత్ర క్షేత్రాలను సందర్శించిన తర్వాత, ఆయన తమిళనాడులోని కుంభకోణం సమీపంలోని 'గోవింద పురం' వచ్చారు. తన గురువు కోరిక మేరకు, 'శ్రీ బోదేంద్ర స్వామి' దర్శనం చేసుకోవడానికి అక్కడికి వచ్చారు; కానీ దురదృష్టవశాత్తు శ్రీ బోదేంద్ర స్వామి అప్పటికే 'జీవ సమాధి' పొందారు. ఆ తర్వాత ఆయన కావేరి నది ఒడ్డున మరియు చుట్టుపక్కల ఉన్న వివిధ పవిత్ర పట్టణాలను సందర్శించారు.

నారాయణ తీర్థులు జీవితంలో మరియొక ప్రసిద్ధ సంఘటన ఉంది. నారాయణ తీర్థులు చాలా కాలము భరింపరాని కడుపునొప్పితో బాధపడుచుండెను. పుణ్యక్షేత్రములు దర్శించిన బాధ నివారణ అగునని తలంచి అతడు కావేరి అను పల్లెటూరిలో ఒక వినాయకుని గుడిలో విశ్రమించు చుండెను. అంత ఆ రాత్రి భగవంతుడు కలలో కనబడి మరుసటి ఉదయమున రెండు వరాహములు కనబడుననియు, వాని వెనుక బయలుదేరి అవి ఆగిన చోట విశ్రమించిన అతని కడుపునొప్పి పోవుననియు చెప్పెను. మరునాడు ఉదయము నారాయణ తీర్థులు దైవాజ్ఞ ప్రకారం ఆ వరాహముల వెంట అనుసరించగా "భూపతిరాజపురం" అనుచోట "వెంకటరమణస్వామి" దేవాలయము దగ్గర కొన్ని క్షణములు నిలిచి అదృశ్యమయ్యెను. అంత నారాయణ తీర్థులు దేవాలయమున ప్రవేశించినంతనే అతని కడుపు నొప్పి మాయమయ్యెనట.

తన భక్తులను గెలుచుకోవడానికి ప్రభువు అనుసరించే మార్గాలు వింతగా ఉన్నాయి. సుందరమూర్తి నాయనార్‌కు శివుడు బ్రాహ్మణుడిగా కనిపించి ఆలయంలోకి అదృశ్యమైన సంఘటన, తిరునావుక్కరసర్‌తో సంబంధం ఉన్న మరొక సంఘటన, శివుడు అతని కడుపు నొప్పిని నయం చేశాడు మరియు నారాయణ తీర్థ జీవితంలో ఈ సంఘటన, అన్నీ భగవంతుడు నిజంగా దైవిక నాటకాల మాంత్రికుడని చూపిస్తున్నాయి!

నారాయణ తీర్థులు తన మిగిలిన కాలము అచ్చటనే గడిపెను. "కృష్ణ లీలా తరంగిణి" అనునది ఇచ్చటనే రచించెను. అతన్ని అక్కడికి తీసుకువచ్చిన తెల్ల పంది జ్ఞాపకార్థం, ఆ గ్రామానికి వరాహ (పంది) పురి (పట్టణం) అని పేరు పెట్టారు, ఇది తమిళంలో వరాహూర్ అయింది. తరువాత ఆ ఊరునకు "వరాహపూర్" అనియు "వరాహపురం" అనియు పేరు వచ్చెను. నారాయణ తీర్థునకు భరత నాట్యశాస్త్ర మందును కూడా ప్రవేశముండుట వలన ఇచ్చట ఎందరో శిష్యులకు 'పారిజాతాపహరణం' నృత్యనాటకముగా నేర్పెను.

"శ్రీ కృష్ణ లీలా తరంగిణి" అనేది శ్రీ కృష్ణుడి జననం నుండి రుక్మిణితో వివాహం వరకు ఆయన కథను వివరించే రచన. ఇది 12 తరంగాలతో యక్షగాన శైలిలో రచించబడిన ఒక సాహిత్య కళాఖండం, ఇందులో 145 కీర్తనలు, 267 శ్లోకాలు, 30 గద్యాలు (గద్య భాగాలు) మరియు 30 దారు (కథన పాటలు) ఉన్నాయి.

శ్రీకృష్ణ గాథను సంస్కృతములో 12 సర్గలుగా రచించెను. ఈ గ్రంథమునే 'శ్రీకృష్ణ లీలాతరంగిణి' అంటారు. దీనిలో ప్రారంభమున మంగళాచరణము, తరువాత శ్లోకములు, ఇష్టదేవతా ప్రార్థనలు, తరంగములు ఉండును. ఈ తరంగములు పల్లవి అనుపల్లవి చరణములతో స్వనామ ముద్రను కలిగియుండును. కొన్ని తరంగములలో జతులు కూడా ఉండును. కృష్ణలీలా తరంగిణి ముగించిన తరువాత నారాయణ తీర్థులకు రుక్మిణి శ్రీకృష్ణుల దర్శనము కలిగెనని చెప్పుదురు.

నారాయణ తీర్థులు మాఘమాస శుక్ల అష్టమి దినమున తిరువయ్యారుకి 10 కి.మీ. దూరమున తిరుపూడి గ్రామములో జీవసమాధి అయినట్లు నానుడి. వీరి సమాధి వేంకటరమణస్వామి ఆలయమునకు సమీపముననుు, వీరి ఛాయా చిత్రము ఆలయము లోపలను నేటికిని ఉన్నాయి. వరాహపురిలో ప్రతి కృష్ణాష్టమికి శ్రీ కృష్ణలీలా తరంగిణిలోని తరంగములను గానము చేయుదురు. జయదేవుని వలె తన కావ్యమును మధురభక్తి ప్రధానముగా రచించిరి. నారాయణతీర్థులు జయదేవుని అంశ యని ప్రతీతి.

**కృష్ణం కలయ సఖీ సుందరం**
**బాలకృష్ణం కలయ సఖీ సుందరం**
**కృష్ణం గత విషయ తృష్ణం....**

అని 'నారాయణ తీర్థులు' వ్రాశారు. నారాయణ తీర్థుల వారికి దృష్టిదోషం ఉండేది... రోజూ రాత్రిళ్ళు భోజనాలయ్యాక, వసారాలో పడుకుని కళ్ళుమూసుకుని తరంగాలు పాడుకునేవారు. బాలకృష్ణుడొచ్చి, తీర్థులవారి బొజ్జమీదెక్కి,

తాండవం చేసేవాడు. తాండవ కృష్ణుడి నృత్యం రోజూ చూస్తున్న సిద్ధయ్య, ఓ రోజు అడిగాడు. "గురూ గారు రోజూ... బాలకృష్ణుడు మీ బొజ్జమీద తాండవం చేస్తోంటే మీకు పొట్టనొప్పిగా ఉండట్లేదూ?"

**"బాలకృష్ణుడి తాండవమా! ఎప్పుడ్రా..."**

"అయ్యో! రాత్రిళ్ళు, మీరు నిద్రపోయే ముందు తరంగాలు అంటారు గదా! అప్పుడు బాలకృష్ణుడు తాండవం చేస్తాడు. నేను రోజూ చూస్తున్నాగా"!

"ఎంత అదృష్టవంతుడివిరా, గుడ్డిపీనుగుని నాకు కనపడ్డేం!" అని కళ్ళు తుడుచుకుని, "ఒరే! ఈసారి కృష్ణుడు కనబడ్తే మనిద్దరికీ జన్మరాహిత్యం ఎప్పుడో కనుక్కో!"

"ఓ......అలాగే"అన్నాడు సిద్ధయ్య.

మర్నాడు రాత్రి బాలకృష్ణుడు కనపడగానే దణ్ణం పెట్టి "జగద్గురూ! మా గురూగారికీ, నాకూ మోక్షం ఎప్పుడు?" అన్నాడు.

"నీకు ఈ జన్మలోనే... (నా దర్శనం అయ్యిందిగా.....!) మీ గురూగారికి మాత్రం మరో జన్ముంది!" అన్నాడు. మురళి మనోహరంగా మోగింది... అంచేతే సిద్ధేంద్రయోగి... యక్షగానమును ఆంధ్రదేశం అంతటా ప్రదర్శించి, పుణ్యలోకాలకెళ్ళారు. ఆ సిద్ధయ్యే సిద్ధేంద్ర యోగి, ఆ నారాయణ తీర్థులే సిద్ధయ్య గురువు.

కర్ణాటక సంగీత చరిత్రలో నారాయణతీర్థులు స్వయంగా ఒక అజరామర స్థానాన్ని సంపాదించు కున్నాడు.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

# మీ ప్రశ్న - మా సమాధానం

**నిర్వహణ:**
**డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1. బ్రహ్మము, దాని వివిధ రూపములు క్లుప్తంగా వివరించగలరని కోరుచున్నాము – డా|| ఎం.నాగేశ్వరరావు, ముషీరాబాదు.**

జవాబు – మంచి ప్రశ్న. సామాన్యంగా లోకంలో ఎంతకూ అర్థంకాని, బోధపడని దానిని 'అదో బ్రహ్మ పదార్థము' అని అంటారు. బుద్ధి, అహంకారములు చేరి ''నేను'' అనునదే బ్రహ్మమని, బ్రహ్మమనగా పరమాత్మ శక్తియని, సృష్టి స్థితి లయములు చేయు శక్తియే బ్రహ్మమని, విస్తరించుకొనునది బ్రహ్మమని మనం గ్రహించాలి. బ్రహ్మముడి, బ్రహ్మ రాక్షసి, బ్రహ్మ ప్రళయం, బ్రహ్మోత్సవాలు, బ్రహ్మతరం ఇలా బ్రహ్మ శబ్దాన్ని ప్రయోగిస్తే అది ఉత్కృష్టమైనదని, దానిని మించినది లేదని భావము. బ్రహ్మము పరబ్రహ్మ, శబ్దబ్రహ్మ అని రెండు విధాలుగా ఉంటుంది. శబ్ద బ్రహ్మచే పరబ్రహ్మను పొందవచ్చును. బ్రహ్మము అన్ని చరాచరముల లోపల బయటా ఉంటుంది. సత్యం, జ్ఞానం అనేవి బ్రహ్మ లక్షణాలు (సత్యం, జ్ఞాన మనంతం బ్రహ్మ). ఇది నిర్వచనమునకు అతీతమైనది. బ్రహ్మ జ్ఞానముతోనే మోక్షము లభిస్తుంది. అందుకే అన్నమయ్య 'బ్రహ్మ మొక్కటే, పరబ్రహ్మమొక్కటే' అని అన్నాడు. బ్రహ్మ తత్వం తెలిస్తే అన్నీ తెలిసినట్టే. ఓం, తత్, సత్. ఇవి బ్రహ్మ యొక్క నామములు.

**2. గీతలో ఈనాటి యువతరానికి ఉపయోగపడే సూక్తులు వివరించండి - నారాయణ, వారాసిగూడ**

జవాబు – గీతలో అందరికీ ముఖ్యంగా యువతకి ఉపయోగపడే సూక్తులు చాలా ఉన్నాయి.

1. **క్షుద్రం, హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప (అ 2. శ్లో.3)** – మనోబలహీనత, పిరికితనం వదిలిపెట్టు అర్జునా!
2. **గతా సూన గతాం సూశ్చ నాను శోచంతి పండితాః (అ.2 శ్లో11)** – జ్ఞానులు వచ్చే పోయే ప్రాణముల (పోయిన లేదా ఉన్నవారి) గురించి బాధపడరు.
3. **కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచన (అ.2 శ్లో.47)** –పనిని సక్రమంగా, సకాలంలో చేయడమే నీ వంతు. ఫలితం దైవానికే వదులు.
4. **న హి జ్ఞానేన సదృశం (అ 4. శ్లో. 38)** –జ్ఞానానికి సమానమైనది ఏదీ లేదు.
5. **శ్రద్ధావాన్ లభతే జ్ఞానం (అ 4. శ్లో 39)** –శ్రద్ధ, ఏకాగ్రత, పట్టుదల ఉంటేనే జ్ఞానం లభిస్తుంది.
6. **మనో దుర్నిగ్రహం చలం... అభ్యాసేనతు... గృహ్యతే (అ 6. శ్లో.35)** – మనస్సు చంచలం. దానిని నిగ్రహించాలంటే అభ్యాస వైరాగ్యములు సాధనములు.
7. **ఉద్ధరే దాత్మనాత్మానం** –ముందు తనను తాను ఉద్ధరించుకుని ఆపై ఇతరులకు మేలు చేయాలి.
8. **అమానిత్వం, అదంభిత్వమ్ – వినిగ్రహ (అ 13. శ్లో 7)** – నేనే గొప్ప అని భావించకుండా ఉండడం, దాంబికం లేకుండా ఉండడం, క్షమించే గుణం, మనస్సు, మాటలో సరళత్వం మరియు మనస్సు, శరీర ఇంద్రియాలపై నిగ్రహం ఉండాలి.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు.**
**భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**
**– ఎడిటర్, శ్రీవేంకటేశం**

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## మార్కండేయ పురాణాంతర్గతం

శౌనకాది మహర్షులు సూతమహర్షిని సకలశాస్త్రపారంగతా! వేద వేదాంతవేత్తా! శ్రీవేంకటాచల మాహాత్మ్యం గురించి ఇంకా మాకు చెప్పండి అని అడిగారు. అప్పుడు సూతమహర్షి ఇలా చెప్పనారంభించాడు.

పూర్వం మృకండు మహర్షి కుమారుడు మహాదేవుడు, పురుషోత్తముడైన పరమశివుని సేవించి దీర్ఘాయుస్సును పొందాడు. ఆ తరువాత పరమానందంతో తన ఆశ్రమానికి వెళ్ళి తపశ్శాలుల సమక్షంలో తన తల్లిదండ్రులకు సాష్టాంగ నమస్కారం చేశాడు. వారికి జరిగిన వృత్తాంతాన్నంతా చెప్పి, శ్రేయోదాయకమైన కార్యము నొకదానిని చేయదలచి వారితో ఇలా అన్నాడు.

**తండ్రి అనుమతి:** ''తల్లిదండ్రులారా! నా అభ్యర్థనను వినండి! భగవంతుని అనుగ్రహం వలన నాకు పూర్ణాయుర్ధాయం లభించింది కదా! కావున ఇప్పుడు నాకు పుణ్యక్షేత్రాలు, పవిత్ర తీర్థాలు దర్శించాలని కోరిక కలిగింది. నన్ను సుఖంగా వెళ్ళి రమ్మని మీరు అశీర్వదించి పంపించండి.'' లౌకిక కార్యాలలో గాని, వైదిక కార్యాలలోగాని తండ్రి అనుమతిని పొందుట విశేషం.

**లౌకికే వైదికే కార్యే పిత్రానుజ్ఞా విశిష్యతే | - మా.పు.అ.1 శ్లో.7.**

కాబట్టి నేను తీర్థయాత్రలకు వెళ్ళిరావడానికి నాకనుమతిని ఇవ్వండి!' అని అడిగాడు. అప్పుడు పుత్రవాత్సల్యం గల మృకండు మహర్షి తన కుమారునితో ఇలా అన్నాడు.

నాయనా నీకు పుణ్యక్షేత్రాలు, పుణ్యనదులు సేవించాలని కోరిక కలిగింది. చాలా సంతోషం, నీ కోరిక చాలా మంచిది. ఇటువంటి మంచి భావాలు నీకు కలగడం వలన, మన వంశం కూడా పావనం అవుతుంది. కాని నిన్ను పంపటానికి నా మనస్సంగీకరించడం లేదు. లోకంలో ఏ తండ్రికైనా పుత్రుని ఎడబాటు సహింపరానిది. అందులో నీవంటి సత్పుత్రుని ఎడబాటు ఎంత దుర్భరమో కదా! నీవు ఉత్తమోత్తముడవైన పుత్రుడవు. నీ వియోగం దుస్సహమైనది. సత్పురుషులు సుపుత్రుని లక్షణాన్ని ఇలా చెప్పారు.

**తల్లిదండ్రులను సేవించాలి:** తన ప్రవర్తనచేత తండ్రిని సంతోషపెట్టేవాడే నిజమైన పుత్రుడు. భర్త హితమును కోరునదే భార్య. కష్టసుఖాల్లో సమానంగా ప్రవర్తించేవాడే నిజమైన మిత్రుడు. ఇటువంటి ముగ్గురిని లోకంలో పుణ్యాత్ములు మాత్రమే పొందుతారు.

**యః ప్రీణయేత్ స్వచరితైః పితరం స పుత్రః|**
**యద్భర్తురేవ హితమిచ్ఛతి తత్కళత్రమ్ ||**
**తన్మిత్రమాపది సుఖే చ సమక్రియం యత్|**
**ఏతత్త్రయం జగతి పుణ్యకృతో లభన్తే|| - మా.పు.అ.1శ్లో.14**

నీవు మాకు ప్రీతిని చేకూర్చేవాడివి. బుద్ధిమంతుడవు, ఆస్తికుడవు. నీ ఎడబాటును మేమెలా తట్టుకోగలం? తనయుడు తమ దగ్గర ఉండటమే తల్లిదండ్రులకు ఆనందాలన్నిటి కంటె

పర మానందం కలిగిస్తుంది. అలాగే తల్లిదండ్రులను సేవిస్తూ వా రి వద్దనే ఉండటం పుత్రునికి ఆనందం, అదే పుణ్యకార్యం కూడా.

**ఆనందేషు చ సర్వేషు స ఏకానంద ఉత్తమః ।**
**మాతాపిత్రోః సమీపే తు వర్తతే తనయో యతః ॥**
**తనయస్య సచానంద స్తదేవ సుకృతం మహత్ ।**
**పిత్రోః శుశ్రూషమాణస్తు సంచరేత సమీపతః ॥**
**– మా.పు.అ.1శ్లో.15.**

అందువల్ల మమ్మల్ని వదిలి నీవెలా వెళ్తావు? అని అడుగగా మార్కండేయుడు మరలా ఇలా అన్నాడు–

'జననీ జనకులారా! మీరు నా కోసం విచారించవద్దు. నేను ప్రతి సంవత్సరం మీ దగ్గరకు వచ్చి మీ దర్శనం చేసుకుంటాను. పుణ్యక్షేత్రాలు దర్శించడం వలన, పవిత్ర తీర్థాలలో స్నానం చేయడం వలన కలిగే పుణ్యం వారి వంశాన్నంతటిని పవిత్రం చేస్తుందని పెద్దలు చెప్పగా విన్నాము కదా!

**పుణ్యక్షేత్రాభిగమనే పుణ్యతీర్థావగాహనే ।**
**యత్పుణ్యం తత్కులం సర్వం పావయేదితి హి శ్రుతమ్ ॥**
**– మా.పు.అ.1.శ్లో.18.**

కాబట్టి నన్ను వెంటనే ఆశీర్వదించి పంపించండి! అని చెప్పగా తల్లిదండ్రులిద్దరు పుత్రుని కౌగలించుకొని 'చిరంజీవా! సుపుత్రా! నీవు చాలాకాలం ఆనందాన్ని అనుభవించు. నీవు ధర్మపరుడవై మాకానందాన్ని కలిగించు అని అశీర్వదించగా మార్కండేయుడు వారికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి తీర్థయాత్రలకు బయలుదేరాడు.

**మార్కండేయుని తీర్థయాత్ర:** మార్కండేయుడు ఆకాశమార్గంలో పయనించి కాశీకి చేరాడు. అక్కడ గంగలో స్నానం చేసి పవిత్రుడై ఒడ్డుకు వచ్చి విశ్వానాథుని దర్శించి నమస్కరించాడు. ఆ తరువాత అతనికి విష్ణుభక్తులలో శ్రేష్ఠుడు, పక్షిరాజైన గరుత్మంతుడు ఆకాశమార్గంలో సంచరిస్తూ కనబడ్డాడు. అప్పుడు మార్కండేయుడు ఆయనతో 'విష్ణువుకు వాహనమైన గరుత్మంతా! నీకు నమస్కారం. ఓ మహామతీ! నీవెక్కడికి వెడుతున్నావు? నేను పుణ్యక్షేత్రాలను, పుణ్యతీర్థాలను దర్శించాలని ఇక్కడకు వచ్చాను. కావున గొప్ప పుణ్యక్షేత్రాల గురించి నాకు చెప్పండి' అని అడిగాడు. అపుడు గరుడుడు మార్కండేయునికి రహస్యమైన విషయాన్ని ఇలా ఉపదేశించాడు–

మహత్తర పర్వతం: ఓ మార్కండేయా! మునిశ్రేష్ఠా! నీకు యథార్థ విషయాన్ని చెబుతాను. విను. తీర్థాలన్నిటిలో గొప్పది, పుణ్యక్షేత్రాలలో ఉత్తమమైనదాని గురించి చెబుతాను. విను. ఇక్కడకు దక్షిణ దిక్కున సువర్ణముఖరీతీరంలో వేంకటాచలమనే పర్వతశ్రేష్ఠమున్నది. అక్కడ ఎవరైనా శుభాలను పొందుతారు. యోగులు అక్కడ ఉండటానికి, దానిని దర్శించడానికి ఇష్టపడతారు. వారంతా అక్కడే నివసిస్తూంటారు. ఆ పర్వతానికి చాల పేర్లు ఉన్నాయి. ఆ పవిత్రమైన పేర్లను చెబుతాను విను. శ్రీ వేంకటాచలం, శేషాద్రి, నారాయణాద్రి, అంజనాద్రి, స్వర్ణాద్రి, రత్నమహీధరం మొదలైన అనేక పేర్లు ఆ పర్వతానికి ఉన్నాయి. ఆ పుణ్యనామాలను స్మరించినంతనే పవిత్రం చేస్తాయి.

**నామాని సంతి సుబహూని హి తస్య లోకే**
**తాని బ్రవీమి శృణు పుణ్యతమాని తత్ర ।**
**శ్రీవేంకటాద్రిరితి శేషమహీధరేతి**
**నారాయణాద్రిరితి చాంజనభూధరేతి ।**
**స్వర్ణాచలేత్యపి చ రత్నమహీధరేతి**
**భూయాంసి సంతి భువనోత్తమపావనాని ॥**
**– మా.పు.అ.1.శ్లో.29.**

ఓ మునీంద్రా! ఆ పర్వతాన్ని స్తుతిస్తే సకల పాపాలు నశిస్తాయి. దానికి నమస్కరిస్తే సకల సౌఖ్యాలను ప్రసాదిస్తుంది. ఆ వేంకటాచలయాత్ర దేవతలకు కూడ పూజార్హమైనది. ఆ వేంకటాచలం అంతటి మహత్తరమైనది.

**తత్కీర్తనం సకలపాపహరం మునీంద్ర!**
**తద్వందనం సకలసౌఖ్యదమేవ లోకే! ।**
**యాత్రాపి తం ప్రతి సురైరపి పూజనీయా**
**తాదృఙ్మహాన్ భవతి వేంకటశైలముఖ్యః ॥**
**– మా.పు.అ.1.శ్లో.30.**

ఆ పర్వత ప్రభావాన్ని ఇంకా చెబుతాను. ఆ పర్వతంపై సర్వతీర్థాలు ఉన్నాయి. వాటిల్లో స్వామిపుష్కరిణి ముఖ్యమైనది. దాని మాహాత్మ్యాన్ని ఏమని చెప్పేది? దానికి పడమటి తీరంలో భూవరాహస్వామి భూదేవిని ఆలింగనం చేసుకొని అతి సౌమ్యమూర్తియై లోకంలోని ప్రజలకు మేలు చేకూరుస్తూ విరాజిల్లుతున్నాడు. దానికి దక్షిణతీరంలో వైకుంఠపుర వల్లభుడైన నారాయణుడు లక్ష్మీసహితుడై భక్తవల్లభుడై చిరకాలంగా వెలసి ఉన్నాడు.

**మాహాత్మ్యమేతస్య మయోచ్యతే కథం**
**యత్పశ్చిమే రోధసి భూవరాహః ।**
**ఆలింగ్య కాంతామతిసౌమ్యమూర్తిః**
**విరాజతే విశ్వజనోపకారీ ॥**
**తద్దక్షిణతటే రమ్యే వైకుంఠపురవల్లభః ।**
**ఆలింగితవపుర్లక్ష్మ్యా వరదో వర్తతే చిరమ్ ॥**
**– మా.పు.అ.1.శ్లో.32,33.**

దేవతలు కూడ ఆయన్ని సేవిస్తూ అక్కడే నివసిస్తున్నారు.

**మహాపుణ్యక్షేత్రం:** కావున నీవు వేంకటాచలానికి వెళ్ళి, స్వామిపుష్కరిణిలో స్నానం చేసి, ఆ వేంకటాచలపతిని దర్శించి, ఆనందాన్ని పొందుతావు. నేను కూడ ఆ వేంకటేశ్వరుని సేవించడానికి అక్కడికే వెళ్ళుతున్నాను. విష్వక్సేనుడు,

శేషుడు ఆయనను రాత్రింబళ్ళు సేవిస్తుంటారు. వేంకటాద్రితో సమానమైన పుణ్యక్షేత్రం కాని, స్వామిపుష్కరిణితో సమానమైన పుణ్య తీర్థంకాని, భూలోకంలో లేవు, అని చెప్పి గరుత్మంతుడు వేంకటాచలానికి వెళ్ళాడు. మార్కండేయ మహర్షి గరుత్మంతుని మాటలు విని, ఆశ్చర్యచకితుడై 'ఆహా! ఈ గరుత్మంతుని వలన ఎంత మహా పుణ్యక్షేత్రాన్ని గురించి, తీర్థాన్ని గురించి విన్నాను' అనుకొని ఆ వేంకటాచలానికి వెళ్ళాలని కుతూహల పడ్డాడు.

**పుణ్యదేశో వేంకటాద్రేః తుల్యో నైవ మహీతలే ।**
**స్వామి పుష్కరిణీ తీర్థతుల్యం భువి న విద్యతే ॥**
**– మా.పు.అ.1.శ్లో.36.**

**వేంకటాచలయాత్ర:** మార్కండేయుడు సువర్ణముఖరీనదికి వెళ్ళి దానికి ఉత్తరదిక్కులో ఉన్న శేషాద్రిని చూశాడు. అనుకోకుండా అగస్త్యుని శిష్యుడు కూడ అక్కడికి వచ్చాడు. ఆ పర్వతం క్రింది భాగంలో కపిలతీర్థం ఉంది. దానినే చక్రతీర్థమని కూడ అంటారు. దానిపైన వరుసగా ఇంద్రతీర్థం. విష్వక్సేనతీర్థం, శంఖచక్ర గదా శారఙ్గాది పంచతీర్థాలు, అగ్నితీర్థం, బ్రహ్మతీర్థం, సప్తర్షితీర్థాలు ఉన్నాయి. మార్కండేయుడు అగస్త్య మహర్షి శిష్యునితో సహా ఈ చక్రతీర్థం మొదలైన పదిహేడు తీర్థాలలో స్నానం చేసి పవిత్రుడయ్యాడు. వాటికి పడమట దిక్కున వేంకటాద్రిలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర తీర్థాలు ఉన్నాయి.

**నారసింహ గుహ:** వారిద్దరు వాటిలో కూడ స్నానమాచరించి వేంకటాచలాన్ని అధిరోహిస్తూ దారిలో విశ్వవిఖ్యాతమైన నారసింహగుహను చూశారు. అప్పుడు 'లక్ష్మీనరసింహా! ప్రహ్లాదవరదా! ఆనందవైభవా! దేవాధిదేవా! మధుసూదనా! అని ప్రార్థించి, నమస్కరించి, ఈ గుహ మార్గంలో తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి పుష్కరిణికి చేరుకున్నారు. అలా వెళ్లిన తరువాత యథావిధిగా సంకల్పపూర్వకంగా స్నానం చేసి, దానికి పడమటి తీరంలో భూదేవీ సమేతంగా ఉన్న శ్వేతవరాహస్వామికి సాష్టాంగనమస్కారం చేసి ఈ విధంగా స్తోత్రం చేశాడు.

**శ్వేతవరాహస్వామి:** ప్రళయకాల జలధిలో మునిగిన స్థావర జంగమాత్మకమైన భూమిని సర్వవ్యాపియైన ఏ పరమేశ్వరుడు వరాహరూపాన్ని ధరించి తన దంతపు కొనతో ఉద్ధరించాడో అటువంటి స్వయంభువైన భగవానుడు నాకు ప్రసన్నుడగుగాక! వరాహరూపాన్ని ధరించిన ఓ పురుషోత్తమా! నీకు నమస్కారం. స్వామిపుష్కరిణి తీరంలో నివసించే భక్తవరదుడవైన ఓ అచ్యుతా! నీకు నమస్కారం. శ్రీ వేంకటాచలంలో వెలసిన ఓ వరాహస్వామీ! విశ్వమంగళకరా! భక్తరక్షకా! నీకు సదా నమస్కారం.

**శ్రీ వేంకటవరాహాయ విశ్వమంగళకారిణే! ।**
**భక్తానాం రక్షిణే తుభ్యం భగవన్! సతతం నమః ॥**
**– మా.పు.అ.2.శ్లో.13.**

ఈ విధంగా వరాహస్వామిని స్తుతించి, స్వామి పాదోదకాన్ని



స్వీకరించి, అక్కడనుండి దక్షిణం వైపున ఉన్న శ్రీనివాసుని సన్నిధికి వెళ్ళాడు. ఆ ఆలయానికి నమస్కరించి, గోపురాలు దాటి విమానంలో (గర్భగుడిలో) ప్రవేశించి, వరప్రదాత, పద్మనేత్రుడైన శ్రీవేంకటేశ్వరుని దర్శించి, ఆయనకు నమస్కరించి ఇలా స్తుతించాడు–

**శ్రీవేంకటేశస్తుతి:** సూర్యచంద్రుల వంటి నేత్రాలు కలవాడు, లక్ష్మీపతి, సృష్టికర్త, యోగులచే సదా ధ్యానించబడేవాడు, జగదీశ్వరుడు, పార్వతీపతి అయిన పరమేశ్వరునిచే భక్తితో సదా పూజించబడేవాడు, మన్మథుని తండ్రి, పాప పరిహారకుడైన శ్రీవేంకటేశ్వరుని నేను భజిస్తున్నాను. ఓ వేంకటాధీశా! ఆశ్రితుల బాధలను పోగొట్టే ఆత్మబంధూ! దయానిధీ! నీకు సదా నమస్కారం. నారాయణాద్రిలో నివసించే ఓ శ్రీహరీ! నారాయణా! జగత్ప్రభూ! నీకు నమస్కారం. కరుణాపూర్ణా! కమలాపతీ! పద్మపత్రేక్షణా! సుందరాకారా! నీకు నమస్కారం. నన్ను రక్షించు!

**పాహి మాం వేంకటాధీశ! ప్రణతార్తిప్రభంజన! ।**
**ఆత్మబంధో! కృపాసింధో! సతతం తే నమో నమః ॥**

**– మా.పు.అ.2 శ్లో.17.**

నాకు వేంకటేశ్వరుడు తప్ప వేరెవ్వరూ రక్షకులు లేరు. కావున నేను ఎల్లప్పుడు ఆ వేంకటేశ్వరునే స్మరిస్తూ ఉంటాను. ఓ శ్రీహరీ! వేంకటేశా! నాయందు ప్రసన్నుడవుకా! నన్ననుగ్రహించు. నాకు అభీష్టాలను ప్రసాదించు ప్రభూ! వేంకటేశా! నేను నీ పాదపద్మాలకు నమస్కరించాలనే కోరికతో చాల దూరం నుండి వచ్చి నమస్కరించి సేవిస్తున్నాను. నేను ఒక్కసారి చేసే సేవతో నిత్యసేవాఫలాన్ని నాకు ప్రసాదించు. నేను అజ్ఞానంతో అనేక తప్పులు చేశాను. ఓ శేషశైల శిఖామణీ! నీవు దయతో వాటన్నింటిని క్షమించు'' అని నిర్మలభక్తితో శ్రీనివాసుని స్తుతించి, శిరస్సున అంజలి ఘటించి, మౌనం వహించాడు.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి ।**
**హరే వేంకటేశ! ప్రసీద ప్రసీద**
**ప్రియం వేంకటేశ! ప్రయచ్ఛ ప్రయచ్ఛ ॥**
**– మా.పు.అ.2. శ్లో.19.**

**వరప్రదానం:** అప్పుడు శ్రీనివాసుడు మార్కండేయునితో ఓ మహామునీ! మహాబుద్ధీ మార్కండేయా! పాపరహితా! నీ యందు నేను ప్రసన్నుడ నయ్యాను. నీవు గరుత్మంతుని మాట విని ఈ వృషాద్రికి వచ్చావు. నన్ను చక్కగా స్తుతించావు. కాబట్టి నీవు కోరినవి ప్రసాదిస్తాను. కోరుకో' అని పలుకగా మార్కండేయుడు 'ఓ జనార్దనా! నా కిష్టమైనదేమున్నది? ఓ భక్తవత్సలా! వేంకటేశ్వరా! నాకు ఎల్లప్పుడు నీయందు నిశ్చలభక్తి కలుగునట్లు నన్ననుగ్రహించు. దేవదేవా! ఇదే నేను కోరేది' అని నమస్కరించాడు.

అంతట శ్రీనివాసుడు 'తథాస్తు' అని మార్కండేయునికి వరమిచ్చి, అగస్త్యమహర్షి శిష్యుడైన శుద్ధునితో 'ఓ శుద్ధా! నీవు అనేక పాపాలు చేశావు. కాని నీవు నన్ను సేవించటం వలన నీ పాపాలన్నీ నశించినాయి. ఇందుకు సందేహం లేదు. నీవు నా విమానానికి ప్రదక్షిణం చేసి మీ గురువుగారి ఆశ్రమానికి వెళ్ళి ధర్మకార్యాలు చేయి' అని ఆజ్ఞాపించాడు. శుద్ధుడు ఆ విమానానికి మూడుసార్లు ప్రదక్షిణం చేసి, ఒకచోట కూర్చున్నాడు. అప్పుడు మార్కండేయుడు అతనితో ఓ శుద్ధా! నీవెక్కడి నుండి వచ్చావు? మీ గురువుగారెవరు? వారి ఆశ్రమం ఎక్కడ ఉంది? శ్రీహరిని సేవించుట వలన నీవు చేసిన ఏ ఏ పాపాలు నశించినాయి? నాయందు దయతో అదంతా వివరించు అని అడిగాడు.

**శుద్ధుని వృత్తాంతం:** అప్పుడు అగస్త్యమహర్షి శిష్యుడైన శుద్ధుడు మార్కండేయునితో 'మిత్రమా! మార్కండేయా! మునీశ్వరా! యథార్థం చెబుతాను, విను. మధ్యరాష్ట్రంలో కాంచీపట్టణం మా ఊరు. నేను బహుకుటుంబీకుడనైన బ్రాహ్మణుడను. కుటుంబపోషణకై నేను గ్రహింపరాని దానాలను స్వీకరించాను. దాని వలన కట్టుకోవడానికి బట్టలు, ఉండడానికి ఇల్లు లేకుండా ప్రపంచమంతా తిరుగుతున్నాను. పాపాత్ముడనైన నేను మృతునికి ఉద్దేశించి పెట్టే ఏకోద్దిష్ట శ్రాద్ధభోజనాన్ని చేశాను. ఆ తరువాత చనిపోయిన వారినుద్దేశించి పెట్టె షోడశభోజనాలను చేశాను. అందువల్ల నేను మతిభ్రమించి ధనాశతో సంచరించాను. స్నానం. సంధ్య, జపం, హోమం. దేవతార్చన, అతిథి అభ్యాగతులను ఆదరించటం, వైశ్వదేవం, బ్రహ్మయజ్ఞం మొదలైన నిత్యకర్మలను నేనెప్పుడు చేయలేదు. అందువల్ల పాపాత్ముడనైన నన్ను చూసి ఊళ్లో వారంతా మహాబ్రాహ్మణుడు (భ్రష్టబ్రాహ్మణుడు) అని నాకు పేరుపెట్టి నిందించేవారు.

**స్త్రీలు లక్ష్మీస్వరూపులు:** ఇలా ఉండగా ఒకనాడు బుద్ధిమంతురాలైన నా భార్య రేవతి నాతో ''నాథా! మీరు కుటుంబపోషణకై చాల పాపాలు చేశారు. అయినా కొంచెమైనా ధనం సంపాదించలేదు. చనిపోయిన వారి నుద్దేశించి దానం చేసిన గోవులను స్వీకరించారు. అలాగే బలవంతంగా చనిపోవడం వలన ప్రేతరూపం పొందినవారి శాంతికై పెట్టే భోజనం చేశారు. వారిచ్చిన వస్త్రాలను ధరించారు. ఈ విధంగా మీరు ఎల్లప్పుడు నింద్యమైన కర్మలనే చేశారు. మీరు ఎన్ని పాపకార్యాలు చేసినప్పటికీ ఇంట్లో మాత్రం ఏమీ లేదు. ఈ రోజు ఇంట్లో తినడానికి అన్నం లేదు. పిల్లలు ఆకలితో ఉన్నారు. మీకు, నాకు, పిల్లలకు కప్పుకోవడానికి వస్త్రం లేదు. మీరు అతి దీనులని తెలుసుకోవడం లేదు.

శ్రీవేంకటేశ్వరుడు ఒక్కసారి నమస్కరిస్తేనే ఆయురారోగ్యాలను, ఐశ్వర్యాలను, కోరినవన్నీ ప్రసాదిస్తాడు. వేంకటాచలపతి అంతటి దయామూర్తి, సర్వ సమర్థుడు అని పెద్దలు చెబుతారు. కావున మీరు ఆ వేంకటాచలానికి వెళ్ళండి. ఇక్కడనుండి ఉత్తరం వైపున 'సువర్ణముఖరి' అనే నది ఉంది. దాని ఒడ్డున శ్రీనివాసుని నివాసభూమి అయిన వేంకటాచలమనే పర్వతం ఉంది. మీరక్కడకు వెళ్ళి ఆ వేంకటేశ్వరుని సేవించండి. స్త్రీలంతా లక్ష్మ్యంశ కలవారని పెద్దలు చెబుతారు. కాబట్టి నా మాటలు నమ్మి వెంటనే బయలుదేరి వెళ్ళండి. మీకు శుభం కలుగుతుంది.'' అని చెప్పింది.

**ఆయురారోగ్యమైశ్వర్యం దాతుం సర్వమనోరథమ్ ।**
**సకృదప్యానతికృతాం శక్తో వేంకటనాయకః ॥**
**ఇతి ప్రాజ్ఞా వదంతీహ తత్ప్రయాణం కురు ద్విజ ॥**
**– మా.పు.అ.2. శ్లో.41,42.**

**లక్ష్మ్యంశా యోషితః సర్వా ఇతి విద్వద్భిరీరితమ్ ।**
**ప్రమాణీకృత్య మద్వాక్యం శీఘ్రం గచ్ఛ సుఖాయ వై ॥**
**– మా.పు.అ.2. శ్లో.44**

**సజ్జన సందర్శనం:** నా భార్య ఈ విధంగా చెప్పగా విని నేను ఐదు రోజుల్లో తీరంలో ఉన్న అగస్త్యాశ్రమానికి వెళ్ళాను.

ఆ నదీతీరంలో శివుని ముందర కూర్చుని తపస్సు చేస్తున్న అగస్త్యమహర్షిని దర్శించి నమస్కరించాను. ఆ దయామూర్తి అగస్త్యమహర్షి నన్ను చూచి నీవెక్కడ నుండి వచ్చావు? ఎందుకు విచా రిస్తున్నావు? నీకు నావల్ల ఏమి ఉపకారం కావాలి? అని అడిగాడు. అప్పుడు నేను 'ఓ దయానిధీ! పాపాగ్రేసరుడనైన నన్ను రక్షించండి. మహాతపస్సు గల మీరు నా విషయాన్ని పూర్తిగా తెలుసుకోగలరు. నాది కాంచీపట్టణం. పాపాత్ముడనైన నన్ను అక్కడి వారంతా 'మహా బ్రాహ్మణుడని పరిహాసం చేశారు. కావున నేను దుఃఖిస్తూ వేంకటాచలానికి వెళ్ళాలనే కోరికతో వచ్చాను. నా పుణ్యవిశేషంచేత మార్గమధ్యంలో మీ దర్శనం కలిగింది. పూర్వపుణ్య విశేషంచేతనే కదా సజ్జనసందర్శన భాగ్యం కలుగుతుంది!. నేను మీ శిష్యుణ్ణి. పాపకార్యాలు చేసిన నన్ను ఓ మహర్షీ! మీరు పవిత్రుని చేయండి' అని ప్రార్థించాను.

**పూర్వపుణ్యవిపాకేన దృశ్యంతేఖలు సజ్జనాః ||**

**–మా.పు.అ.2. శ్లో.51**

**అగస్త్యాశ్రమం:** ఆ మహర్షి "ఓయీ! నీవు చాలా పాపాలు చేశావని నా తపస్సు వల్ల తెలుసుకున్నాను. నీకు ఇప్పుడు వేంకటాచలానికి వెళ్ళాలనే కోరిక కలగడం వలన నీవు పవిత్రుడవయ్యావు. ఇకపైన నిన్ను విప్రులంతా శుద్ధుడని పిలుస్తారు" అని చెప్పి "నీవు తొందరగా వేంకటాచలానికి వెళ్ళి భూవరాహస్వామిని, శ్రీనివాసుని సేవించి తిరిగిరా. అందువల్ల నీ పాపాలన్నీ నశించి పవిత్రుడవవుతావు. ఆ తరువాత నీకు శ్రేయస్సును ప్రసాదిస్తాను. ఆలస్యం చేయవద్దు" అని చెప్పి, నాకు శ్రీనివాసుని సేవించే విధానాన్ని కూడా ఉపదేశించి పంపించారు. అలా నేను వేంకటాచాలనికి వచ్చే దారిలో నిన్ను చూశాను. నేను అగస్త్యుని శిష్యుడను. నన్ను శుద్ధుడంటారు. మనమిప్పుడు ఆ దయానిధియైన అగస్త్యమహర్షి ఆశ్రమానికి వెళ్ళుతున్నాము. అగస్త్యమహర్షి ఆశ్రమం ఈ నదీతీరంలోనే ఉంది. శ్రీవేంకటాచల మాహాత్మ్యాన్ని ఎఱిగిన వారిలో అగ్రేసరుడైన ఆ మహర్షిని దర్శించడానికి నీవు కూడా నాతో వస్తావా? అని అడిగాడు.

అప్పుడు మార్కండేయుడు శుద్ధునితో నేను కూడ ఆ మహర్షిని దర్శించడానికి వస్తాను. సువర్ణముఖరీతీరంలోని ఆ ఆశ్రమానికి నన్ను తీసుకొనివెళ్ళు అన్నాడు. వారిద్దరు కొండ దిగి, సువర్ణముఖరీతీరంలో ఉన్న అగస్త్యమహర్షి ఆశ్రమానికి వెళ్ళారు. అక్కడ అగస్త్యమహర్షిని అనేకమంది మహర్షులు సేవిస్తున్నారు. ఆయన వారందరికి శ్రీవేంకటేశుని కథలను వివరిస్తున్నాడు. వారిద్దరు ఆ మహర్షులందరిని సందర్శించారు. ఆ మహర్షులందరికీ నమస్కరించి, ప్రత్యేకించి తపోధనుడైన అగస్త్యమహర్షికి ప్రణమిల్లారు. ఆయన వారిద్దరిని ఆదరించాడు. మార్కండేయుడు, శుద్ధుడు ఆ సభలో కూర్చున్నారు.

**శ్రీవేంకటాచల వైభవం:** అంతట లోపాముద్రాపతియైన అగస్త్యమహర్షి ప్రసన్న మనస్కుడై, ఆనందభరితుడై ఇలా అన్నాడు 'సువర్ణముఖరీనదికి రెండువైపుల ఉండే ఓ విప్రులారా! శ్రీవేంకటాచలమాహాత్మ్యాన్ని చెబుతాను వినండి. దానిని వింటే పాపాలు నశిస్తాయి. భూలోకంలో శ్రీవేంకటాచలమనే పుణ్యక్షేత్ర మున్నది. దానికి శేషాద్రి, గరుడాద్రి మొదలైన అనేక పవిత్ర నామాలున్నాయి.

శ్రీ మహావిష్ణువు నివసించుటకొఱకై గరుత్మంతుడు వైకుంఠము నుండి 'వేంకట' మనే పేరుగల క్రీడా పర్వతాన్ని తీసుకొనివచ్చి సువర్ణముఖరి నది సమీపంలో ఉంచాడు. లోకరక్షకుడైన శ్రీమన్నారాయణుడు ఆ పర్వతంపైన ఆనందనిలయంలో లక్ష్మీదేవితో కూడ నివసిస్తూ లోకాలను కాపాడుతున్నాడు.

**వైకుంఠలోకాత్ గరుడేన విష్ణోః క్రీడాచలో వేంకట నామధేయః |**
**ఆనీయ చ స్వర్ణముఖీసమీపే సంస్థాపితో విష్ణు నివాస హేతోః ||**
**తత్రాచలేవసన్ విష్ణుః కమలాలయయా సహ |**
**ఆనందనిలయే చైవ వర్తతే లోకరక్షకః ||**


**– మా.పు.అ.2. శ్లో.67 & 68.**

**బ్రహ్మరుద్రాది దేవతల రాక :** పూర్వం ఒకప్పుడు మేము కొంతమంది మహర్షులం కలసి సకల జగత్తుకు శరణ్యుడైన శ్రీహరిని వెదకుతూ, వైకుంఠపురంలో ఆయనను గానక, బ్రహ్మదేవుడు చెప్పిన మాట ప్రకారం వృషాద్రికి వచ్చాము. అనేకమంది మహర్షులు తపస్సు చేయడానికి అక్కడకు వచ్చారు. వారంతా వందల సంవత్సరాలు అక్కడ ఉండి, స్వామిపుష్కరిణిలో స్నానాదికాలు నిర్వర్తిస్తూ తపస్సు చేశారు.

వృషశైలనాథుడైన శ్రీనివాసుని సేవించుటకై బ్రహ్మాది సమస్త దేవతలు, ఇంద్రాది దిక్పాలకులు, సనకసనందాది యోగులు అక్కడకు వచ్చి ఆయనను ప్రీతితో సేవిస్తూ ఉన్నారు. పరమేశ్వరుడైన సదాశివుడు తన ప్రమథ గణాలతో విచ్చేశాడు. క్షీరసముద్రంలో నివసించే సిద్ధసంఘాలు, దేవగురువైన బృహస్పతి, రాక్షసుల గురువు శుక్రాచార్యుడు, హరి భక్తాగ్రేసరుడైన వసుమహారాజు కూడా వచ్చారు. దేవతలు, ఋషులు, సిద్ధులు, చారణులు, కిన్నరులు, అష్టవసువులు అందరు స్వామిపుష్కరిణిలో స్నానం చేసి నిర్మల చిత్తంతో ఆ దేవదేవుని ధ్యానిస్తూ ఆ తీరంలో ఉన్నారు.

**భగవంతుని ఆవిర్భావం:**

అప్పుడొక అత్యద్భుతమైన తేజస్సు ఆవిర్భవించింది. దాని మధ్యలో దివ్యమంగళమైన విమాన మొకటి కనబడిరది. ఆ విమానం మధ్యలో శ్రీవేంకటేశ్వరుడు సాక్షాత్కరించాడు. సర్వశ్రేష్ఠుడైన ఆ దివ్యమూర్తి తన రెండు చేతులలో శంఖ చక్రాలను ధరించాడు. ఒక చేతితో తన పాదారవిందాలను ఆశ్రయించమని చూపుతున్నాడు. మరొక చేతితో తన పాదాలనాశ్రయించిన



సిద్ధులు, చారణులు, మునులు, వసువు, బ్రహ్మ, రుద్రుడు మొదలైన వారంతా స్తోత్రం చేయగా కరుణాసముద్రుడైన శ్రీనివాసుడు వారందరినీ చూచి ఇలా అన్నాడు.

**దేవతలకు వరప్రదానం:**

ఓ దేవతలారా! మీ అందరినీ అనుగ్రహించాను, మీరు కోరినవన్నీ ప్రసాదించాను అని వేంకటేశ్వరుడు

వా రికి సంసారసాగరం మొలబంటిగా మాత్రమే ఉంటుందని చూపిస్తున్నాడు. భక్తులకు సర్వాభీష్టాలను ప్రసాదించుటకు సిద్ధంగా ఉన్నాడు. వక్షఃస్థలంలో లక్ష్మీదేవి కలవాడు, మందస్మితముఖారవిందుడు, సర్వాలంకారభూషితుడైన వేంకటాచలపతిని వారంతా దర్శించారు.

**తన్మధ్యస్థం దివ్యమూర్తిం వరేణ్యం**
**శంఖం చక్రం ధారయంతం కరాభ్యామ్।**
**సేవ్యత్వేన స్వం పదాంభోజయుగ్మం**
**సర్వేషాం సందర్శయంతం కరేణ ॥**
**స్వాంఘ్రిద్వంద్వం సంశ్రితానాం**
**జనానాం సంసారాబ్ధిర్జానుదఘ్నః కిలేతి।**
**న్యస్తేనోరౌ వామతో దర్శయంతం**
**సవ్యేనాన్యేనాపి హస్తేన సమ్యక్ ॥**
**సర్వాభీష్టం దాతుముద్యుక్తహేతోః**
**భక్తానాం శ్రీవాసవక్షః స్థలం చ।**
**మందస్మేర శ్రీముఖం భూషణాఢ్యం**
**సర్వే శ్రీమద్వేంకటేశం హ్యపశ్యన్॥**
**-మా.పు.అ.2.శ్లో.75-77**

ఆ జగత్ప్రభువుకు నమస్కరించి ఈ విధంగా స్తుతించారు. ఓ జగత్ప్రభూ! దేవదేవా! సర్వలోక పూజ్యా! నీకు జయమగుగాక! ఓ వేంకటాచలపతీ! నీకు జయమగుగాక! ఓ కరుణామూర్తీ! మమ్ములను రక్షించు. శ్రీమహావిష్ణూ! వేంకటాచలనాయకా! మేమంతా నీకు నమస్కరిస్తున్నాము. ఓ జగద్గురూ! మాకు కోరినవాటిని ప్రసాదించి మమ్ములను కాపాడు'' అని దేవతలు, వారికి వరమిచ్చాడు. అప్పుడు బ్రహ్మాదిదేవతలు, మహర్షులు మరల ఆ దేవదేవుని ఇలా ప్రార్థించారు ''ఓ కృపానిధీ! వరప్రదాతా! నీకు నమస్కారం. ఓ వేంకటాధీశా! విశ్వేశా! నీకు వందల నమస్కారాలు. ఓ దయాసముద్రా! మా విజ్ఞాపనను ఆలకించు. నీవు అందరిని అనుగ్రహిస్తూ, అందరికి అభీష్టాలను ప్రసాదిస్తూ, మానవులు చేసే అపరాధాలన్నింటినీ క్షమిస్తూ, నీ దయను వారిపై ప్రసరింపజేస్తూ ఇక్కడే ఉండు. ఓ కేశవా! వేంకటాద్రి శిరోమణీ! కలియుగంలో మానవులు ప్రత్యక్షగోచరుడవై నిన్ను దర్శించి తమ పాపాల నుండి విముక్తులగుదురు గాక! ఈ విధంగా మానవులను అనుగ్రహిస్తూ, వారిని సంసారసాగరం నుండి ఉద్ధరిస్తూ లక్ష్మీదేవితోపాటు, స్వామిపుష్కరిణి తీరంలో ఉండు. ఓ శ్రీహరీ! ఇదే మా ప్రార్థన'' అని వారంతా వేడుకోగా కృపాసముద్రుడైన శ్రీనివాసుడు అక్కడే వేంచేసి ఉన్నాడు.

ఈ విధంగా భగవంతుడు నెలకొన్న వేంకటాద్రి సర్వలోకాలలోను విఖ్యాతి చెందింది. అక్కడ ఆకాశగంగ మొదలైన అనేక పుణ్య తీర్థాలున్నాయి. అవి అసంఖ్యాకాలు కాబట్టి వాటిని గురించి నేను వివరించలేను. ఓ మహర్షి శ్రేష్ఠులారా! వాటిల్లో స్వామిపుష్కరిణి గొప్పదై విరాజిల్లుతున్నది. దానిలో స్నానం చేయడానికి ప్రతిసంవత్సరం భక్తులు విచ్చేస్తారు. ధనుర్మాసం, శుక్లపక్షం, ద్వాదశినాడు అరుణోదయవేళ తీర్థాలన్నీ దానిలోకి వచ్చి చేరుతాయి. దానిలో స్నానమాచరిస్తే పాపాలన్నీ నశిస్తాయి.

**(సశేషం)**


ధారావాహికం

# శ్రీ కృష్ణ తత్త్వం

- రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

నాగాస్త్రం అర్జునుని సంహరించలేదని – మరలా తిరిగి వచ్చాడు నాగశ్రేష్ఠుడు. మళ్లీ ప్ర యోగించాలని కర్ణుణ్ణి ప్రేరేపించాడు.రెండవ సారి ప్రయోగించే పద్ధతి తనకు లేదన్నాడు కర్ణుడు. తాను ఎవరో చెప్పినప్పటికీ అదే బదులిచ్చాడు. ఆ నాగుడి గూర్చి చెప్పాడు కృష్ణభగవానుడు. వెంటనే అర్జునుడు ఒక దివ్యాస్త్రం ప్రయోగించి ఆకాశంలో వున్న నాగుణ్ణి ముక్కలు ముక్కలుగా నరికేసాడు.



శాపం కారణంగా కర్ణుని రథ చక్రాలు భూమిలోనికి దిగబడగా – కర్ణుడు ధర్మాన్ని గూర్చి మాట్లాడినాడు. మరి ద్రౌపది వస్త్రాపహరణం సమయంలో మరొక భర్తను ఎన్నుకోవాలని ఆక్షేపించినట్టి కర్ణుని ఉపేక్షించకు చంపెయ్ – అన్నాడు కృష్ణుడు. ఆ భగవానుని ప్రేరణతో బాణంతో కర్ణుని శిరస్సును ఛేదించాడు పార్థుడు.

యుద్ధంలో మొత్తం నూరుగురు కౌరవులు హతమైనారు. కనుకనే పాండవులకు విజయలక్ష్మి లభించింది.

సైంధవుడు (జయద్రధుడు) అభిమన్యుని మరణానికి కారణమైనాడని – సూర్యాస్తమయం లోపల చంపేస్తాను అంటూ భయంకరమైన శపథం చేసాడు అర్జునుడు. ఆ రాత్రి పాశుపతాస్త్ర ప్రాప్తికి తనను పూజించాలన్నాడు కృష్ణ భగవానుడు. ఆ స్వామికి సమర్పించిన పుష్పాదులు పరమశివుని సన్నిధిలో కనిపించాయి. సర్వదేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి అన్నది యధార్థమైంది.

మరుసటి రోజున సూర్యాస్తమయానికి ముందు కృష్ణ భగవానుడు తన యోగమాయతో సూర్యుణ్ణి కప్పేసి– సైంధవుని మరణానికి అనుకూలాన్ని కల్పించాడు.

అలాగే అశ్వత్థామ ప్రయోగించిన నారాయణాస్త్రాన్ని విఫలం చేయించాడు కృష్ణపరమాత్మ.

దుర్యోధనుడు తొడలు విరిగి మరణించే సమయంలో అంటున్నాడు కృష్ణునితో ఈవిధంగా–

భీముడు నా తొడలను దెబ్బతీయాలని అర్జునునితో నీవు మాట్లాడుతున్నపుడు విన్నాను నేను. భీష్మ ద్రోణ కర్ణాదులను చంపాలని నీవు ఎన్నెన్ని ఉపాయాలను పన్నినావో– ఆ పాడుపనులు చేయడానికి కృష్ణా! నీకు సిగ్గు లేదాయని అంటూ నానావిధాల దుర్భాషలాడాడు. అందుకు సుయోధనుని దుష్ట బుద్ధి ప్రభావమే కారణం అంటూ తగినట్లుగా సమాధానం ఇచ్చాడు కృష్ణభగవానుడు.

ఉత్తర గర్భస్థ శిశువును దహించేటట్లు ప్రయోగించిన అస్త్రాన్ని మళ్ళించాడు అశ్వత్థామ.

నేను కనుక ధర్మబద్ధుడను అయితే– బ్రహ్మ జ్ఞానుల పట్ల అమితమైన ప్రీతిని నేను కలిగివున్నట్లయితే– మరణించిన అభిమన్యుని పుత్రుడు జీవించుగాక యని తనదైన పాదాన్ని మృతశిశువునకు– ఆపాదమస్తకమూ తగిలేలా తాకించాడు. కృష్ణ భగవానుని దివ్యమైన పాదంతో స్పృశింపబడిన శిశువు (పరీక్షిత్తు) బతికాడు.

నూరుగురు కౌరవులు కురుక్షేత్రంలో చనిపోయారు. ఇక వారి మరణానికి కారణము ప్రధానంగా భీమసేనుడు. అతనిమీద క్రోధాన్ని దాచిపెట్టుకున్న ధృతరాష్ట్రుని మనసును పసిగట్టాడు కృష్ణభగవానుడు. అందుకని భీముని విగ్రహాన్ని తయారు చేయించి ముందుగా సిద్ధంగా వుంచాడు కృష్ణుడు.

ఇక ధృతరాష్ట్రుడు కౌగలించుకోవాలని ప్రయత్నించినపుడు ఇనుప విగ్రహాన్ని ముందుకు తోసాడు. వేయి ఏనుగుల బలం వున్న గుడ్డి రాజు నిజ భీముడని భావించాడు. అమితమైన క్రోధావేశంతో బలంగా కౌగలించుకోగా – ఆ విగ్రహం పొడి పొడి అయ్యింది. భీమసేనుడు నిజంగా చనిపోయాడని అమాయకపు ముదుపులు ఏడుస్తున్న ధృతరాష్ట్రునితో అంటున్నాడు భగవానుడు.

**మాశుచో ధృతరాష్ట్ర! త్వం నైవ భీమః త్వయా హతః ।**
**ఆయసీ ప్రతిమాహ్యేషా త్వయా నిష్పాతితా విభో ।**
**త్వాం క్రోధవశమాపన్నం విదిత్వా భరతర్షభ ।**
**మయాపకృష్టః కౌంతేయః మృత్యోర్దంష్ట్రాంతరంగతః ॥**

ధృతరాష్ట్రా!శోకించవద్దు. నీవు భీముణ్ణి చంపలేదు. నీవు ఒక ఇనుప ప్రతిమను హతమార్చావు. నీవు ఎంతో క్రోధవశుడవైనావు. నీ ఆంతర్యాన్ని గమనించాను. మృత్యుకోరలనుంచి నేనే భీముణ్ణి తప్పించాను.

ప్రతి మనిషి జీవితంలో ఈ నలుగురూ వుండాలి.

1. మనల్ని నవ్విస్తూ సంతోషపెట్టేవాడు.
2. జీవితంలో పాఠాలను నేర్పేవాడు. (మార్గదర్శి)
3. కష్టనష్టాలలో ధైర్యాన్ని అందించేవాడు.
4. మనం చెడు దారిలో పోతున్నపుడు – లేదా తప్పుడు నిర్ణయాలు తీసుకునేటపుడు – మనకు ఇది మంచి ఇది చెడు అని చెప్పి సన్మార్గంలో నడిపించేవాడు – సరైన నిర్ణయాలు తీసుకోమని చెప్పేవాడు.

హస్తినాపురం నుంచి కృష్ణ భగవానుడు ద్వారకకు బయల్దేరాడు. మార్గమధ్యంలో ఉదంక మహర్షిని దర్శించినాడు. అపుడు హస్తినలోని విశేషాలను అడిగాడు మహర్షి. కురుపాండవుల మధ్య సంధి విఫలమైందని– యుద్ధములో కౌరవులు అందరూ మరణించారని చెప్పాడు కృష్ణదేవుడు.

కృష్ణా! నీవు పాండవపక్షపాతివైనావు. ధార్తరాష్ట్రులను రక్షించ లేనందుకు నిన్ను శపించదలచాను అన్నాడు.

ఉదంకుని శాంతపరుస్తూ– అల్పమైన తపశ్శక్తితో ప్రతిఘటించవద్దు. అయినా అత్యధిక విలువైన తపోబలాన్ని వ్యర్థపుచ్చుకోవద్దు అంటూ తనదైన తత్వాన్ని బోధించాడు. విశ్వరూపాన్ని దర్శింపచేసాడు. ఒక్కొక్కసారి నిందలను శాపాలనూ పొందినాడు కృష్ణపరమాత్మ.

స్త్రీ పర్వంలో దుర్యోధనాదులందరి మరణాన్ని తెలుసుకుని విలపించింది గాంధారి. కృష్ణా! బుద్ధి పూర్వకంగానే కౌరవుల వినాశనాన్ని కోరి చేయించావు. నేనే కనుక నా పతికి శ్రద్ధతో శుశ్రూషను ఆచరించి ఉంటే — ఏ కొద్దిపాటి యైనా తపశ్శక్తిని ఆర్జించి ఉన్నట్లయితే — ఇంక 36 సంవత్సరాలకు నీ వంశమూ సర్వనాశనం అవుతుంది. అడవిలో ఒక అనాథలా తిరుగుతూ ఎవరికీ తెలియకుండా నింద్యమైన పద్ధతిలో నీవు మరణిస్తావు అంటూ కృష్ణుణ్ణి ఘోరంగా శపించింది గాంధారి.

సాంబునికి ఆడవేషం వేసి కడుపులో రోకలి పెట్టారు యాదవులు. కణ్వుడు మొదలైన మహర్షులు ద్వారకానగరానికి వస్తుంటే ఈమెకు ఆడబిడ్డ లేక మగబిడ్డ ఎప్పుడు పుడతారో చెప్పాలంటూ అడిగారు. దివ్య దృష్టితో యాదవుల కొంటెతనాన్ని గుర్తించారు మహర్షులు. ఈమె గర్భంలో ముసలం (రోకలి) పుడుతుంది. యాదవ వంశం నాశనమవుతుంది అంటూ శపించారు. అదంతా కృష్ణభగవానుని సంకల్పమే. దేవ దానవ మానవుల చేత యదు, వృష్ణి వీరులు ఎప్పటికీ చంపబడరు. అందుకనే పరస్పరం కొట్టుకొని చస్తారని కృష్ణ భగవానునికి ముందే తెలుసు. కనుకనే గాంధారి శాపం కొత్తేమీ కాదు స్వామికి.

అయితే ఇక్కడ మనలో మాట–ఒక క్షత్రియ వనిత (గాంధారి) ఇచ్చినట్టి శాపం ఫలిస్తుందా? కృష్ణ పరమాత్మ అన్యాయంగా అధర్మంగా కౌరవులను హతమార్చివుంటే– గాంధారి శాపానికి బలం చేకూరుతుంది కదా. అయితే స్వయంకృతాపరాధం వలన దుర్యోధనాదులు నశించారని ఆమెకు తెలియదు. ఒకవేళ ఆ శాపం ఫలిస్తే– ఆ స్వామి అలౌకికమైన పరత్వానికి దివ్యత్వానికి అర్థమేమిటి? ఎప్పుడు శాపాలు ఫలిస్తాయంటే — ఆ స్వామి స్వయంగా స్వీకరించినపుడు.

**గాంధారి! మా చ శోకే మనః కృథా । తద్దైవ అపరాధేన కురువో నిధనం గతాః**

గాంధారీ! నీ మనసును శోకపూరితం కానివ్వకు. ఇక నీ అపరాధం మూలాన కౌరవులు చనిపోయారు. దురాత్ముడు ఇంకా అసూయాపరుడునూ– అతిపరమ దురభిమానియైన నీ కుమారుడు దుర్యోధనుడు. వాడు తలపెట్టిన. అనేకానేక దురాగతాలు నీకు మాత్రమూ మంచిగా అనిపిస్తున్నాయా? వాడు నిష్ఠురస్వభావి. వైరపురుషుడు. పెద్దల మాటలను పెడచెవిన పెట్టేవాడిని ఒక సాధువుగా భావిస్తున్నావా? ఎక్కడలేని దోషాలను నామీదకు తోస్తున్నావు. ఇది నీకు న్యాయమా? అన్నాడు. దానికి మారుమాట్లాడలేదు గాంధారి.

శ్రీ కృష్ణుని బాల్య స్నేహితుడైనట్టి కుచేలుడి మరొక పేరు సుదాముడు. అభిమానధనుడు. విజ్ఞానవంతుడు. రాగ ద్వేషరహితుడు. బ్రహ్మజ్ఞాన సంపన్నుడు. ధర్మతత్పరుడు. జితేంద్రియుడు. దరిద్రం దారుణాతి దారుణముగా తాండవిస్తున్నప్పటికి ఎవరినీ యాచించి ఎరుగడు. తనకు దొరినట్టి దానిని పదివేలుగా భావించేవాడు.

ఇక కుచేలుని (సుదాముని) భార్య మహాపతివ్రత. సద్వంశసంజాత. బిడ్డలు ఆకలిబాధతో పట్టెడన్నము పెట్టాలని అడుగుతుంటే– ఒక రోజున భర్తతో ఈవిధంగా అన్నది.


కృష్ణ భగవానుడు మీకు చిన్నప్పటి స్నేహితుడుకదా. ఆ మహానుభావుణ్ణి దర్శించండి. ఆ స్వామి కృపాకటాక్షంతో మన సంసారం ఉద్ధరింపబడుతుంది. ఇక ఆ భక్తవత్సలుడు మిమ్మల్ని తప్పకుండా అనుగ్రహిస్తాడు.

భార్య సలహా నచ్చింది. మరిక కృష్ణ భగవానుని దర్శనం కళ్యాణప్రదమే. అయినా ఆ స్వామికి ఏదైనా కానుక ఇవ్వాలి. వట్టి చేతులతో వెళ్ళలేనుగా అన్నాడు కుచేలుడు.

ఇరుగు పొరుగు బ్రాహ్మణ గృహాలలో యాచించి నాలుగు పిడికెళ్ళ అటుకులు తెచ్చింది కుచేలుని భార్య. చిరుగులున్న సుదాముని పై పంచెలో జారిపోకుండా పెట్టి–ముడివేసింది.

ద్వారకా నగరానికి బయలుదేరాడు కుచేలుడు.అయితే కృష్ణ భగవానుడు అంతఃపురంలో వుంటాడు. ఏవిధంగా చూడాలబ్బా. ఎందరో ద్వారపాలకులు అడ్డుకున్నపుడు– ఏమిచేయాలి? వారికి ఏదైనా ఇద్దామనుకుంటే– ఏమీ లేని కటికదరిద్రుణ్ణి. ఏది ఏమైనప్పటికినీ కృష్ణానుగ్రహం నామీద వున్నట్లయితే ప్రతిబంధకాలు వుండవని ఆలోచిస్తూనే లోపలికి వెళ్ళగలిగాడు.

**(సశేషం)**



# శ్రీకూర్మావతారం

– ఎస్.ధర్మారావు

దితి, అదితి లు కశ్యప ప్రజాపతి భార్యలు. వారి సంతానం వరుసగా దైత్యులు, దేవతలు. వారికి తండ్రి ఒక్కరైనా తల్లులు వేరు వేరు అగుట చేత వారి మధ్య గల సవతి పోరు వల్ల వారి సంతానానికి కూడా పరస్పర విద్వేషం ఏర్పడి నిత్యం కలహిస్తూ ఉండేవారు. తరచూ వారి మధ్య జరిగే యుద్ధంలో ఒకప్పుడు దేవతలు, మరొకప్పుడు దానవులు జయించి ఎదుటి పక్షం వారిని హింసిస్తూ ఉండేవారు. అలాంటి నేపథ్యంలో ఒకప్పుడు దేవ దానవులకు గొప్ప యుద్ధం జరిగింది. దానిలో రాక్షసుల దెబ్బలకు తాళలేక దేవతలు ఓడిపోయారు. దేవేంద్రుడు రాక్షస రాజు బలిని సమీపించి మంచి మాటలతో అతని మెప్పును పొంది అతనికి మిత్రుడయ్యాడు. రాక్షసులందరికీ ఇష్టుడైన పిదప ఒకనాడు వారందరినీ సమావేశపరచి ఆ గోష్ఠిలో నెమ్మదిగా వారికి ఇలా తెలియచెప్పాడు.

మిత్రులారా! పాల సముద్రమును మథించినట్లయితే అమృతం పుడుతుంది. దాన్ని సేవించినట్లయితే అట్టివారికి జరామృత్యువులు కానీ అధి వ్యాధులు కానీ సంభవించవు. అమృతం లభించడానికి చేయవలసిన క్రియా కలాపము యావత్తూ వారికి వివరించాడు. శ్రీమన్నారాయణుడు ఆ విధానమంతా తనకు ఉపదేశించాడని చెప్పి అదంతా పూసగుచ్చినట్లుగా వారికి విశదీకరించాడు. వారిని అనునయిస్తూ ఇలా అన్నాడు.

మనమంతా అక్క చెల్లెండ్ల సంతానం. మనలో మనం తగాదాలు పడటం దేనికి? పోరు నష్టం పొందు లాభం కదా! అందుచే మనం ఉమ్మడి ప్రయత్నంతో అమృతం సాధిస్తే ఉభయ తారకంగా ఉంటుంది. అమృత పానం చేసి అందరం జరా మరణ భయం లేకుండా కలిసి మెలిసి ఒకటిగా ఉందాం అని బుజ్జగించి చెప్పాడు. అసలే లోభ స్వభావం గల రాక్షసులు అమృత ప్రభావం విని చాలా ఆశ్చర్యపడి దేవతలతో కలిసి క్షీర సాగర మథనానికి అంగీకరించారు.

ఆ తర్వాత ప్రయత్నంగా దేవ దానవులందరూ కలిసి మందరగిరి ఉన్న చోటికి వెళ్ళారు. అతి ప్రయాసతో దానిని పెళ్ళగించారు. సమిష్టి బలంతో దానిని తీసుకుని మెల్ల మెల్లగా పాల సముద్రం వైపు తీసుకొని పోవడం ప్రారంభించారు. అలా కొంతదూరం వెళ్ళేసరికి వారికి అలసట వచ్చి మోయలేక ఆ మహాపర్వతాన్ని క్రిందకి జారవిడిచారు. కొందరు మరణించారు. మరి కొందరికి కాళ్ళు చేతులు విరిగి అంగవికలురైనారు. అప్పుడు దేవతలు దుఃఖా క్రాంతులై పరిపరి విధాలుగా విష్ణుమూర్తిని ప్రార్థించారు. శ్రీమన్నారాయణుడు వారిని అనుగ్రహించడానికి గరుడవాహనుడై ప్రత్యక్షమైనాడు. దేవతలారా! భయపడకండి అని తన కరుణా కటాక్షమును వారిపై ప్రసరించగానే చనిపోయినవారు బ్రతికినారు. అప్పుడు శ్రీహరిని దేవాసురులందరూ చూసి ఆశ్చర్యపడుచుండగా అంత బరువైన మందరగిరిని బంతిని పట్టుకున్నట్లు తన చేతిలో పట్టుకున్నాడు.

దేవాసురుల ప్రశంసలందుకుంటూ గరుడుని చూసి నన్ను, ఈ పర్వతాన్ని పాలసముద్రం వద్దకి తీసుకు పోవయ్యా అని గరుడునిపై ఆసీనుడయ్యాడు. స్వామి ఆనతో గరుత్మంతుడు వారిరువురినీ అవలీలగా సముద్రం ఒడ్డుకు చేర్చాడు. గరుత్మంతుడు స్వామిని, పర్వతాన్ని అక్కడ దించి శ్రీహరి అనుజ్ఞ పొంది తన నివాసానికి తిరిగి వెళ్ళాడు. అటు పిమ్మట శ్రీహరి నాగరాజైన వాసుకిని పిలిపించి ఇలా అన్నాడు.

''ఓ నాగరాజా! క్షీర సాగర మథనానికి నీ వంతు సాయం

నీవు కూడా చేయాలి. నీవు కవ్వపు త్రాడుగా ఉంటే మథనం జరుగుతుంది. దానివల్ల అమృతంలో నీకు కూడా భాగం ఇస్తారు కనుక సమ్మతించు అన్నాడు. ఆ నాగేంద్రుడు దానికి సమ్మతించగానే మందరగిరి నడుము భాగం చుట్టూ ఉన్న ముళ్ళు, రాళ్ళు మొదలైనవి తీసివేసి ఆ భాగం శుభ్రంగా నునుపుగా ఉండేటట్లు చేశారు. శ్రీహరి స్వయంగా తన హస్తాలతో వాసుకి పొడవైన శరీరాన్ని ఆ కొండకు చుట్టాడు. విష్ణువుతో సహా దేవతలందరూ వాసుకి పడగలవైపు పట్టుకోవడానికి సిద్ధమయ్యారు. విష్ణుమాయ వల్ల రాక్షసులు తోకవైపు పట్టుకోవడానికి దానవులిలా అన్నారు. మంచి భాగమైన తల వైపు మీరు, నీచమైన తోకవైపు మేమా? మీకంటే మేము ఏవిధంగా తక్కువ కాము. తోక వైపు పట్టుకోవడానికి మేము ఇష్టపడం అని పడగలవైపు పట్టుకున్నారు. సరే అని హరి మందహాసంతో దేవతలతో కలిసి వాసుకి తోక వైపు పట్టుకున్నారు.



తరువాత ఇరు పక్షాల వారు పర్వతాన్ని ఎత్తి సముద్రం మధ్య భాగానికి చేర్చి అమృతం కోసం నోరూరుతుండగా మథించడం ప్రారంభించారు. అలా కొంతసేపు సాగే సరికి క్రింద ఆధారంగా ఏ కుదురూ లేకపోవడంతో మందరగిరి క్రిందికి దిగిపోవడం ప్రారంభించింది. విడవండి విడవండి అని వాసుకి అరుస్తుండగా పర్వతం గుభిల్లున క్షీర సాగరంలో మునిగిపోయింది. చేసేది ఏమీ లేక తమ అసమర్థతకు సిగ్గుపడి దేవాసురులు చతికిలపడ్డారు. విధిని అతిక్రమించడం ఎవరి తరం కాదు కదా! అలా హతాశులై దిగాలుగా చతికిలబడి యున్న దేవతలను చూచి వారిని ఊరడిస్తూ చిరునవ్వుతో శ్రీహరి మహాకూర్మ రూపాన్ని ధరించి క్షీరసాగరంలో ప్రవేశించాడు.

ఆ మహాకూర్మం లక్ష యోజనముల వెడల్పు, పొడవులు కలిగి వజ్రంలా కఠినమైన మీది బొరుసుతో బ్రహ్మాండాన్నంతటినీ అనాయాసంగా మ్రింగ కలిగినంత ముఖద్వారాన్ని కలిగి యుండి విశ్వం మీద మరో విశ్వం మీదపడినను చలించని దృఢమైన కాళ్ళు కలిగి లోపలికి బయటకు ముడుచుకుంటూ ఉండే మట్టితో, వికసించిన పద్మాలవంటి కనుదోయితో ఆ మహాకూర్మం సుందర తరంగా ఉంది. అలా సముద్ర మధ్యలో ప్రవేశించి కొన్ని క్షణాల్లోనే మునిగిపోయిన మందర పర్వతానికి అడుగున చేరి తన వీపుపై కుదుర్చుకుని మళ్ళీ పైకి తేలేటట్లు చేశాడు. వాసుకితో సహా ఆ గిరి పూర్వపు మాదిరిగా పైకి కనిపించింది. ఆశ్చర్యం కలిగించగా దేవ దానవులు మళ్ళీ తమ తమ స్థానాల్లో కుదురుకుని సాగర మథనం పునః ప్రారంభించారు. శ్రీహరి ప్రభావం వర్ణనాతీతం. ఏమంటే సముద్రంలో మందరగిరి మునిగిపోకుండా కూర్మరూపంలో దాన్ని మోస్తూ కవ్వానికి త్రాడుగా వాసుకి రూపంలోనూ తానే ఉంటూ కవ్వం పట్టి తరించే వారిలో తానుకూడా ఒకడుగా ఉంటూ ఇలా ఏకకాలంలో మూడు చోట్ల మూడు రూపాలతో ఉండి సాగర మథనానికి సహాయ పడుతూ ఉన్న ఆ శ్రీమన్నారాయణుని ప్రభావం తెలుసుకోవడం ఎవరి తరం?

**సర్వేజనా సుఖినోభవంతు**

## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు



### 80వ కళ్యాణం

ఇది తేది 12-06-2025, గురువారం ఉదయం 10.30 గంటల నుండి ఫ్లాట్ నెం.103, 104, వాసవి ఎన్ క్లేవ్, వీధి నెం.4, ఓల్డ్ అల్వాల్, హైదరాబాద్ లో జరిగింది. దీనిని శ్రీమాన్ గంగా శ్రవణ్ కుమార్, లలిత దంపతులు నిర్వహించారు.

### 81వ కళ్యాణం

ఇది తేది 15-06-2025 ఆదివారం ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. హోనర్ అక్వాంటీస్ డ్రైవ్ వే, గేటెడ్ కమ్యూనిటీ, తెల్లాపూర్, హైదరాబాదులో హోనర్ అక్వాంటీస్ నివాసులు నిర్వహించారు.



# నాగపంచమీ వ్రతం

– చిల్లర సీతారామారావు

భారతదేశము ధర్మభూమి. ఇక్కడ వృక్షములను, జంతువులను దైవములుగా భావించి ఆరాధించడం అనాదినుండి వస్తున్నది. శ్రావణమాస శుక్లపక్షమందు నాగులను ఉద్దేశించి జరుపు వ్రతము నాగపంచమి వ్రతము. నాగులు విషప్రాణులు. నాగులు నగరములందు, గ్రామములందు, పొలములందు, తుదకు గృహములందు సంచరిస్తూ, మనుషులను కాటు వేసి సంహరించడం వలన మానవులు నాగులకు భయపడసాగారు. నాగులను ఆరాధిస్తే వాటినుండి రక్షణ కలుగుతుందని భావించి, నాగులను పూజించడం మొదలైందని విజ్ఞులు తెలియజేస్తున్నారు. నాగులు చాలా తెలివైనవని, పగబట్టినచో సాధించేవరకు వదలవని అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి.

నాగపంచమి నా డు నాగులను పూజించడానికి రెండు కారణములను పురాణాలు తెలియజేస్తున్నాయి. మొదటి కారణము ఆదిశేషుడు భూభారమును మోయడము, తనకు సేవలు చేయడము మున్నగునవి విష్ణుమూర్తికి ఆనందమును కలుగచేశాయి. విష్ణుమూర్తి ప్రసన్నచిత్తంతో ఆదిశేషుడిని వరము కోరుకొమ్మని అడిగాడు. ఆదిశేషుడు – ప్రజలు భక్తిభావనతో శ్రావణ శుక్ల పంచమినాడు నాగులను పూజించేటట్లు వరమును ప్రసాదించమని కోరాడు. తథాస్తు అని పలికాడు విష్ణుమూర్తి. ఆ రోజునుండి నాగులను ఆరాధించడం మొదలైంది. ఇక రెండవ కారణము నాగమాత కద్రువ నాగులకు ఇచ్చిన శాపము. ఉచ్చైశ్రవము అను గుర్రము సముద్ర తీర ప్రాంతమున విహరించసాగింది. దానిని కద్రువ వినతలు ఇరువురూ చూశారు. కద్రువ వినతలు కశ్యప మహర్షి భార్యలు. గుర్రము తెల్లగా అందంగా ఉన్నది. కాని ఒకటే లోపము. దాని తోక మాత్రము నల్లగా ఉన్నది అని పలికింది కద్రువ. గుర్రము తెల్లగా ఉంటే నీకు నలుపు ఎక్కడ కనిపించింది అని అడిగింది వినత. ఈ విషయమున వాదోపవాదాలు జరిగాయి. తుదకు ఇరువురి మధ్య ఒక పందెం జరిగింది. ఆ పందెం ప్రకారం

ఓడి నవారు గెలిచినవారి దగ్గర దాసిగా ఉండాలి. మరుసటి రోజు ఉదయం వచ్చి గుర్రమును పరీక్షిద్దామని నిర్ణయించుకుని ఇళ్ళకు వెళ్ళిపోయారు. ఆరోజు రాత్రి కద్రువ తన పిల్లను పిలిచి జరిగిన విషయమును, తమ పందెమును తెలియచేసింది. తన పందెమును నెగ్గించవలసిందిగా తనయులను ప్రార్థించింది. పిల్లలు అది ధర్మవిరుద్ధం, మేము ఆ పని చేయం అని పలికారు. కద్రువ వారిని ఆగ్రహంతో జనమేజయుని సర్పయాగంలో పడి నశించిపొమ్మని శాపమొసగింది. నాగులు తల్లి శాపమునకు దిగులు చెందుచుండగా, బ్రహ్మ కరుణించి ఆస్తీకుడు అను మహర్షి వలన మీకు రక్షణ లభిస్తుందని వరమును ప్రసాదించాడు. ఈ వరమును ప్రసాదించిన దినము శ్రావణ శుక్ల పంచమి. కావున నాగులకు ఈ దినము చాలా ఇష్టమైన దినము. ఆ రోజున నాగులను పూజించిన వారికి నాగుల వలన భయము కలగదు అని ప్రజల విశ్వాసము. నాగపంచమి దినము నాడు శక్త్యానుసారము బంగారము, వెండి, కలప, మృత్తిక మున్నగువాటితో అయిదు నాగ ప్రతిమలను చేయించాలి. వాటిని ఆవు పాలతో కాని, పాయసముతో కాని పూజించాలి. సద్బ్రాహ్మణునకు భోజనము పెట్టి సత్కరించాలి. నాగులను పూజించిన వారికి నాగుల నుండి హాని ఉండదని భవిష్యత్ పురాణము నందు చెప్పబడింది.

నాగపంచమి నాడు మహిళలు ఉదయముననే లేచి శిరః స్నానమాచరించి ఉపవాసముంటారు. ఇంటి గడపలకు రెండు ప్రక్కల గోమయముతో నాగుల మూర్తులను చిత్రీకరిస్తారు. పిదప పుట్ట వద్దకు కాని, పాములు ఉంటాయని నమ్మబడే చోటుకు కాని వెళ్తారు. పాలు, పెరుగు, పానకం, గరిక, దర్భ, గంధ, పుష్పములతో పూజిస్తారు. పుట్టలో పాలు పోస్తారు. పుట్టలో పాలు పోయడం వలన, తల్లి శాపముచే దహింపబడుతున్న వారి శరీరాలకు శాంతి కలుగుతుంది. అలా శాంతిని పొందిన నాగులు భక్తులకు ఎన్నటికీ హాని తలపెట్టవు. పుట్టలో పాలు పోసిన తరువాత మహిళలు పుట్ట చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. నమస్కారాలు చేస్తారు. గృహమునకు తిరిగి వచ్చిన తరువాత ఆహార పదార్థములను తయారు చేసి నాగదేవతకు నివేదన గావిస్తారు. బ్రాహ్మణులకు భోజన సదుపాయాలు కలిగిస్తారు. పిదప కుటుంబ సభ్యులతో కలిసి భుజిస్తారు. నాగదేవతకు నివేదించిన ప్రసాదమును తినడం వలన, ఆ దేవత అనుగ్రహం వలన బాధలు, అనారోగ్యాలు మున్నగునవి తొలగిపోతాయి.

శ్రావణ మాసమునందు వర్షములు మొదలవుతాయి. ఆ వర్ష ధారలకు పుట్టలో ఉన్న నాగులు పుట్టనుండి బయటకు వస్తాయి. వెచ్చగా ఉండే ప్రాంతములకు చేరుకుంటాయి. నాగులు రజోగుణ స్వభావము కలిగినవి. వాటికి క్రోధము అధికము. చూసిగాని, చూడకగాని నాగుల తోక మీద కాలు పడితే వెంటనే అవి కాటు వేస్తాయి. అందువలన నాగులంటే అమితమైన భయము. అందువలన నాగులను స్తుతిస్తూ ఇలా పాడుకుంటారు.

**"పాము నన్ను చూచి పడగనెత్తింది**
**పడగెత్తి దూసింది నాలుకలు రెండూ**
**నాలుకలు దూయకే నీవారము నాగూ**
**మంచి నాగులైతే పంచ లెట్టేము**
**కోడినాగులైతే కోకలెట్టేము**
**మా చేను పండితే చలిమిడేసేము**
**మా నువ్వులు పండితే చిమ్మిలేసేము**
**మా పత్తి పగిలితే పంచలెట్టేము**
**మా యావు లీనితే పాలు పోసేము**
**నీ పూజ చేసేము నీకు మొక్కేము"**

నాగులు రైతులకు నేస్తాలు. నాగులు కృషి సంపదను, కృషి నాశక జీవుల నుండి కాపాడుతాయి. జ్యేష్ఠ ఆషాఢ మాసములందు వర్షములు ఆరంభమవుతాయి. రైతులు భూమిని దున్ని దుక్కి చేసుకుంటారు. తరువాత విత్తనాలు నాటుతారు. విత్తిన విత్తనాలు పైరై, శ్రావణ మాసపు అంతానికి పుష్పించి ఫలించడం ప్రారంభిస్తాయి. భూమిలో తిరుగుతూ పంటలను నాశనం గావించు ఎలకలను నాగులు తమ ఆహారంగా స్వీకరించి రైతుకు పరోక్షంగా సహాయపడుతుంటాయి. ఆరడుగులు కలిసి నడిస్తే ఆప్తులవుతారట. చేలలో తిరుగుతూ చేను చెరిపే ఎలకలను పట్టి మింగేటి పాము రైతులకు ఆప్త వర్గము లోనిదే. ఒక గృహిణి నాగులకు సలహా ఇస్తున్నది.

**"పుట్టలో నాగన్న బూచి నాగన్న**
**ఎండలో పడుకోకు వెర్రి నాగన్న**
**కలిగినోరి కోడళ్ళు గర్వవంతులు**
**కలాపి జల్లేరు కాళ్ళ చిమ్మేరు**
**ఎంగిళ్ళు జల్లేరు భంగపుచ్చేరు**
**అటు బోకు నాగన్న చాకిరేవులకు**
**చాకిరేవులలోన చేరి పడుకుంటే**
**సాలి పరుగడని సంపేరు నాగు**
**అటు బోకు నాగన్న చెరుకు పొలములకు**
**చెరుకు పొలములోన చేరి పడుకుంటే**
**నల్ల చెరుకు అని నరికేరు నాగు"**

నాగులు పుట్టల్లో ఉంటాయని అందరూ భావిస్తారు. కాని అవి పుట్టలలో ఉండవు. పుట్టల అడుగున భూమికి రంధ్రాలు ఉండి చాలా దూరం వరకు సొరంగం లాగా ఉంటుంది. అక్కడ మాత్రమే నాగులు ఉంటాయి. మహిళలు పుట్టలో పాలు పోయడం వలన అక్కడి ప్రాంతం చిత్తడిగా మారిపోతుంది. ఆహారమును అన్వేషించుకుంటూ అక్కడికి వచ్చిన ఎలుకలు, కప్పలు మున్నగునవి నాగులకు ఆహారంగా మారిపోతాయి. భూమి క్రింది బొరియలలో అవి నివసించడం చేత ఈ భూమికి

అవి కామందులు అన్న భావన ఏర్పడింది. కావుననే భూమిని దున్నటా నికి ముందుగా వాటిని తృప్తి పరచాలన్న భావన రైతులకు కలిగి ఉండవచ్చు. నాగులు భూమిలోని నిధి నిక్షేపాలకు రక్షణ దేవతలని, తాయెత్తులు మొదలైన వాటికి మహత్తును అందిస్తాయని, నీటిలో నివసించే నాగులు, వానలకు, వరదలకు, వడగళ్ళ వానలకు అధి దేవతలు అన్న నమ్మకాలు ప్రజలకు కలిగాయి. ఈ నమ్మకంతోనే నాగపంచమి నాడు భక్తి శ్రద్ధలతో నాగులను పూజించే ఆచారం వచ్చింది. ప్రతి వ్రతమునకు ఒక కథ ఉన్నట్లే, నాగపంచమీ వ్రతానికీ కథలు ఉన్నాయి.

పూర్వకాలమున ఒక వ్యవసాయదారుడు ఉండేవాడు. అతడికి నాగపంచమి గురించి ఏమీ అవగాహన లేదు. ఆ రోజున భూమిని దున్నకూడదని, గోతులు తవ్వరాదని, పారతో మన్నును ఎత్తిపోయరాదని, మంట పెట్టరాదని అతనికి తెలియదు. ఒక నాగపంచమి నాడు నాగలితో పొలం దున్నసాగాడు. నాగలి మొనకు తగిలి నాగు పిల్లలు మరణించాయి. తిరిగి వచ్చిన నాగమాత తునా తునకలయిన తన సంతానాన్ని గాంచి దుఃఖితురాలయింది. దుఃఖంతో పాటు క్రోధం కూడా కలిగింది. రైతు మీద పగ తీర్చుకోవాలనుకున్నది. ఆ రాత్రి రైతు ఇంటికి వెళ్ళింది. రైతు కుటుంబ సభ్యులంతా మంచి నిద్రలో ఉండటం గమనించింది. మెల్లగా వెళ్ళి తన కాటుతో వాళ్ళందరినీ సంహరించింది. అయినా నాగమాత ఆగ్రహం తగ్గలేదు. రైతు కుటుంబంలో ఇంకొకరు మిగిలి ఉన్నారని తెలిసింది. రైతు కూతురు పొరుగూరులో ఉన్నదని తెలిసింది. పొరుగూరికి వెళ్ళి రైతు కూతురిని సంహరించాలని సంకల్పించుకున్నది. ఆమెను సంహరించాలన్న పగతో పొరుగూరు వెళ్ళి రైతు కూతురు ఇంటికి చేరుకున్నది. ఇంటిలోనికి ప్రవేశించిన నాగమాతకు ఒక దృశ్యం కనిపించింది. రైతు కూతురు ఆదిశేషుడిని పూజిస్తున్నది. నాగమాత ఆ పూజను చూస్తూ పూర్తయ్యేవరకు అక్కడనే ఉంది. పూజ ముగిసిన తర్వాత రైతు కూతురు నాగమాతకు ప్రసాదాన్నిచ్చింది. ప్రసాదమును భక్తితో తినిన నాగమాతకు ఆగ్రహం తొలగిపోయింది. ప్రసన్నురాలైంది. రైతు కూతురుకు వరం ఇవ్వాలని సంకల్పించుకున్నది. రైతు కూతురితో – నీ ఆదిశేషుడి పూజకు, ఇచ్చిన ప్రసాదమునకు నాకు చాలా ఆనందముగా ఉన్నది. నీకు ఒక వరమును ఇవ్వాలనుకుంటున్నాను. నీకు ఏమి వరం కావాలో కోరుకో – అని పలికింది నాగమాత. నాగు కాటు ద్వారా మరణించిన తన కుటుంబమును బ్రతికించవలసిందని కోరింది రైతు కూతురు. రైతు కూతురు ప్రార్థనను మన్నించి నాగమాత రైతు కుటుంబ సభ్యులందరినీ బ్రతికించింది. ఈ కథ ద్వారా నాగపంచమి నాడు భక్తి శ్రద్ధలతో నాగులను ఆరాధిస్తే ఎటువంటి అరిష్టాలు కలగవని తెలుస్తున్నది.



**శ్లో ॥ "అనంతం వాసుకిం శేష పద్మనాభంచ కంబలమ్**
**శంఖపాలం ధార్తరాష్ట్రం తక్షకం కాళియం తథా**
**ఏతాని నవ నామాని నాగానాంచ మహాత్మానామ్**
**సాయంకాలే పఠేనిత్యం ప్రాతఃకాలే విశేషతః**
**తస్మై విషభయం నాస్తి సర్వత్ర విజయీ భవేత్"**

అనంతుడు, వాసుకి, శేషుడు, పద్మనాభుడు, కంబలుడు, శంఖపాలుడు, ధార్తరాష్ట్రుడు, తక్షకుడు, కాళీయుడు అను తొమ్మిది నాగులు ప్రముఖమైనవి. ఈ నవ నాగులను ప్రాతః కాలము, సాయంకాలము స్మరించుకొనినా, పూజించినా అవి సంతృప్తి చెంది మానవులకు సమస్త సుఖాలను, శుభాలను కలిగిస్తాయి.

నాగుల పంచమినే గరుడ పంచమి అని కూడా పిలుస్తారు. గరుత్మంతుడు తన తల్లి దాస్య నివారణ కొరకు స్వర్గము నుండి అమృతమును తెచ్చి సవతి తల్లి కద్రువకు ఇచ్చాడు. నాగపంచమి నాడు నాగులకు హాని కలిగించే పనులు ఏమీ చేయకూడదు. భూమిని దున్నకూడదు. గోతులు తవ్వకూడదు, చెట్లు నరకకూడదు, ఫలములను, కాయలను కోయకూడదు.

**శ్లో ॥ "సర్వే నాగాః ప్రీయంతాం మెయేకేచిత్ పృథ్వీతలే**
**యేచ హేలి మరీచి స్థాయేన్తరే దివి సంస్థితాః**
**యేన దీషు మహానాగాయే సరస్వతి గామినః**
**యేచవాపీత దాగేషు తేషు సర్వేషు వై నమః"**

పృథ్వి, గగనం, స్వర్గం, సూర్యకిరణం, సరోవరం, వాపీకూప తటాకములందు సంచరించు నాగులు మమ్ములను కరుణించి, రక్షించునవి. అటువంటి నాగులకు సర్వదా ప్రణామములు.

# తిరుమల సర్వస్వం

ధారావాహికం

– పల్లపోతు వాణిశ్రీ



గత సంచిక తరువాయి

## తోమని పళ్ళాల వాడు

అన్నమాచార్యుని ''వేడుకొందామా... తోమని పళ్ళాల వాడె'' అనే కీర్తన మనకు సుపరిచితం. శ్రీనివాసుణ్ణి ఈవిధంగా ఎందుకు కీర్తించారంటే స్వామి ఒకసారి ఆరగించిన పళ్ళాన్ని తోమి మరలా వాడకుండా, పారవేస్తారు. తదుపరి భోజనానికి మళ్ళీ కొత్త పళ్ళెం ఉపయోగిస్తారు. ఆ తోమని పళ్ళాలే – ''పగిలిన మట్టి కుండలు''. వీటిలో ఉంచే ప్రసాదమే ఓడు ప్రసాదం. కుమ్మరి భీమన్న అనే మహాభక్తుని గుర్తుగా, తరతరాల నుండి వస్తున్న ఈ సాంప్రదాయం వెనుకనున్న ఐతిహ్యాన్ని మరొకచోట వివరించడమైంది. అపార కరుణామయుడైన వేంకటేశుడు తాను మాత్రం పగిలిన మట్టికుండలో భుజిస్తూ, ''తిండి మెండయ్య'' అనిపించుకుంటూ, భక్తకోటికి పంచభక్ష్య పరమాన్నాలు అందిస్తున్నాడు.

## లడ్డూ చరిత్ర

లెక్కకు మిక్కిలి ప్రసాదాలున్నా, దేనికీ లేని ఖ్యాతి తిరుపతి లడ్డూ (లాడుకము) సంపాదించుకుంది. మిగతా ప్రసాదాలకంటే ఎక్కువ కాలం మన్నటం, దేశ విదేశాలకు సునాయాసంగా ఆకారం చెడకుండా తీసుకెళ్ళగలగటం, సులభంగా అందుబాటులో ఉండడంతో పాటుగా, దాని అద్భుతమైన రుచి కూడా ''లడ్డూ'' ప్రాచుర్యానికి కారణం. తిరుపతి యాత్ర చేసివచ్చినవారు ఎవరైనా, లడ్డూ ప్రసాదం తీసుకు రాకుండా ఉండరు. శ్రీవారి ప్రసాదమంటే ఎవరికైనా ఠక్కున గుర్తొచ్చేది లడ్డూయే.

ఎవరెన్ని రకాలుగా ప్రయత్నించినా, తిరుపతి లడ్డూ రుచి దేనికీ రాదు గాక రాదు. ఎందుకంటే...

చక్కెరమోము గల తల్లి అయిన అలమేలుమంగ యొక్క పతిదేవుని ఎంగిలి ఇతరత్రా చేసిన లడ్డూలకు తగలక పోవడం దీనికి కారణమేమో!



అంతేకాక ఎనభై ఏళ్ళకు పైగా, ఒకే పద్ధతిలో, అదే పాళ్ళలో, లక్షల కొద్దీ లడ్డూలు నిరంతరాయంగా, శ్రీవారి పట్ల అచంచల భక్తితోతయారు చేస్తుండటం వల్ల ''పోటు'' బ్రాహ్మణులు ఈ విలక్షణమూ, నిత్యనూతనమూ అయిన లడ్డూ తయారీలో అత్యంత నైపుణ్యాన్ని సంపాదించారు.

తిరుమల లడ్డూకు తితిదే 2009 సంవత్సరంలో పేటెంట్ హక్కు సాధించుకుని, జియోగ్రాఫికల్ ఇండికేటర్ జాబితాలో చేరింది. లడ్డూ వేర్వేరు రూపాల్లో అనేక శతాబ్దాల నుంచి ఉన్నా,

తీపి బూందీ ప్రసాదంగా సుమారు 1800 సంవత్సరంలో విక్రయాలు మొదలై, తదనంతర కాలంలో రూపాంతరం చెందుతూ, 1940 ల్లో ప్రస్తుత లడ్డూ రూపం దాల్చుకుంది.

ప్రతిరోజూ ఇంచుమించు 3 లక్షల లడ్లు తయారు చేస్తారు. ఒకప్పుడు వాడే కట్టెలపొయ్యి స్థానంలో నేడు ఆవిరి పొయ్యిలను (సుమారు 48 పొయ్యిలు) వాడుతున్నారు. దాదాపు 700 మంది పోటు కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారు. శ్రీవారి సంపంగి ప్రాకారానికి ఉత్తర భాగాన ఉన్న ''పడిపోటు'' అనబడే వంటశాలలో లడ్డూలను తయారు చేస్తారు. వంటలకు కావలసిన దినుసులన్నింటినీ ''ఉగ్రాణం'' అని పిలువబడే గిడ్డంగిలో భద్రపరుస్తారు.

లడ్డూల తయారీకి వాడవలసిన సరుకుల మోతాదును ''దిట్టం'' అని అంటారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న కొలమానాన్ని ''పడితరం దిట్టం''గా వ్యవహరిస్తారు. దీని ప్రకారం, 5100 లడ్డూలను తయారు చేయడానికి సుమారుగా 830 కిలోల సరుకులను ఉగ్రాణం నుంచి ''పడిపోటు''కు తరలిస్తారు.

ప్రస్తుతం మూడు రకాల లడ్డూలను తయారు చేస్తున్నారు.

1. ఆస్థాన లడ్డు – వీటిని ప్రత్యేక సందర్భాలలో తయారు చేసి అత్యంత ప్రముఖులకు తయారు చేస్తారు. సాధారణంగా, ఈ లడ్డూల విక్రయం జరగదు. వీటి తయారీలో, అధిక మొత్తంలో నెయ్యి మరియు ముంతమామిడి పప్పు (సారపప్పు) వంటి ప్రత్యేక దినుసుల్ని ఉపయోగిస్తారు. దీని బరువు సుమారు 750 గ్రాములు ఉంటుంది. అమోఘమైన దీని రుచిని ఆస్వాదించి తెలుసుకోవాలే గానీ, వర్ణించనలవి కాదు.

2. కళ్యాణోత్సవ లడ్డు – కళ్యాణోత్సవ ఆర్జిత సేవలో పాల్గొన్న గృహస్థులకు ఈ లడ్డూలను ప్రసాదంగా అందజేస్తారు. సుమారుగా 700 గ్రాముల బరువు ఉంటుంది. దక్షిణభారత దేశపు వివాహ విందుల్లో ఈమధ్యకాలం వరకు – అంటే ''క్యాటరింగ్'' సంస్కృతి మొదలై సాంప్రదాయిక విందు భోజనాలు అంతరించి పోయేంత వరకు – లడ్డూ వడ్డన తప్పనిసరి. ఈ ఆనవాయితీ, తిరుమల క్షేత్రంలో శ్రీవారి నిత్య కళ్యాణోత్సవానికి ప్రసాదంగా ఇచ్చే ''లడ్డూ'' ద్వారానే ప్రారంభమైందని చెపుతారు. ఇలా, తరతరాలుగా మన దైనందిన జీవనంలో భాగమైపోయిన తిరుమల సాంప్రదాయాలు ఎన్నో ఉన్నాయి. కళ్యాణోత్సవం మరికొన్ని ఇతర సేవల్లో పాల్గొన్న భక్తులు, ఈ లడ్డూలను దర్శనానంతరం సంపంగి ప్రాకారంలో గల ''వగపడి'' నందు పొందవచ్చు.

3. ప్రోక్తం లేదా సాధారణ లడ్డు – సాధారణ దర్శనానికి వచ్చే భక్తులకు ఈ లడ్డూలను లెక్కగా, ఆలయం వెనుక భాగాన ఉన్న లడ్డూ కౌంటర్లలో విక్రయిస్తారు. కొన్ని రకాల ఆర్జిత సేవల్లో పాల్గొన్న భక్తులకు ఉచితంగా కూడా ఇస్తారు. దీని బరువు సుమారు 175 గ్రాములు. లడ్డూలన్నింటి లోకి అత్యంత ప్రాచుర్యంలోకి వచ్చింది ఇదే.

ఇవే కాకుండా భక్తులకు దర్శనానంతరం ఉచిత ప్రసాదంగా ఒక్కోసారి బుల్లి లడ్డూలను కూడా అందజేస్తారు.

51 వస్తువుల్ని (లడ్డు, వడ, జిలేబి లాంటివి) ఒక ''పడి''గా వ్యవహరిస్తారు. ఒక పడి చిన్న లడ్డూల్ని తయారు చేయటానికి కావలసిన పదార్థాలు :

1.80 కిలోల శనగపిండి, 1.65 కిలోల నెయ్యి, 4.00 కిలోల పంచదార, 300 గ్రాముల జీడిపప్పు, 160 గ్రాముల ఎండుద్రాక్ష, 80 గ్రాముల కలకండ (పటికబెల్లం), 40 గ్రాముల యాలకులు.

అదీ శ్రీవారికి, భక్తులందరికీ అత్యంత ప్రీతికరమైన, ఖండ ఖండాంతరాల ఖ్యాతి గాంచిన ''తిరుపతి లడ్డూ'' కథ–కమామీషు.

## శ్రీవారి భక్తాగ్రేసరులు

స్వామివారు రాజాధిరాజులను కాదని, ప్రతిరోజూ తొలి దర్శనం ఓ గొల్లవానికి అనుగ్రహించారు. ఓ భక్తుణ్ణి ''తాతా'' అని ఆప్యాయంగా పిలిచారు. మరో భక్తుని ''మామా'' అని సంబోధించి ఆయనతో గునపం దెబ్బలు తిన్నారు. ఒకరితో పాచికలాడారు. ఒక భక్తుని మేలుకొలుపు లేనిదే నిద్ర లేవని స్వామి, మరో భక్తురాలి హారతి లేనిదే కునుకు తీయరు. ఇలా చెప్పుకుంటూ పోతే, భక్తజనకోటి పట్ల శ్రీవారి వాత్సల్యాన్ని తేటతెల్లం చేసే ఉదంతాలు ఎన్నో – ఎన్నెన్నో.

''వైకుంఠాన్నైనా'' వదులుకుంటాను గానీ, తన భక్తులను మాత్రం క్షణకాలమైనా విడిచి ఉండలేనని చెప్పి, భూలోక వైకుంఠమైన తిరుమలలో శాశ్వతంగా నెలకొన్న భక్తుల పాలిటి కొంగుబంగారం ఈ శ్రీనివాసుడు.

శ్రీవారి భక్తశిఖామణులను తలచుకున్నా స్వామివారిని స్మరించినట్లే.

శ్రీవారి సేవలో తరించి వారి కృపకు పాత్రులైన అసంఖ్యాక భక్తుల్లో కొంతమందిని స్మరించుకుందాం.

### సన్నిధి గొల్ల

స్వామివారి తొలి దర్శనభాగ్యం ఆయనదే! అతని తరువాతే అర్చకులైనా, రాజాధిరాజులైనా, మరెవరైనా.

### ఆవు – దూడగా బ్రహ్మ రుద్రులు

ఇతిహాసాల ననుసరించి భృగుమహర్షి వృత్తాంతానంతరం, కోపంతో విసవిసా వైకుంఠాన్ని వీడి కొల్హాపూరుకు చేరుకున్న శ్రీమహాలక్ష్మి జాడ కానక, విసిగి వేసారిన శ్రీమహావిష్ణువు

వేంకటాచలాన్ని చేరుకుని, పుష్కరిణికి దక్షిణం వైపు ఉన్న పెద్ద పుట్టలో ఆకలి దప్పులతో అలమటిస్తుంటాడు. ఆయన దయనీయ స్థితిని గమనించి తనయుడైన బ్రహ్మదేవుడు గోవుగానూ, శివుడు దూడగానూ మారి, చోళరాజు పాలనలో ఉన్న వేంకటాచలం పరిసర ప్రాంతానికి చేరుకుంటారు. శ్రీమహావిష్ణువు పట్ల పట్టరాని ఆగ్రహంతో ఉన్నప్పటికీ, శివుడు బ్రహ్మల ప్రోద్బలంతో లక్ష్మీదేవి గోపస్త్రీగా మారి, ముందుగా నిర్ణయించుకున్న పథకం ప్రకారం చోళరాజుకు ఈ ఆవు-దూడను విక్రయిస్తుంది.

## శ్రీనివాసునికి నుదుటిపై గాయం

మేతకు వెళ్ళిన ఆవు గొల్లకాపరి కన్నుకప్పి, పుట్టలో ఉన్న శ్రీనివాసుని వద్దకు వచ్చి పాలు ధారగా కార్చేది. ఆ ఆవుపాలతో శ్రీనివాసుడు ఆకలి-దప్పులు తీర్చుకునేవాడు. అయితే దేవతాకళ ఉట్టిపడే ఆ గోమాత పాలను తన పిల్లవానికి త్రాగించాలనే ఉబలాటంతో ఉన్న రాణి, ఆవు పాలు ఇవ్వకపోవడంతో, రాజుగారికి ఫిర్యాదు చేస్తుంది. చోళరాజు ఆవుల కాపరిని తీవ్రంగా దండిస్తాడు.



దాంతో ఆ ఆవును రహస్యంగా వెంబడించిన గొల్లకాపరి, ఆ గోమాత పుట్టలో పాలు కార్చడం గమనించి గొడ్డలితో గోవుపై వేటు వేస్తాడు. ఆవు ప్రక్కకు తప్పుకోగా, పుట్టలో దాగున్న వేంకటేశుడు ఒక్క ఉదుటన లేవడంతో గొడ్డలి దెబ్బఆయన తలకు తగిలి రక్తం చిందింది.

## గొల్లవానికి ప్రథమ దర్శన భాగ్యం

గోమాతను గొడ్డలితో దండించబోవడం వల్ల, కోపోద్రిక్తుడైన స్వామి గొల్లకాపరిని పరుషవాక్కులతో మందలిస్తాడు. శ్రీనివాసుని నుదుటిపై తగిలిన గాయం నుంచి ధారగా కారుతున్న రుధిరాన్ని చూసి కలవరపడిన గొల్లవాడు తీవ్రంగా భీతిల్లి, క్షమాభిక్ష వేడుకుంటూ అక్కడికక్కడే మరణిస్తాడు.

మృతుడై పడివున్న గొల్లవానిని కరుణించిన శ్రీనివాసుడు "ఈ భూలోకంలో తొలిసారిగా నన్ను చూసిన ఈ గొల్లవాని సుకృతం గొప్పది. అందువలన కలియుగాంతం వరకు ప్రతిరోజూ మొట్ట మొదట నన్ను దర్శించుకునే మహద్భాగ్యాన్ని ఈ గోపకుని సంతతికి కలిగేట్లు అనుగ్రహిస్తున్నాను" అని వరమిస్తాడు. ఆనాటి నుండి నేటివరకు గొల్లవాని సంతతే వంశపారంపర్యంగా ఆనందనిలయంలో దివ్యమంగళమూర్తిని తొలిగా దర్శించుకుంటున్నారు. అలాగే ప్రథమ తాంబూలం కూడా సన్నిధి గొల్లకే ఇస్తారు. సుప్రభాత సేవలో భాగంగా లాంఛన ప్రాయంగా బంగారు వాకిళ్ళు తెరిచే సమయంలోనూ, తోమాల, ఏకాంత సేవల్లో శ్రీవారి ఉత్సవ మూర్తులను ఆనందనిలయం బయటకు లేదా లోనికి తీసుకు వెళ్ళేటప్పుడు, వీరి సేవలు అమూల్యం. వారి భావి తరాలకు కూడా ఈ మహద్భాగ్యం యుగాంతం వరకు కలుగుతూనే ఉంటుంది.

ఆ గొల్లల గుర్తుగా ప్రతి సంక్రాంతికీ కనుమ నాడు అత్యంత వైభవంగా జరిగే "పార్వేట ఉత్సవం" గురించి ముమ్ముందు తెలుసుకుందాం.

## ఆలమందలతో అనుబంధం

స్వామివారి ఆకలి దప్పులను తీర్చిన గోమాత పేరు "గౌతమీ ధేనువు". స్వామివారు సుప్రభాత సమయాన మేల్కొన్న వెంటనే, తొట్టతొలిగా వెచ్చని ఆవుపాలను స్వీకరిస్తూ ఆ గోమాత సంతతిని కూడా అనుగ్రహిస్తూనే ఉన్నారు. ద్వాపరయుగంలో గోకులం, వెన్నముద్దలతో చిన్నికృష్ణునికి ఉన్న అనుబంధం అలాగే కొనసాగుతూ, ఈ కలియుగంలో సన్నిధి గొల్ల పట్ల వేంకటేశుని వాత్సల్యానికీ మరియు వారి దినచర్య ఆవుపాల సేవనంతో ప్రారంభించటానికి దారి తీసిందేమో!

## బ్రహ్మ - రుద్రులకు శ్రీవారి అనుగ్రహం

అలాగే గోమాత రూపంలో పాలందించిన బ్రహ్మదేవునికి ప్రతిరోజు నిశిరాత్రి వేళలో, బంగారు వాకిలి ద్వారాలు తెరువక ముందే తనను సేవించుకునే మహద్భాగ్యాన్ని కలిగించాడు శ్రీనివాసుడు. "బ్రహ్మతీర్థం" గురించి మనం ముందుగానే తెలుసుకున్నాం.

ఆవు వెంట దూడగా వచ్చిన పరమశివునికి తిరుమల ఆలయ "క్షేత్రపాలకునిగా" ఉండే మహద్భాగ్యాన్ని ప్రసాదించారు. అందువల్లనే ఆలయ ధ్వజస్తంభ మంటపంలో, ఈశాన్యదిక్కున్న క్షేత్రపాలకుడైన శివునికి గుర్తుగా ఈరోజుకూ ఉన్న "క్షేత్రపాలక శిల"పై ప్రతిరోజూ అర్చకులు బంగారు వాకిలి తాళం చెవులను తాకించి నమస్కరిస్తారు. ఈ శిలలో కొంతభాగాన్ని, చిన్న "బలిపీఠం" రూపంలో నేడూ మనం చూసి తరించవచ్చు. దీనిని గురించి వెలుగులో ఉన్న ఓ ఆసక్తికరమైన ఐతిహ్యం మరోసారి

తెలుసుకుందాం.

ఇలా స్వామివారు తనను సేవించిన భక్తులందరికీ తరతరాలుగా తన కృపాకటాక్షాలు అందజేస్తూనే ఉన్నారు.

## కుమ్మరి భీమన్న

పూర్వం ఆకాశరాజు (శ్రీనివాసునికి మామగారు) తమ్ముడైన ''తొండమానుడ''నే చక్రవర్తి శ్రీవారి పాదాలకు అనునిత్యం బంగారు తులసిదళాలతో డాంబికంగా సహస్ర నామార్చన చేస్తూ,



తనలాంటి భక్తుడెక్కడా ఉండడని గర్వపడుతూ ఉండేవాడు. మనం ఈనాడు చూస్తున్న, సాక్షాత్తు ఆ శ్రీనివాసుడు నివసించే ఆనందనిలయాన్ని నిర్మించిన మహానుభావుడే ఈ చక్రవర్తి.

## సువర్ణ పుష్పాల స్థానంలో మట్టిపువ్వులు

ఒకనాడు ఉదయాన్నే తొండమానుడు స్వామివారి దర్శనానికి వచ్చినప్పుడు తన బంగారు పుష్పాల స్థానంలో బంకమట్టి పూలు కనిపించాయి. దానితో ఖంగు తిన్న తొండమానుడు ఒకింత నిరాశతో శ్రీనివాసుణ్ణి ఇదేమని ప్రశ్నించగా, శ్రీవారు కుమ్మరి భీమన్న వృత్తాంతాన్ని తొండమానునికి విశదపరిచారు. ఆరోజుల్లో భక్తులతో మానవభాషలో సంభాషించే శ్రీనివాసుడు తరువాతి కాలంలో తొండమానునిపై అలక వహించి ప్రత్యక్షంగా మాట్లాడటం విరమించారు. ఆ వృత్తాంతాన్ని మరోసారి ప్రస్తావించుకుందాం.

## శ్రీనివాసుడు ఉటంకించిన భీమన్న భక్తి తత్పరత

శ్రీవారికి అత్యంత ఆప్తుల్లో ఒకడైన ''భీమన్న'' అనే కుమ్మరివాడు ఆలయానికి అవసరమైన కుండలను తయారు చేస్తూ, తన ఇంటిలోనే స్వామివారిని కొయ్యబొమ్మగా ప్రతిష్ఠించి, తన చేతివ్రేళ్ళకు అంటినట్టి మట్టితో చేసిన పువ్వులతో అత్యంత భక్తి శ్రద్ధలతో శ్రీనివాసుణ్ణి నిత్యం పూజించేవాడు. ఉదయం నుండి రాత్రి వరకు ఏ పని చేస్తున్నా స్వామినే ధ్యానించేవాడు. అతని ధ్యాసంతా శ్రీవారికి కావలసిన కుండలు తయారు చేయడం మీదనే ఉండేది. రెక్కాడితే గాని డొక్కాడని భీమన్న నిరుపేదతనం శ్రీనివాసుని పట్ల అతనికున్న అపారమైన భక్తిని, సమర్పణా భావాన్ని ఏమాత్రం సడలించలేకపోయింది. ప్రతిరోజూ చద్ది ఆరగించి, నీవే ఈ పని చేయించుకుంటున్నావంటూ శ్రీవారికి నమస్కరించి పని ప్రారంభించేవాడు. అతను తయారు చేస్తున్న ప్రతి కుండలో స్వామివారు ఆరగిస్తున్నట్లు భావించి, అత్యంత భక్తి శ్రద్ధలతో తన పని చేసుకునేవాడు. ప్రతిరోజూ కుండలను స్వయంగా కొండమీదికి తెచ్చి సమర్పిద్దామనుకునేవాడు కానీ, మరునాటికి కావలసిన కొత్త కుండలు తయారు చేయలేనేమో అనే బెంగతో, వేంకటాచలం మీదకు వెళ్ళే కార్యక్రమాన్ని వాయిదా వేసుకునేవాడు.

స్వామి ప్రతిరోజూ ఆ కుమ్మరి సమర్పించిన మట్టి కుండలలో నైవేద్యం ఆరగించడమే కాకుండా, అతడు భక్తిపూర్వకంగా అర్పించిన మట్టిపూలను కూడా పరమానందంగా స్వీకరించేవారు. తొండమానునికి ఆనందనిలయంలో స్వామి పాదాల చెంత, తన బంగారు పూలకు బదులుగా కనిపించినవి ఆ పుష్పాలే.


## భీమన్న గృహానికి తొండమానుని ఆగమనం

భీమన్న భక్తి తత్పరతను సాక్షాత్తు శ్రీనివాసుని ద్వారా విన్న తొండమానునికి అహంకారపు తెరలు తొలగిపోయాయి. ఆడంబరాల కంటే ఆత్మసమర్పణే ముఖ్యమని విదితమయింది. శ్రీనివాసుని అనుగ్రహానికి అంతగా నోచుకున్న భీమన్నను చూడాలనే తీవ్రమైన కాంక్షతో, తన పరివారాన్నంతటినీ కొండపైనే వదిలి, ఒంటరిగా కాలినడకతో, అలిపిరి సమీపంగా ఉన్న భీమన్న గృహానికి వెళతాడు. తిరుమలకు వెళ్ళే అలిపిరి మెట్ల దారిలో, తలయేరు గుండు దాటిన తరువాత, ఆ కాలంలో భీమన్న నివాసంగా చెప్పబడే ప్రాంతంలో ''కుమ్మరిసారె'' గుర్తులున్న శిలాఫలకాలను, భీమన్న కుటుంబీకుల బొమ్మలను నేడు కూడా చూడవచ్చు. ఆ కాలంలో, ఆ ప్రదేశంలో శ్రీవారి గుర్తుగా భీమన్న నిర్మించినట్లుగా చెప్పబడే ''గోపురం'' ఇప్పుడు కాలగర్భంలో కలిసిపోయింది.

విరామం లేని ఒంటరి ప్రయాణం వల్ల, అలసి సొలసి తన ఇంటిముందు అచేతనంగా పడి ఉన్న చక్రవర్తిని చూసిన భీమన్న, తన వల్ల ఏం తప్పిదం జరిగిందా అని కలవరపడతాడు.

## శ్రీనివాసుని సాక్షాత్కారం

అంతలో భీమన్న సపర్యల వల్ల స్పృహలోకి వచ్చిన తొండమానుడు చూస్తుండగానే, అక్కడ శ్రీనివాసుడు ప్రత్యక్షమయ్యాడు. శ్రీవారి దివ్యమంగళ రూపాన్ని గాంచిన భీమన్న ఆనందాశ్చర్యాలతో నోట మాట రాక తడబడతాడు.



కొంతసేపటి తరువాత తెప్పరిల్లిన భీమన్న, శ్రీవారిని పరి పరి విధాలుగా తనదైన పామర భాషలో కీర్తిస్తాడు. మంత్ర తంత్రాలు, పూజా విధానాలు తనకు తెలియనందున క్షమించమని శ్రీనివాసుణ్ణి ఆర్తిగా ప్రార్థిస్తాడు.

## మట్టిమూకుడులో స్వామివారికి నైవేద్యం

స్వామివారికి నివేదిద్దామని చూస్తే, ఆ నిరుపేద ఇంటిలో ఏమీ కనపడవు. అలా చింతాక్రాంతుడై ఉన్న భీమన్నను ఓదార్చుతూ శ్రీనివాసుడు, ''జపతపాల కన్నా అచంచలమైన భక్తే నాకు మక్కువ. నీవు తింటున్నదే నాకూ పెట్టు. అవే నాకు పంచభక్ష్య పరమాన్నాలు. నాకు ఆకలిగా ఉంది'' – అని భీమన్నను సమాధానపరుస్తాడు.

అప్పుడా కుమ్మరి భార్య ఇంట్లో సిద్ధంగా ఉన్న ఒక పగిలిన పెంకులో సంకటి పెట్టి స్వామివారిని ఆరగించవలసిందిగా వేడుకుంటుంది. ప్రేమతో ఆ ఆహారాన్ని స్వీకరించిన స్వామి యొక్క పాదాలకు నమస్కరించగానే, ఆ పరమ పవిత్ర స్పర్శతో భీమన్న దంపతులు దివ్యశరీరాలు ధరించి, దేవ దుందుభులు మ్రోగుతుండగా, పుష్పక విమానంలో వైకుంఠానికి పయనమవుతారు.

## తొండమానుని పశ్చాత్తాపం

ఈ ఉదంతాన్ని కళ్ళారా కాంచిన తొండమానుడు భీమన్న నిరాడంబరమైన భక్తిని శ్లాఘిస్తూ, తాను అహంకారాన్ని విడనాడానని, తన తప్పిదాన్ని మన్నించి తనను కూడా తరింపచేయమని శ్రీనివాసుణ్ణి ప్రార్థిస్తాడు. సంతృప్తి చెందిన స్వామివారు, తొండమానునికి దివ్యోపదేశం గావిస్తూ, నిర్మలమైన బుద్ధితో తపః సాధన సాగిస్తే మరుజన్మలో మోక్షం సిద్ధిస్తుందని వరమిస్తాడు. ఆ తరువాత తొండమానుడు నిరాడంబరమైన భక్తితో స్వామిని చాలాకాలం సేవించి, మరుజన్మలో మోక్షాన్ని పొందుతాడు.

ఇప్పటికీ శ్రీవారు ఆ మహాభక్తుడైన కుమ్మరి భీమన్న గుర్తుగా, మట్టిపెంకులో (సగం పగిలిన కొత్త మట్టికుండ) పెరుగన్నాన్ని ప్రతిరోజూ ప్రాతః సంధ్య వేళలో తొలినైవేద్యంగా స్వీకరిస్తూ, భీమన్నను, అతని వారసులను అనుగ్రహిస్తూనే ఉన్నారు. ఈ ఒక్క నైవేద్యాన్ని మాత్రమే కులశేఖరపడి దాటి, గర్భాలయంలోనికి తీసుకెళ్ళి నివేదిస్తారు. వాడిన కుండ మళ్ళీ వాడకుండా, ప్రతిరోజూ కొత్త కుండలో నైవేద్యం సమర్పిస్తారు. అన్నమయ్య, శ్రీవారిని ''తోమని పళ్ళాల వాడని'' కీర్తించడంలోని అంతరార్థం ఇదే.

మిగిలిన సమస్త నైవేద్య విశేషాలన్నింటినీ, గర్భాలయం బయట నుంచే నివేదిస్తారు.

అదీ శ్రీవారు తన భక్తుల యెడ చూపించే వాత్సల్యం.

తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య, మనందరికీ సుపరిచితమైన ''కొండలలో నెలకొన్న.... కుమ్మరదాసుడైన కురువరతి నంబి'' అంటూ, కుమ్మరి భీమన్నను తన కీర్తనలో చిరంజీవిని చేశాడు.

ఆ విధంగా తొలి దర్శనం ఓ గొల్లవానికిచ్చే గోవిందుడు, తొలి నైవేద్యం ఓ కుమ్మరితో తయారు చేయబడ్డ కుండపెంకులో ఆరగిస్తాడు.

అల్పసంతోషి అయిన ఆ అఖిలాండ నాయకునికి ఆడంబరాలు, అట్టహాసాలు అవసరమా? నిరాడంబరమైన భక్తితో ఆయన్ను ధ్యానిస్తూ, ఆయన సృష్టిలో భాగమైన ఓ అన్నార్తునికి పట్టెడన్నం పెట్టడం శ్రీవారికి నిజమైన సేవ కాదా?

**(సశేషం)**

# కర్మఫలం

**"నా భుక్తం క్షీయతే కర్మ కల్పకోటి శతైరపి**
**అవశ్య మనుభోక్తవ్యం, కృతమ్ కర్మ శుభాశుభమ్"**


మనం చేసిన పాపకర్మల, పుణ్యకర్మల ఫలితాలను మనం తప్పక అనుభవించాల్సిందే. అనుభవించకుండా కోట్లకొద్దీ బ్రహ్మకల్పములు గడిచినా చేసిన కర్మ నశించదు అని శాస్త్ర వచనము. ఆ కర్మ మనల్ని ఎలా వెంటాడుతుందంటే...

**"యథా ధేను సహస్రేషు వత్సో విందతి మాతరమ్**
**తథా పూర్వకృతం కర్మ కర్తార మనుగచ్ఛతి"**

వేలాది గోవులున్న ఆలమందలో లేగదూడ తన తల్లిని గుర్తించి ఎలా తనవద్దకు చేరుతుందో, ఆ విధంగా గతంలో మనం చేసుకొన్న కర్మఫలం మనలను చేరుతుందని పై పంచతంత్ర శ్లోక భావం.

''తత్రాస్య స్వకృతం కర్మ ఛాయేవానుగతం సదా''. స్వయంకృతమైన కర్మఫలాలు మనలను జన్మ జన్మలకూ నీడలా అనుసరిస్తాయి. కర్మల ననుసరించే సకల ప్రాణుల యొక్క జనన మరణాలు సంభవిస్తుంటాయి. ''స్వకర్మవశతః సర్వజంతూనాం ప్రాభవాప్య'' అని శాస్త్ర వచనం. దీనికి ఎంతటి వారైనా మినహాయింపు కాదు. ఈ అంశాన్ని వివరించే మహాభారత గాథ ఒకటుంది.

మాండవ్యుడనే మహర్షి మహా తపశ్శాలి. మౌనదీక్షతో, బాహ్య స్మృతి లేకుండా, నిరంతరం తపస్సులో గడిపేవారాయన. రాజధాని పొలిమేరలలో ఉన్న ఆయన ఆశ్రమాన్ని కొందరు దొంగలు తాము దోచుకొచ్చిన ధనాన్ని దాచుకొనేందుకు మంచి ప్రదేశంగా ఎన్నుకొన్నారు. ఎందుకంటే మాండవ్య మహర్షి కళ్ళు తెరవకుండా సదా తపస్సులోనే ఉంటాడు. కనుక తమను, తాము దాచిన సంపదను, ఆయన చూడలేదు. ముని ఆశ్రమం కనుక రాజభటులకు ధనము అక్కడుంటుందనే అనుమానం రాదు. ఇలా కొంతకాలం సాగింది. ఒకనాడు ఆ దొంగలు రాజుగారి కోశాగారాన్ని కొల్లగొట్టి, యథాప్రకారం మాండవ్యుని ఆశ్రమం చేరుకొన్నారు. రాజభటులు దొంగలను వేటాడుతూ ఆశ్రమంలో ప్రవేశించారు. దొంగలు ధనం అక్కడ వదిలి పారిపోయారు. ఆశ్రమ ఆవరణలో తపోదీక్షలో ఉన్న మాండవ్యుని ఎదుట నిలిచి భటులు ఆ దొంగల గురించి ప్రశ్నించారు. బాహ్య ప్రపంచంపై ధ్యాసే లేని ఋషి వారికి ప్రత్యుత్తర మివ్వలేదు. ఆశ్రమంలో దోపిడీ సొమ్ము దొరకడంతో మునివేషంలో ఉన్న దొంగగా మాండవ్యుడిని భావించి, ఆయన పెడరెక్కలు విరిచి బంధించి రాజసభలో



ప్రవేశపెట్టారు భటులు.

స్వయంగా మహారాజు ప్రశ్నించినా సమాధానమీయకుండా, కళ్ళు తెరవక, తపస్సమాధిలో ఉన్న మాండవ్యునిపై రాజుగారికి కూడా అనుమానం కలిగి అతనికి కొరత వేయించాడు. కొరత వేయడమంటే ఒక శూలాన్ని నిలువుగా నేలలో పాతి, దాని కొనను దోషి క్రింది భాగంలో గుచ్చుకొనేటట్లుగా ఆ శూలంపై కూర్చోబెడతారు. శూలం నెమ్మది నెమ్మదిగా దోషి దేహాన్ని చీల్చుకుంటూ, చిత్రవధకు గురిచేస్తూ, కంఠం వరకూ వచ్చి అతని ప్రాణం తీస్తుంది. ఆ బాధను భరించలేక చాలామంది తమ అపరాధాన్ని అంగీకరించి క్షమాభిక్షను వేడుకుంటారు. కానీ మాండవ్యుడు తన తపోదీక్షను కొనసాగిస్తూనే ఉన్నాడు తప్ప కళ్ళు తెరవలేదు. నోరు విప్పలేదు. ఆ రాత్రి కొందరు దేవర్షులు పక్షుల వలె వచ్చి మాండవ్యుని పరామర్శించటం చూచి రాజభటులు ఆ విషయం రాజుగారికి చెప్పగా, ఆయన పరుగు పరుగున మాండవ్యుని వద్దకు వచ్చి క్షమించమని వేడుకొన్నాడు. శూలంపైన నుండి ఆయనను దింపించి రాజు ఆ శూలాన్ని తీసివేసి, తగిన వైద్యం చేయమని రాజభటులకు పురమాయించాడు.

కానీ ఆ శూలం పూర్తిగా ఊడిరాక ఋషి దేహంలో కొంతభాగం మిగిలి మిగతాభాగం బయటకు తీసివేయబడింది. అప్పటినుండి ఆయన ''అణి మాండవ్యుడు'' అని పిలువబడ్డాడు. 'అణి' అంటే ఇనుప చీల / మేకు అని అర్థం.

తర్వాత కాలగతిలో మాండవ్యుడు యమపురికి వెళ్ళాడు. ''రాజుగారి చేత అంతటి క్రూరశిక్ష తనకు ఎందుకు విధించబడింది?'' అని మాండవ్యుడు యముని ప్రశ్నించాడు. ''మహర్షీ! నీ బాల్యంలో నీవు తూనీగలను పట్టుకొని వాటి దేహాలకు చిన్న చిన్న సూదులను గ్రుచ్చి ఆనందించేవాడివి. ఆ కర్మఫలం ఇప్పుడిలా అనుభవించావని'' యముడు బదులిచ్చాడు. దాంతో మాండవ్యుడు మిక్కిలి కోపించి, తెలిసీ తెలియని వయసులో చేసిన చిన్న తప్పుకు నాకు ఇంతటి క్రూరమైన శిక్షను విధించావు కనుక నీవు దాసీ పుత్రుడవై జన్మించమని యమునికి శాపమిచ్చాడు.

ఆ శాప ఫలితంగా యముడు వ్యాసుని వలన దాసీ గర్భమరు నుండి విదురునిగా జన్మించాడని మహాభారత గాథ చెబుతోంది.

14 సంవత్సరాల లోపు వయసున్న పిల్లలు ఏమి చేసినా అది తప్పు కాదనీ, ఆ వయసులో వారికి ఎవరు అపకారం తలపెట్టినా అది నేరమని మాండవ్యుడు ఒక న్యాయ సిద్ధాంతాన్ని కూడా రూపొందించాడు. అదే రూపాంతరం చెంది ఇప్పుడు జువెనైల్ యాక్ట్ గా ఉంది.

తెలిసి ముట్టుకున్నా, తెలియక ముట్టుకున్నా నిప్పు ఎలా కాల్చి తీరుతుందో, తెలిసి చేసినా, తెలియక చేసినా కర్మఫలం అలాగే మనలను వెంటాడుతుంది. దీనినే మనం ప్రారబ్ధం, విధిలీల, దైవలీల అని అనుకుంటూ ఉంటాము. ఇది మన సంస్కృతిలోనే కాక, పాశ్యాత్య సంస్కృతిలో కూడా ఉంది. పాశ్చాత్యులు దీనిని ఫేట్ అంటారు. కింగ్ లియర్ అనే ఆంగ్ల నాటకంలోని తూనీగలు చిలిపి పిల్లల చేతులలో క్రీడా వస్తువులై రకరకాలుగా హింసకు గురైనట్లుగా దేవుళ్ళ చేతిలో మనమూ ఆటబొమ్మలమై శిక్షింపబడుతూ ఉంటాము అని అర్థం. అయితే కర్మఫలాన్ని జ్ఞానమనే అగ్ని చేత నశింపచేయవచ్చునని భగవద్గీత నాలుగవ అధ్యాయంలో 19వ శ్లోకం సూచిస్తోంది. అయితే దానికి నిష్కామ కర్మాచరణాదుల ద్వారా జ్ఞానార్జన చేయడమొక్కటే మార్గం.

★★★

# జపం చేయడం

– కౌతా నిర్మల

జపం చేయడమంటే గురువుగారి ద్వారా ఒక మంత్రాన్ని ఉప దేశం పొంది లేదా భగవంతుని నామజపాన్ని కానీ ప్రతిరోజూ పఠించడం. దైవభక్తిలో, యోగధ్యానంలో జప మంత్రాన్ని పఠించడం ఒక భాగం. జపం చేయటానికి కాల నియమం కానీ, దీక్ష, హోమాలు అవసరం లేదు అని బ్రహ్మోత్తర ఖండం తెలిపింది. అగస్త్య సంహిత జపం చేయడానికి అందరూ అర్హులేనని చెప్పింది. జపం చేసేవారు నేలమీద కూర్చుని జపం చేయకూడదు. తప్పకుండా ఆసనం ఉండాలి. దర్భాసనం, కృష్ణాజినం లేదా పీట మీద కూర్చుని జపం చేయాలి.

జపం మూడు విధాలుగా ఉంటుంది.

1. **వాచికం** – మంత్రాన్ని లేదా భగవంతుని నామాన్ని తన చుట్టూ ఉన్నవారికి వినిపించేలా జపించటాన్ని వాచికం అంటారు.
2. **ఉపాంశువు** – తనకు సమీపంలో ఉన్నవారికి మాత్రమే వినిపించేలా జపమంత్రాన్ని పఠించడం ఉపాంశువుగా చెప్పబడింది.
3. **మానసికం** – బయటకు శబ్దం రాకుండా మనస్సులోనే మంత్రాన్ని జపించటం మానసికం అవుతుంది.

ఈ మూడింటిలోనూ మానసిక జపం శ్రేష్ఠమయినది. సాధారణంగా జపాన్ని చేయటానికి జపమాలను ఉపయోగిస్తారు. అయితే జపమాలలు ఎన్నో రకాలు ఉన్నాయి. రుద్రాక్షలు, పగడాలు, ముత్యాలు, శంఖాలు, స్ఫటికాలు, తులసిపూసలు, తామరపూసల మాలలతో జపం చేస్తారు. జపమాలలో 108 పూసలు ఉంటాయి. మాలలో ఉండే పెద్ద పూసను మేరువు పూస అంటారు. ఈ మేరువు పూస లెక్కలోకి రాదు.

జపం చేయబోయే ముందు జపమాలను శుభ్రపరచాలి. జపాన్ని చేసేటప్పుడు పద్మాసనాన్ని వేసుకుని కూర్చోవాలి. జపమాలను కుడిచేతిలో ఉంచుకుని, ఆ పూసలను ముందుకు జరుపుతూ జపం చేయాలి. జపం చేసే సమయంలో, జపమాల పూసలను జరుపుతూ జపమంత్రాన్ని పఠించాలి. జపాలలో మానసిక జపమే ఉత్తమమయినది.

రుద్రాక్షలతో జపం చేస్తే ఆత్మజ్ఞానం, జ్ఞానవృద్ధి కలుగుతాయి. పగడాల మాలతో జపం చేయడం వల్ల సద్గుణాలు అలవడుతాయి. ఐశ్వర్యాభివృద్ధి కలుగుతుంది. ముత్యాలతో జపం శుభప్రదం. శంఖాలతో జపం చేస్తే విష్ణుమూర్తి అనుగ్రహం లభిస్తుంది. తులసిపూసలతో జపమాచరిస్తే శుభప్రయోజనాలు చేకూరుతాయి. స్ఫటికమాలతో జపం చేయడం వల్ల వారి అభీష్టాలు నెరవేరుతాయి. తామరపూసల మాలతో జపం చేయడం వల్ల వైరాగ్యభావనను కలిగిస్తుంది. సుఖ దుఃఖాలకు చలించకుండా తామరాకు మీద నీటిబొట్టు లాగా ఉంటారు.

జపాన్ని చేయడం వల్ల సానుకూల దృక్పథం ఏర్పడుతుంది. పాజిటివ్ వైబ్రేషన్స్ ఏర్పడి, ఎంతో శక్తిని కలిగిస్తుంది. దుష్టశక్తులేవీ దరిచేరలేవు. మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. భగవంతుని అనుగ్రహం పొందవచ్చు. వేదమాత అయిన గాయత్రీదేవి మంత్రానికి సవిత అధిష్ఠాన దేవత. ఆమె మంత్రాన్ని జపించడం వల్ల పాపాలు హరించబడతాయి. ఆధ్యాత్మిక భావం పెరిగి, ఆధ్యాత్మిక చింతన బలపడుతుంది.

మహామృత్యుంజయ మంత్రాన్ని జపిస్తే మృత్యుభయం, అనారోగ్యాలు తొలగిపోతాయి. అకాల మరణం ఏర్పడదు. నమఃశివాయ అన్న మంత్రంలో ఐదు అక్షరాలు ఉంటాయి. దీన్ని పంచాక్షరీ మంత్రం అంటారు. ఈ మంత్రం ముందు ఓం చేర్చి జపించినట్లయితే శారీరక, మానసిక బాధలు, సమస్యల నుంచి నివారణ కలుగుతుంది. మానసిక ప్రశాంతత ఏర్పడుతుంది. శివానుగ్రహాన్ని పొందుతారు.

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**

(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)


**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము

ఈ రాశి స్త్రీ పురుషులు ఆరోగ్యమునకు చాలా జాగ్రత్తలు పాటించగలరు. ఆయుర్వేదంతో నివారణ. వ్యక్తిగత సమస్యలు, ఉద్రేకంగా ఉండరాదు. చాలా విషయాల్లో ఆచితూచి వ్యవహరించండి. నిర్లక్ష్యం వలన అనేక విధములుగా నష్టములు ఉన్నవి. ఎవరికి హామీ ఉండరాదు. దైవరాధన చేయండి.

## వృషభరాశి

కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులు మనసులో ఏకాగ్రత తగ్గి పరిపరి విధములుగా ఆలోచన చేయగలరు. తక్కువగా మాట్లాడండి. అప్పుడే ఆనందం. మీరు మంచి మనసుతో ముందుకు సాగండి. ఎన్ని సమస్యలు వచ్చిన తలవంచండి. తలమీదుగా పోవును. నవగ్రహ జపదానములు అమ్మవారి పూజలు చేయండి.

## మిథునరాశి

మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు ఆదాయ వనరులు వెసులుబాటు ఉంటుంది. తీర్థయాత్రలు. ఆనందంగా, సంతృప్తికరంగా మనసు ఉంటుంది. గ్రామదేవత ఆరాధన, దుర్గాదేవికి పూజలు వలన సుఖప్రదమైన ఆలోచనలు కలిగి జీవన విధానంలో నూతనంగా మార్పులతో ఆనందంగా ఉంటారు.

## కర్కాటకరాశి

పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ఆకస్మిక ధనలాభం. శత్రువులు మిత్రులు అగుట. కోర్టు కేసులు రాజీమార్గంలో విజయం పొందగలరు. బంధుమిత్రులతో జాగ్రత్తగా మాట్లాడగలరు. అనారోగ్య సూచనలు కలిగి ఉన్నారు. గ్రామ దేవత పూజలు చేయండి.

## సింహరాశి

మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము

ఈ రాశి స్త్రీ పురుషులకు ఖర్చులు పెంచుకొనుటకు అవకాశం ఎక్కువగా ఉన్నవి. కీర్తి ప్రతిష్టలు పెరుగును. శుభవార్తలు అమ్మవారి పూజలలో చాలా అనుకూలంగా ఉంటుంది. అవసరాలకు డబ్బు అందుతుంది. కొన్ని పనులు ఆలస్యంగా అవ్వగలవు. నిర్లక్ష్యం పనికిరాదు.

## కన్యారాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు

ఈ రాశి స్త్రీ పురుషులకు నూతనముగా గ్రామదేవత పూజలు విందులు వినోదములు శుభకార్యములలో బంధుమిత్రులతో అమ్మవారి ఆరాధన ధనలాభము. పోయిన గౌరవమును తిరిగిపొందుట. మనో నిగ్రహం. బంధువులలో అశుభవార్తల వలన కొంత ఆందోళన కలిగించును.

## తులారాశి

చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు ఒక పక్క నుండి ఆదాయం ఉన్నది రెండవ పక్క ఖర్చు ఉన్నది. విద్యార్థులకు మంచి మార్కులు. విదేశీ ప్రయాణములు ఫలించును. శుభములు. వాహన ప్రమాదము ఉన్నది. చాలా జాగ్రత్తగా ఉండాలి. ప్రతి రంగంలో ఉన్నవారికి మెళకువలు పాటించి శకునం చూసి బయలుదేరండి. అమ్మవారి పూజలు గ్రామ దేవత ఆరాధనలు ఫలించగలవు.

## వృశ్చికరాశి

విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు కొన్ని విషయములందు చాలా జాగ్రత్తలు పాటించండి. ఆగి ఆలోచన చేసి ఏ విధమైన విపత్తులో చిక్కుకొనరాదు. ధార్మిక కార్యములందు శ్రద్ధ చూపగలరు. గ్రామదేవత పూజలు అనుకూలించును.

## ధనూరాశి

మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. నిరాశ కలిగి ఉంటారు. గ్రామ దేవతకు ఆదివారం పూజలు చేసి ముందుకు సాగండి. ఇతరులపైన నిందలు మోపరాదు. పని లేటు జరిగినంత మాత్రాన ఏమి ఏవిధమైన విధంగా మనసు గాయం చేసుకొనరాదు. నిబ్బరంగా ముందుకు సాగండి.

## మకరరాశి

ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ప్రయత్న లాభము. కోర్టు వ్యవహారములందు అనుకూలత. స్థిరాస్తి ఏదైనా భూమి, లేక ఏదైన ఖరీదు చేయుటకు అనుకూలమైన రోజులు. ఏవిధమైన దురలవాట్లకు లోనుకారాదు. గ్రామ దేవతా పూజలు శక్తిని అందించగలవు.

## కుంభరాశి

ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా సంతృప్తిగా ఉంటుంది. బంధుమిత్రుల ఆదరాభిమానములు అవసరానికి మించి డబ్బు చేరును. నరముల సంబంధమైన అనారోగ్యములు. కొంచెం ఆలోచన చేయండి. ధనం తొందరపడి ఖర్చు చేయరాదు. అమ్మవారి పూజలు తృప్తి కలుగును.

## మీనరాశి

పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రగతిపథంలో అమ్మవారి పూజలు చేయుట వలన అనేక విధములుగా మనో నిగ్రహం అమ్మదయతో అనుగ్రహంతో నూతన గృహం కారు ఏదైన కొనాలి అని అప్పులు చేయగలరు. తొందరపడరాదు. జాగ్రత్తగా ఉండండి.

# మీ విజ్ఞానం

నిర్వహణ: డా.పి. లలితవాణి

శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. జ్యేష్ఠమాస శుక్ల ఏకాదశిని ఏమంటారు? ..............................
2. బావిలోని గుహలో ఉన్న దేవుడు ఎవరు? ..............................
3. నీళాదేవికి మరోపేరు? ..............................
4. నిర్జల ఏకాదశిని ఎవరు చేశారు? ..............................
5. గోవిందదాసుగారి తల్లి ఎవరు? ..............................
6. జగన్నాథ రథ చక్రాలు ఎవరికి ప్రతిరూపాలు? ..............................
7. సగర పుత్రులు ఎవరి చూపుతో భస్మమయ్యారు? ..............................
8. పురాణాలు ఎన్ని? ..............................
9. కాకి రూపంలో సీతను బాధించిందెవరు? ..............................
10. క్రౌంచ పర్వతం ఎవరి మనుమడు? ..............................
11. బంగారు రథంలో స్వర్గానికి వెళ్ళిందెవరు? ..............................
12. వైకుంఠ లోకానికి సేనాపతి ఎవరు? ..............................
13. శ్రీ వాదిరాజు ఏ సంప్రదాయానికి చెందినవాడు? ..............................
14. నాగలాపురంలోని దేవుని పేరేమిటి? ..............................
15. ధ్వజారోహణ సమయంలోని ప్రత్యేకమైన ప్రసాదం ఏది? ..............................

### గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. సనక సనందనాదులు, 2. 15,000/-, 3. నారదుడు 4. అనంతాళ్వారు, 5. తుందిలుడు, 6. మిహిర, 7. కాలనేమి 8. అనంతాళ్వారు, 9. నూరు యోజనాలు, 10. ప్రతివాద భయంకర అణ్ణన్, 11. వైశాఖ శుద్ధ పంచమి, 12. పిప్పలాద మహర్షి, 13. ఆది శంకరాచార్యులు, 14. అమరనీతి నయనార్, 15. ఛాయాదేవి, సూర్యుడు.

### సరైన సమాధానాలు రాసినవారు

1. వనమాల రామలింగాచారి
2. వుప్పల శ్రీనివాసరావు
3. బులుసు బాబురావు

పేరు: ______________________

చిరునామా: ______________________

______________________

______________________

______________________

పిన్‌కోడ్: ______________________

ఫోన్: ______________________

### లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

వుప్పల శ్రీనివాసరావు



| RNI No.: APTEL/2008/23122 | Postel Registration No: HSE/879/2025-2027 | Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month | Posting at BPC-IV Patrika channel, Nampally, Hyderabad-01. |
|---|---|---|---|





If Un Delivered Please Return to:

**SRI VENKATESHAM,**

(Sri Venkateshwara Maha Mantra Peetham)

H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.


డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు
https://www.srivenkatesham.org లో చదవండి.

Srivenkatesham Magazine in Google Drive
https://drive.google.com/drive/folders/
1jOWBeoUHjF4Qhn4wl-d9eUGIh6kVYyLq